
T.T.D. Religious Publications Series No.
Price :

Published by **Sri M.G. Gopal,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

“తిరుమలక్షేత్రదర్శిని” గ్రంథమాల

# శ్రీ వేంకటేశ్వరస్వామి కైంకర్యాలు

**– అర్చకం రామకృష్ణ దీక్షితులు**



**తిరుమల తిరుపతి దేవస్థానములు,**
**తిరుపతి.**

"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# శ్రీ వేంకటేశ్వరస్వామి కైంకర్యాలు

**రచన**

**అర్చకం రామకృష్ణ దీక్షితులు**

**శ్రీవారి ఆలయ అర్చకులు**

**తిరుమల**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2014**

## SRI VENKATESWARA SWAMY KAINKARYALU

**By**
**Archakam Ramakrishna Deekshitulu**

T.T.D. Religious Publications Series No.
© All Rights Reserved

*First Edition:- 2012*

*Re-Print:- 2014*

Copies: 3000

*Published by :*
**M.G.GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Editor in Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**

**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి"**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేడు. ఇక మీదకూడ ఉండడు – అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయుడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో ప్రస్తుతం శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు రచించిన **'శ్రీ అలమేలుమంగ పట్నం'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తు లీ గ్రంథం ద్వారా వైఖానసఆగమం ప్రకారం శ్రీ స్వామివారికి జరిగే కైంకర్యాలను గూర్చి వివరంగా తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# శ్రీవేంకటేశ్వరస్వామి కైంకర్యాలు

## శ్రీవారి దివ్య వైభవం

తిరుమల ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్రమైన పుణ్యక్షేత్రం. శ్రీ వేంకటేశ్వర స్వామివారు కలియుగానికి అధిపతిగా (కలౌ వేంకటనాయకః), సమస్త మానవాళికి అభయ ప్రదాతగా, ఆర్తిగా ప్రార్థించే భక్తులందరినీ అనుగ్రహిస్తూ, వేంకటాద్రి శిఖరంమీద కొలువైవున్నాడు. శ్రీవారి దివ్యమైనసన్నిధి, అనేక విలువైన సంపదలతో, వెలకట్టలేని అపురూపమైన ఆభరణాలతోను, అనంతమైన ధనసంపత్తి కలిగి, సమస్త పుణ్యక్షేత్రాలకు తలమానికంగా నిలిచివున్నది. తిరుమల ఆలయం, సంవత్సరం పొడవునా జరిగే అనేక విశేషమైన ఉత్సవాలకు ప్రసిద్ధి గాంచినది.

శ్రీవారిఆలయంలో అనాదికాలంనుండి, శ్రీ మహావిష్ణువు అంశతో అవతరించిన భగవాన్ విఖనసమహర్షి ప్రవచించిన శ్రీవైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవములన్నీ అంగరంగ వైభవంగా జరుపబడుతువున్నవి.

శ్రీ శ్రీనివాసస్వామివారికి మొట్టమొదటిసారిగా కైంకర్యములు నిర్వహించిన మహనీయుడైన యోగిపుంగవుడు శ్రీవైఖానస అర్చకుడైన శ్రీమాన్ గోపీనాథ దీక్షితుల వారు. శ్రీవారి మూలవిరాట్ అర్చారూపాన్ని, స్వామి పుష్కరిణి తీరంలో, చింతచెట్టు క్రింది చీమలపుట్టలో, శ్రీ దీక్షితుల వారిచే కనుగొనబడి ప్రస్తుతమున్న చోటనే ప్రతిష్ఠించబడింది.

శ్రీ వేదవ్యాస ప్రణీతమైన భవిష్యోత్తర పురాణం (4,19-21), ఈ చీమల పుట్ట, చింత చెట్టు, స్వామి పుష్కరిణి మరియు తిరుమల కొండను గురించిన నిగూఢమైన విషయాన్ని అద్భుతంగా వివరించింది.

**వల్మీకం దేవకీ సాక్షాత్ వసుదేవోఽథ తింత్రిణీ।**
**బలభద్రః శేషశైలో మధురాభూదధిత్యకా॥**
**స్వామిపుష్కరిణీ తత్ర యమునా చ వ్యరాజత।**

**యాదవశ్చ మృగాః సర్వే ఖగా వై గోపికాదయః।**
**ఏవం శ్రీకృష్ణరూపేణ క్రీడతే వేంకటాచలే॥**

ద్వాపరయుగంలోని శ్రీ కృష్ణపరమాత్మే తిరిగి తిరుమలకొండమీద శ్రీనివాసుడిగా అవతరించాడు. శ్రీకృష్ణపరమాత్మ తల్లి దేవకి చీమలపుట్టగానూ, తండ్రియైన వసుదేవుడు చింతచెట్టు రూపంలో అవతరించి, శ్రీవారిని పుత్రవాత్సల్యంతో ప్రేమగా చూసుకుంటున్నారు. అన్నగారైన బలరాముడు (ఆదిశేషుని అవతారం) శేషాద్రి శిఖరరూపంలోను, యమునానది స్వామి పుష్కరిణిగాను మరియు వీటిని ఆవరించియున్న భూమి మధురానగరంగాను వర్ణించబడింది. బాలకృష్ణునితో ఆటలాడే గోపబాలురు, తిరుమల కొండ మీద మృగాలరూపంలోను మరియు పక్షులన్నీ గోపబాలికలుగా, శ్రీకృష్ణునితో తమ సాన్నిహిత్యాన్ని తిరిగి కొనసాగిస్తూ, భక్తిపారవశ్యంతో స్వామిసేవలో తరిస్తున్నారు. ఎంతచక్కటి వర్ణనో చూడండి!

## శ్రీ వేంకటాచలమాహాత్మ్యం

'శ్రీ వేంకటాచల మాహాత్మ్య గాథ శ్రీ వేదవ్యాసుల వారు రచించిన అష్టాదశ (18) పురాణములలోని, ద్వాదశ (12) పురాణములనుండి సంగ్రహించబడింది. శ్రీ మహావిష్ణువు స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చారూపంలో వేంగడం పర్వతం మీద అవతరించటానికి సంబంధించిన అనేక కథనములు మరియు శ్రీ వేంకటేశ్వరస్వామి – పద్మావతీ అమ్మవార్ల వివాహఘట్టమైన 'శ్రీనివాస కళ్యాణం', ఈ 12 పురాణాల ద్వార తెలుసుకోవచ్చు. అందుకే దీనికి 'ద్వాదశ పురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యం' అని పేరు. ఇది శ్రీ వేంకటేశ్వర స్వామి అవతరణకు సంబంధించిన స్మృతి ప్రమాణం. ఈ గ్రంథాన్ని భక్తులు నిత్య పారాయణ గ్రంధంగా చదువుతారు. 'అర్చావతారం' అనగా అర్చించటానికి వీలుగా ఉన్న 'విగ్రహ' రూపంలో కొలువైన స్వామివారు అని అర్థం. బ్రహ్మ పురాణం, బ్రహ్మాండ పురాణం(తీర్థకాండ), స్కంద పురాణం, భవిష్యోత్తర పురాణం, ఆదిత్య పురాణం, వరాహ పురాణం, పద్మ పురాణం, (క్షేత్రకాండ), గరుడ పురాణం,



మార్కండేయ పురాణం (తీర్థకాండ), వామన పురాణం, బ్రహ్మోత్తర ఖండం, హరివంశం (శేషధర్మోత్తర కాండ) వంటి పన్నెండు పురాణములలో 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' అనేక అధ్యాయాలుగా విస్తరించివున్నది. క్రీ.శ. 1491 వ సంవత్సరానికి చెందిన శ్రీవారి అర్చకస్వామి 'వేంకటత్తురైవార్' (స్నపనం బేరం ఉగ్ర శ్రీనివాస మూర్తి మరొక పేరు) వారి ద్వార 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' అను గ్రంథం తాటి ఆకుల పై వ్రాయబడింది. ఇది అప్పట్లో (14 వ శతాబ్దం) శ్రీవారి ఆలయంలో భక్తుల కొఱకును, దేవతా ప్రీతికై పారాయణం చేసేవారు.

## వేదాలలో శ్రీవారి ప్రశస్తి

నాలుగు వేదాలలో మొదటిదైన ఋగ్వేదంలోని ఒక మంత్రంలో (10.155.1), శ్రీ వేంకటాచలమును గురించిన ప్రస్తావన వుంది. దీనిని బట్టి, తిరుమల శ్రీవారి యొక్క వైభవము మరియు ప్రాచీనత, వేదకాలం నాటిదని స్పష్టమవుతున్నది.

**అరాయికాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే**
**శిరింబిఠస్య సత్త్వభి స్తేభిష్ట్వా ఛాతయామసి॥**

“శిరింబిఠుడు అను ఋషి ఈ విధముగా చెప్పుచున్నాడు. ఓ పురుషార్థ కాముకుడా! నీవు ఐశ్వర్య హీనుడైనను, బాహ్యాంతర దృష్టి హీనుడవైనను, లక్ష్మీసంపత్కరమైన శ్రీ వేంకటాచలం అనే పేరు గల కొండకు వెళ్ళుము. అచ్చట పరమనిష్ఠాగరిష్ఠులు, వేదమార్గానుయాయులైన శ్రీ వైఖానస అర్చకుల చేత ఆరాధింపబడుచున్న శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, జగత్ప్రభువైన శ్రీ శ్రీనివాసస్వామి సన్నిధి ఉంది. శ్రీవారి అనుగ్రహం వలన, కొండపై అడుగుమోపిన తత్క్షణమే సమస్త పాపములు దహించుకుని పోయి, శ్రీవారి దర్శనభాగ్యమువలన సకల ఐశ్వర్యములు సిద్ధించును” అని పై మంత్రమునకు అర్థము (శ్రీ శ్రీనివాస దీక్షితులవారి వ్యాఖ్యానం, శ్రీ పారమాత్మికోపనిషత్ భాష్యంనుండి).

## 'వేంకట' పద నిర్వచనం

'వేంకట' అనే పదం, 'వేంగడం' అనే పదం నుండి వాడుకలోకి వచ్చినది. ప్రాచీనకాలం నుండి 'తిరుమలకొండలు', 'వేంగడం కొండలు'గా సుప్రసిద్ధం. శ్రీ వేంకటాచలమాహాత్మ్యం, 'వేంకట' పదం అర్థాన్ని వివరిస్తూ,

**వేంకారో ఽ మృతబీజం తు కటమైశ్వర్యముచ్యతే ।**
**అమృతైశ్వర్యసంగత్వాత్ వేంకటాద్రిరితి స్మృతః ॥**

**(శ్రీ వరాహపురాణం, పూర్వభాగం, 36 వ అధ్యాయం)**

'వేం' అనగా పవిత్రమైన అమృతం, 'కట' అనగా అనంతమైన సంపద (ఐశ్వర్యం) అని, 'వేంకట' అంటే అమృతమయమైన, అనంతమైన సంపదలకు నిలయం అని శ్రీ వరాహపురాణం వివరిస్తోంది.

**సర్వపాపాని వేం ప్రాహుః కట స్తద్దాహ ఉచ్యతే ।**
**సర్వపాపదహో యస్మాద్ వేంకటాద్రిరిత్యభూత్ ॥**

**(శ్రీ వేంకటాచలమాహాత్మ్యం)**

'వేం' అనే పదం జీవుడు చేసిన పాపములను సూచిస్తుంది. 'కటాః' అంటే సమస్త పాపములను క్షణాలలో దహించివేయగల పర్వతంగా వివరించబడినది. 'వేంకటాద్రి' అంటే సమస్త పాపములను అడుగు మోపిన తత్‌క్షణమే దహించివేయగల అద్భుతమైన, పవిత్రమైన పర్వతము అని అర్థం.

## శ్రీవారి ఆలయ సంప్రదాయములు – పంచబేర ఆరాధన విశేషాలు

తిరుమల శ్రీవారి ఆలయం అనేక ప్రాచీనసంప్రదాయాలు మరియు ఆచారములకు ప్రసిద్ధి గాంచింది. ఈ ఆచార సాంప్రదాయములన్నీ ఈనాటికీ విధిగా అమలు చేయబడుతున్నవి. ఇందులో కొన్ని విశిష్ట సంప్రదాయాలను స్వయంగా శ్రీవారే ఏర్పాటు చేయడం విశేషం.

తిరుమలకు వచ్చిన భక్తులందరి ప్రధాన ఉద్దేశం, శ్రీవారి దివ్యమంగళ అర్చారూపాన్ని కొన్ని క్షణాలపాటు దర్శించి, శ్రీవారి వద్ద తమ సమస్యలు



పరిష్కరించమని వేడుకోవటం. ఈ క్రమంలో శ్రీవారు అపారమైన కరుణతో భక్తులందరికీ దివ్యాశీస్సులు అందజేస్తూ వారిని ఆనందపారవశ్యానికి గురిచేస్తున్నారు. శ్రీవారి దివ్యమైన, అతిసుందరమైన రూపాన్ని తిలకిస్తూ కనులు తిప్పుకోలేని విధంగాఉన్న స్వామిదివ్యరూపాన్ని దర్శించి, భక్తులు తన్మయత్వం పొందుతారు. అందులో ముఖ్యంగా శ్రీ వారిని దర్శించగానే, మొదటగా మనకు కనపడేది, స్వామివారి దివ్యమైన ముఖారవిందంలోని పచ్చకర్పూర నామం. ఈ ఆధ్యాత్మికమైన ఆనందంలో తేలియాడుతూ మనం తీరవలసిన కోరికల గురించి, సమస్యల గురించి మర్చిపోయినా, అపార కరుణామయుడైన స్వామివారు, మనం అడిగినా, అడగకపోయినా, మనకు ఏది సంతోషాన్ని కలిగిస్తుందో, దానినే అనుగ్రహిస్తారు.

భక్తులకు శ్రీవారిని దర్శించుకునే వ్యవధి, రద్దీ రీత్యా కొద్దిసేపు మాత్రమే అవకాశముంటుంది కనుక, ప్రతినిత్యం అర్చకులచే పూజలందుకునే, శ్రీవారి పంచమూర్తులు, ఇతరమూర్తులకు నిత్య ఆరాధనలో భాగంగా నిర్వహించే కైంకర్యాలు, ఆ యా మూర్తుల వివరాలు తెలుసుకోవటం ఆసక్తికరంగా ఉంటుంది. ఇంతేగాక ప్రతినిత్యం ఆలయంలో శ్రీవారి కైంకర్యాలను నిర్వహించే కైంకర్యపరుల గురించి కూడా కొన్ని విశేషాలు తెలుసుకోవటం వలన, శ్రీ వేంకటేశ్వరస్వామికి నిత్యకైంకర్యాలు, ఎలా నిర్వహిస్తారో చక్కగా అర్థమవుతుంది.

## శ్రీవారి కైంకర్యపరులు – సంప్రదాయాలు

### శ్రీమాన్ గోపీనాథదీక్షితుల వారు:

శ్రీవారి ఆలయానికి ప్రథమ అర్చకులు శ్రీమాన్ గోపీనాథ దీక్షితులవారు. వీరు వైఖానస తపస్సంపన్నులు. నేటికీ శ్రీమాన్ గోపీనాథ దీక్షితుల వారి వంశీయులే, శ్రీవారికి వైఖానసాగమోక్తంగా సమస్త పూజాకైంకర్యాలు నిర్వహించడం జరుగుతున్నది. ప్రస్తుతం వీరి వంశంలో 39 వ తరంవారు, శ్రీవారికి వైభవంగా కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. శ్రీవారి స్వయంవ్యక్త సాలగ్రామ అర్చామూర్తి, మూలవర్లను తాకి కైంకర్యాలను నిర్వహించే మహద్భాగ్యం, శ్రీ

వైఖానస అర్చకులకు మాత్రమే శ్రీవారు అనుగ్రహించియున్నారు. వీరి వంశంలో మరొక మహనీయుడు 10వ శతాబ్దానికి చెందిన శ్రీమాన్ శ్రీనివాస దీక్షితుల వారు. వీరు చేసే కైంకర్యాలను సాక్షాత్తు శ్రీవారే స్వయంగా, ప్రత్యక్షంగా స్వీకరించేవారని, అర్చకవంశీయుల చరిత్ర ద్వార తెలుస్తున్నది.

**భగవద్రామానుజులవారు**

శ్రీవారి ఆలయంలో, 11వ శతాబ్దానికి చెందిన, గొప్ప శ్రీ వైష్ణవ ఆచార్యులు, శ్రీ రామానుజాచార్యులవారిచే ఏర్పాటు చేయబడిన ఏకాంగి వ్యవస్థ నేడు పెద్ద జియ్యంగార్ స్వామి, చిన్న జియ్యంగార్ స్వామి, ఏకాంగి వ్యవస్థగా నిర్వహించబడుతున్నది. నేటికీ ఆలయసంప్రదాయం మేరకు, ప్రతి పూజా కైంకర్యాలలోను, వీరు వైఖానస అర్చకుల చేతికందించే పుష్పమాలికలు, తులసీ, అభిషేక ద్రవ్యాలు, కర్పూర హారతులు మొదలైనవి, శ్రీవారికి భక్తిగా సమర్పించబడుతూ ఉన్నాయి.

**బంగారుబావి - పూల బావి**

శ్రీవారి మూలవర్లకు ప్రతి శుక్రవారం నిర్వహించే 'శుక్రవార అభిషేక' కైంకర్యాలలో, ఆలయ సంప్రదాయం ప్రకారం, ఆకాశగంగాతీర్థం మరియు 'శ్రీ తీర్థం'గా పిలువబడే 'బంగారు బావి' జలాలను నేటికీ అభిషేక, ఆరాధనాదులకు ఉపయోగిస్తున్నారు. శ్రీవారి మూలవర్లకు ప్రతినిత్యం రెండు మార్లు సమర్పించే పూలమాలలను సల్లింపు చేసిన తర్వాత, సంపంగి ప్రాకారం లో, ఆలయానికి ఈశాన్యదిక్కున ఉన్న 'భూ తీర్థం'గా పిలువబడే 'పూలబావి' లో సమర్పించే సంప్రదాయం ఉంది.

**శ్రీ తిరుమలనంబి - తీర్థకైంకర్యం**

శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిత్య ఆరాధనకు ఉపయోగించే జలాన్ని, 'ఆకాశగంగ తీర్థం' నుండి సేకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రథమాచార్య పురుషులుగా ప్రసిద్ధి చెందిన శ్రీ తిరుమలనంబి (9-10 వ శతాబ్దం) వారి వంశీయులచే, నేటికీ ఈ సేవ 'తీర్థ కైంకర్యం' రూపంలో జరుపబడుతోంది.



శ్రీవారి ఆలయ సంప్రదాయాన్ననుసరించి, ప్రతిరోజు సూర్యోదయానికి ముందు (తోమాలసేవకు ముందుగా) తిరుమల నంబి వంశీయులు, శ్రీవారి ఆలయానికి 5 కి.మీ. దూరంలో ఉన్న ఆకాశంగ తీర్థం నుండి మూడు బిందెలలో పవిత్ర జలాలను నింపి, ఆలయ మర్యాదలతో శ్రీవారి ఆలయానికి చేరుస్తారు. ఈ విధముగా ఆరాధనకు తీర్థం సేకరించాలని శ్రీవైఖానస సంహితలలో కూడా చెప్పబడినది. (దుహతాం దివమితి ఘటమాదాయ - నదీ తటాక కూపానామలాభే పూర్వస్యోత్తర ముపతిష్ఠేత - శ్రీ వైఖానస భగవదర్చా ప్రకరణమ్). ఈ 3 బిందెలలో ఒక బిందెను, శ్రీ భోగ శ్రీనివాసమూర్తి వారి నిత్య అభిషేకమునకు, మిగతా రెండు బిందెలను శ్రీవారి ప్రాతఃకాల ఆరాధనకు వినియోగించే సంప్రదాయం వుంది.

**శ్రీ అనంతాళ్వారు - గడ్డం బొట్టు**

తిరుమల శ్రీవారికిమాత్రమే ప్రత్యేకమైన అలంకరణ, శ్రీవారి ముఖమండలంలో, గడ్డమునకు అద్దే పచ్చకర్పూరపు చుక్క! ఇది శ్రీవారి ఆలయ ద్వితీయ ఆచార్యపురుషులు, శ్రీ రామానుజులవారి శిష్యుడైన, శ్రీ అనంతాళ్వారు (11-12 వ శతాబ్దం) వారితో శ్రీవారు జరిపిన లీలలకు గుర్తుగా అలంకరించే సంప్రదాయం అమలులోఉంది. ఈ పచ్చకర్పూరం చుక్కకే 'గడ్డం బొట్టు' అని పేరు. అనంతాళ్వారు విసిరిన గడ్డపార శ్రీవారి గడ్డమునకు తగిలి, గాయం కాగా, ఓషధీ గుణాలు కలిగిన పచ్చకర్పూరంతో గడ్డానికి అద్దగా, రక్తస్రావం నిలిచిపోయింది. ఈ ఘట్టానికి గుర్తుగా నేటికీ ప్రతిరోజు ఉదయం సుప్రభాత సేవ సమయంలో శ్రీవారికి గడ్డంబొట్టుని అలంకరిస్తారు. రాత్రి కైంకర్యంలో తీసివేసి, మరల ఏకాంతసేవకు ముందు గడ్డంబొట్టు పెడతారు. ప్రతి శుక్రవారం అభిషేకం అయిన తర్వాత మాత్రం గడ్డంబొట్టు అలంకరించరు.

**అన్నమయ్య మేలుకొలుపు - లాలిపాటలు**

15 వ శతాబ్దమునకు చెందిన శ్రీవారిపరమభక్తుడు, సుప్రసిద్ధ వాగ్గేయకారుడు, శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారు, శ్రీవారి వైభవం

మీద, మొత్తం 32 వేల సంకీర్తనలు వ్రాసి, గానం చేసినట్లు చరిత్ర ద్వార తెలుస్తోంది. శ్రీవారితో – అన్నమయ్య అనుబంధానికి గుర్తుగా నేటికీ ప్రతినిత్యం సుప్రభాత సేవా సమయంలో శ్రీవేంకటేశ సుప్రభాతంతో పాటుగా, శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారి వంశీయులచే మేలుకొలుపు పాటలు పాడుతూ, శ్రీవారిని మేల్కొలిపే సంప్రదాయం ఉంది. రాత్రి ఏకాంతసేవా సమయంలో శ్రీవారిని నిద్రబుచ్చటానికి అన్నమయ్య వంశీయులు లాలిపాటలు, జోలపాటలు పాడి సంకీర్తనాకైంకర్యాన్ని ఇప్పటికీ నిర్వహిస్తున్నారు.

**తరిగొండవారి హారతి**

శ్రీవారికి ప్రతినిత్యం రాత్రి జరుపబడే చివరిసేవ, 'పవళింపు సేవ'. శ్రీవారికి పరమభక్తురాలైన కవయిత్రి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వారితో జరిగిన శ్రీవారి లీలలకు గుర్తుగా నేటికీ ఆమె వంశీయులచే, శ్రీవారికి చివరి హారతిగా 'ముత్యాల హారతి' అనే కర్పూర నీరాజన సమర్పణ జరుగుతుంది.

**పంచమూర్తుల ఆరాధన**

ప్రాచీన కాలంలో, మొదటగా శ్రీవారి ఆలయంలో, స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చారూపంలో వేంచేసి యున్న, శ్రీ శ్రీనివాస భగవానుడి మూలవర్లకు మాత్రమే పూజలు జరిపేవారు. కనుక మొదట్లో ఇది ఏకబేర ఆలయంగా శ్రీ వైఖానస ఆగమంలో ప్రసిద్ధి చెందినది. 'బేరము' అనగా 'విగ్రహము' అని అర్థం. క్రమేపి, క్రీ.శ.614 వ సంవత్సరంలో, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రంలో చెప్పబడిన విధంగా, కౌతుక బేరంగా, వెండి విగ్రహమైన శ్రీ భోగశ్రీనివాసమూర్తివారి ప్రతిష్ఠ చేయబడింది. అనంతరం క్రీ.శ. 1339 సంవత్సరంలో శ్రీవారి ఉత్సవ బేరమైన శ్రీదేవి–భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి ప్రతిష్ఠ జరిగినది. అంతకు పూర్వం ఉత్సవ మూర్తిగా వ్యవహరింపబడిన, శ్రీదేవి–భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి వారు, ఉగ్ర స్వభావం కారణంగా, నేడు స్నపన బేరంగా పూజలందుకుంటున్నాడు. ఇక ఐదవ మూర్తిగా బలిబేరమైన శ్రీ కొలువు శ్రీనివాసమూర్తి వారికి ఆరాధనలు



జరుగుతున్నాయి. ఈ విధంగా శ్రీవారి ఆలయంలో, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రంలో చెప్పబడిన విశిష్టమైన 'పంచబేర ఆరాధన' అమలులో ఉంది.

శ్రీ వైఖానస సంహితలలో వివరించిన విధంగా, ఆలయంలో జరిగే వైదిక క్రియలకు ఉపయోగించే హోమగుండాలు ఐదు రకాలుగా చెప్పబడింది. అవి సభ్యం, ఆహవనీయం, అన్వాహార్యం, గార్హపత్యం మరియు ఆవసథ్యం. వీటినే పంచాగ్నులని కూడా అంటారు. అమూర్త్యారాధన (విగ్రహం లేకుండా) రూపంలో జరిగే వైదిక హోమక్రియలలో ఏ విధంగా పంచాగ్నులున్నాయో, అదే విధంగా సమూర్త్యారాధన (విగ్రహారాధన) లోని పంచమూర్తులు, ఈ పంచాగ్నులకీ ప్రతీకలు. శ్రీ వైఖానస అత్రి సంహిత సమూర్తార్చనాధికరణంలో చెప్పబడిన విధంగా

**పంచానాం స్థాపనం నిత్యం శాంతిపుష్టిసుఖప్రదమ్ ॥**

విష్ణ్వాలయములో పంచబేరములను ఆగమోక్తంగా ప్రతిష్ఠించి నిత్య ఆరాధన చేయడం వలన లోకంలోని ప్రజలందరూ సుఖ శాంతులతో, సుభిక్షంగా ఉంటారు. తిరుమల ఆలయంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి పంచమూర్తులను 'ఆగమ–మంత్ర–వ్యావహారిక' పరిభాషలలో ఈ విధంగా పేర్కొంటారు. 1. 'ధ్రువబేరం–విష్ణు–మూలవిరాట్', 2. కౌతుకబేరం–పురుష–భోగశ్రీనివాసమూర్తి, 3. ఉత్సవబేరం–సత్య–మలయప్పస్వామి,4. స్నపనబేరం–అచ్యుత–ఉగ్రశ్రీనివాసమూర్తి, 5. బలిబేరం–అనిరుద్ధ–కొలువు శ్రీనివాస మూర్తి. ఈ పంచమూర్తులు విష్ణువుయొక్క మహా రూపములైన విష్ణు–మహావిష్ణు–సదావిష్ణు–వ్యాపినారాయణులను సూచిస్తుంది. పరబ్రహ్మ రూపం 'చతుష్పాత్'గా వర్ణించబడినది. పరబ్రహ్మయొక్క నిగూఢమైన, అద్భుతమైన రూపం నాలుగు గుణాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ మహోన్నత గుణాలతో ఉన్న పరబ్రహ్మ రూపాన్ని భక్తులు ధ్యానం చేయాలి. ఇవి విగ్రహారాధనలో భాగంగా, ముక్తి (మోక్షం) పొందటానికి అతి గొప్ప ఫలితాలనిచ్చే సులభమైన మార్గంగా, శ్రీ వైఖానససంప్రదాయంలో చెప్పబడినది.

ఈ పంచమూర్తులలో ఆదిమూర్తి విష్ణువు. ఈ మూర్తి భేదములే మిగిలిన నాలుగు రూపములు. అవి క్రమంగా విష్ణువు, మహా విష్ణువు, సదా విష్ణువు, వ్యాపి నారాయణ మూర్తులుగా నుందురు. విష్ణువు (మూలవిరాట్) అంశమే పురుషుడు (భోగశ్రీనివాసమూర్తి), మహావిష్ణ్వంశమే సత్యస్వరూపుడు (మలయప్పస్వామి), సదా విష్ణ్వంశమే అచ్యుత స్వరూపము (ఉగ్రశ్రీనివాసుడు), వ్యాపినారాయణాంశమే అనిరుద్ధమూర్తి (కొలువు శ్రీనివాసుడు). వీనికి వరుసగా గుణములు వరుసగా ధర్మ, జ్ఞాన, ఐశ్వర్య, వైరాగ్యములు. విష్ణువుతో గూడిన ఈ ఐదు మూర్తులే పంచవ్యూహములు. ఇదియే పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చా స్వరూపములు. ఈ ఐదును పంచ విధ వ్యూహాత్మకమగు శ్రీ మన్నారాయణుని స్వరూపమును ప్రతిబింబింపజేయును.

'విష్ణ్వర్చనానవనీతం' అనే వైఖానస సంహిత, పంచబేరముల గురించి ఈ విధంగా తెలియజేస్తోంది.

**ధృవం తే గ్రామరక్షార్థమర్చనార్థం తు కౌతుకమ్।**
**స్నానార్థం స్నాపనం ప్రోక్తముత్సవార్థమథౌత్సవమ్।**
**బల్యర్థం బలిబేరం చ పంచబేరాన్ ప్రకల్పయేత్॥**

ఒక దేహమునకు ఏ విధంగా అయితే పంచప్రాణాలుంటాయో అదే విధంగా ఒక విమానమునకు ఐదు మూర్తులుంటాయని చెప్పబడింది. ధ్రువబేర ప్రతిష్ఠ సర్వలోకములకు సుఖశాంతి, సమృద్ధిని కలుగజేస్తుంది. సమస్తములైన కామ్యములు పొందుటకు, భక్తులు అర్చకముఖంగా నివేదించే పూజల కొరకు కౌతుకబేరం వుండాలి. ఇక ఆలయంలో వివిధ ఉత్సవాలలో భాగంగా జరిపే స్నపనము (అభిషేకం) కొరకు స్నపనబేరము, ఉత్సవాలను భక్తజనరంజకంగా నిర్వహించడానికి ఉత్సవబేరము, ఆలయంలోని పరివార దేవతలకు నివేదనాదులను పర్యవేక్షించడానికి బలిబేరమును. విధిగా ప్రతిష్ఠించి ఆరాధించవలెను.

శ్రీ వారి గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి పంచమూర్తులతో పాటు, శ్రీ సీతాలక్షణ సమేత శ్రీరాములవారికి, శ్రీ రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామివారికి,



శ్రీ సుదర్శన చక్రమునకు, మరియు అనేక సాలగ్రామములకు నిత్యకైంకర్యాలలో భాగంగా పూజలు జరుగుతాయి.

## అర్చారూప సౌలభ్యం

మానవాళిని మోక్షమార్గంవైపు నడిపించటానికి అతి సులువైన మార్గమే శ్రీ మన్నారాయణుని అర్చావతారరూపం. శ్రీ మన్నారాయణుడు భక్తులను అనుగ్రహించుటకై పర,వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపములలో కొలువై వుంటాడు.

**వైకుంఠే తు పరే లోకే శ్రియా సార్ధం జగత్పతిః।**
**ఆస్తే విష్ణురచిన్త్యాత్మా భక్తై ర్భాగవతైస్సహ ॥**

జగత్పతి, తండ్రి యైన శ్రీ మన్నారాయణుడు వైకుంఠస్థానమున భక్తులతో, భాగవతులతోసహా, లక్ష్మిని విడువక పరస్వరూపమున విరాజిల్లును. ఇదియే పరమపదము. ఇది అనేక ఆవరణములతోను, అండములతో నిండి వుంటుంది. ఇక్కడ రాత్రింబవళ్ళుండవు. భూమ్యాకాశములు లేవు. చీకటి వెలుగులు, పంచ భూతములు లేవు. ఇంద్రియముల కందని ప్రధాన పురుషుడొక్కడే వుంటాడు. జగన్మాతయగు శ్రీదేవి విష్ణువునకు అనపాయినిగా నిత్యము విడువకయుండును. నిత్యసూరులైన అనంత, గరుడ, విష్వక్సేనులు ఎల్లప్పుడూ పరమపదంలో స్వామిని సేవిస్తూ వుంటారు. ఇక్కడ ఎల్లప్పుడూ స్వామివారికిష్టమైన సామగానమే వినబడును. ఇది భూమినుండి అనంతమైన దూరంలో వుంటుంది కనుక ఇక్కడి నారాయణున్ని దర్శించటం మానవులకు దుస్సాధ్యమైనది. ఈ స్థూలశరీరంతో పరమపదంలోని స్వామివారిని సేవించడం అత్యంత దుర్లభం.

ముక్తి పొందిన జీవాత్మ సూక్ష్మరూపంలో మాత్రమే ఇక్కడకు చేరి స్వామి వారిని సేవించడానికి వీలవుతుంది.

ఇక రెండవదైన వ్యూహరూపం, క్షీరసాగరం మధ్యలో శేషతల్పంపై శయనించివున్న మహావిష్ణువు, దేవతలకు, ఋషులకు క్షీరాబ్ధినాథుడిగా

దర్శనమిస్తాడు. కనుక ఇది కూడా స్థూలశరీరరూపంలో సేవించడానికి దుర్లభమైన రూపం.

మూడవది విభవఅవతార రూపము. ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అని చెప్పినట్లు, ధర్మస్థాపన కోసం దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయుటకై ఆ యా యుగాలలో శ్రీ మన్నారాయణుడవతరించుటయే విభవరూపములు. ఇవి దశావతారములు.

**మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహో உథ వామనః।**
**రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కీతి తే దశ॥**

ఇది గడచిన చరిత్ర కనుక ఈ రూపములో భగవానుని సేవించటం మానవులకు అసాధ్యం. ఇది గత సంవత్సరం నదులలోని నీరు, నది ఎండిన తర్వాత ఏ విధంగా అయితే మన దాహం తీర్చలేనిదో, అదే విధంగా దర్శింపశక్యం కానిది.

నాలుగవది అంతర్యామి స్వరూపం. అంగుష్ఠమాత్ర రూపములో పరమాత్ముడు అందరు జీవుల హృదయము నందు నివసించును. జఠరాగ్నియగు వైశ్వానరుని రూపమున ప్రాణుల శరీరములో వుండి, ప్రాణాపానాది వాయువులతో కలిసి, మానవులు భుజించే భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యాదులచే నుండు నాలుగురకముల అన్నమును పచనం చేసే తత్వమే అంతర్యామిత్వం. ఇది యోగులు మాత్రమే దర్శింపగలరు. జ్ఞాన యోగ సాధన చేస్తూ కఠోర దీక్షతో వున్నవారికే అంతర్యామిని దర్శింప శక్యమవును.

ఇక ఐదవది అర్చారూపం, అతి ముఖ్యమైనది. శ్రీమన్నారాయణున్ని, స్థూలశరీరంతో, మాంస చక్షువులతో అనుభవం పొంది సులభంగా దర్శించగలిగినది అర్చారూపం. అనేక పుణ్యక్షేత్రములలో స్వయంవ్యక్తం, దివ్యం, సైద్ధం, పౌరాణిక, మానుష విభజనతో అర్చారూపంలో, భక్తులందరి పూజలు స్వయంగా స్వీకరిస్తూ, అత్యంత సులభమైన మార్గంలో మోక్షసాధన కలిగించే రూపం ఇది.



## శ్రీవారి ఆలయంలో వైఖానస ఆరాధన

తిరుమల శ్రీవారి ఆలయమునకు మరియు శ్రీ వైఖానస భగవదారాధనా విధానమునకు, అత్యంత ప్రాచీన కాలం నుండే అవినాభావ సంబంధం ఉందని అష్టాదశ పురాణాలు మరియు అనేక శ్రుతి ప్రమాణములు తెలియజేస్తున్నాయి. గరుడపురాణంలో శ్రీవారి ఆలయ ఆరాధన విధానమును గురించి ఒక ఆసక్తికరమైన శ్లోకం ఉంది. (ఇదే శ్లోకం శ్రీ వైఖానస భృగు సంహిత, ప్రకీర్ణాధికారంలో కూడా పొందుపరచబడింది). విష్ణ్వంశ సంభూతుడైన భగవాన్ విఖనస మహర్షి శిష్యులైన ఋషులు, అత్రి, భృగు, మరీచి మరియు కశ్యపులు, గురువుగారి ఆదేశంమేరకు అనేక వైఖానస సంహితలను రచించి వాటి ఆధారంగా ఈ భూమండలంలో విష్ణువును ఆరాధించినారు. మరీచి మహర్షి మందర క్షేత్రంలో, అత్రి శ్రీనివాస క్షేత్రంలో, కశ్యపుడు విష్ణ్వధిష్ఠాన క్షేత్రంలో మరియు భృగుమహర్షి శుభక్షేత్రంలో, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా శ్రీ మహావిష్ణువు యొక్క అర్చారూపాన్ని ఆరాధించారు. పై క్షేత్రములలో మూడు మాత్రం ఏవి అనే ఆధారాలు దొరకలేదు కాని అత్రి ఆరాధించిన శ్రీనివాస క్షేత్రంమాత్రం తిరుమల అని స్పష్టంగా చెప్పవచ్చు.

**పురా చతుర్ముఖాదేశః చత్వారో మునయోమలాః ।**
**ప్రణీయ వైష్ణవం శాస్త్రం భూమావభ్యర్చయన్నృపః ॥**
**మరీచిర్మందరే విష్ణు మర్చయామాస కేశవం ।**
**సర్వదేవోత్తమం దేవం (ఆదేశాత్ బ్రహ్మణో విష్ణుం) శ్రీనివాసే త్రిరర్చయేత్।**
**కశ్యపో విష్ణ్వధిష్ఠానే శుభక్షేత్రే భృగుర్మునిః ॥**

**(గరుడపురాణం)**

### భగవాన్ విఖనసమహర్షి

భగవాన్ విఖనస మహర్షి విష్ణు మానస పుత్రుడుగా ఆగమశాస్త్రాల్లో చెప్పబడివుంది. ఆదికాలంలో యజుర్వేద శాఖగా వైఖానస సూత్రాన్ని రచించిన

విఖనసుడు స్వయంగా బ్రహ్మ అని మరీచి ఆనందసంహిత తెలియజేస్తోంది. విఖనసమహర్షి వంశీయులే లోకంలో 'వైఖానసులు'గా ప్రసిద్ధి చెందినారు.

విఖనుడే విష్ణువు. ఆయన వంశస్థులు వైఖానసులు. విష్ణు వంశజుడైన విఖనసుడు మునులలో ప్రథముడు. ఆయన ఉపదేశించిన సూత్రం, సూత్రములన్నింటిలోకి ఉత్తమమైనది. భగవంతుడైన మహావిష్ణువు భూలోకమునందు అర్చావతార రూపంలో అవతరించ దలచినాడు. విష్ణువును ఆరాధించుటకు ఒక సమగ్రమైన ఆరాధన విధానం అవసరమైంది. అందువల్ల మహావిష్ణువు, బ్రహ్మను సృష్టించి, తన ఆరాధనకై ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించమని ఆదేశించినాడు. కాని బ్రహ్మదేవుడు తన అశక్తతను తెలియజేయగా, అప్పుడు శ్రీ మహావిష్ణువు తన మనస్సులో సమస్త వేదరాశిమీద దృష్టి నిలిపి ధ్యానించాడు. తత్ఫలితంగా, భగవాన్ విఖనసమహర్షి విష్ణువు మనస్సు నుండి ఉద్భవించినాడు. సలక్షణంగా, దివ్యమైన తేజస్సుతో విష్ణు చిహ్నాలైన, చతుర్భుజములు, శంఖ, చక్రములతో, అభయ వరద హస్తములతో, ద్వాదశ ఊర్ధ్వపుండ్ర ధారియై, కమండలం మరియు త్రిదండం చేతబూని తులసీ, పద్మమాలలు, కిరీట కర్ణకుండలములతో వెలుగొందుతున్న విఖనసుడు భగవంతునికి నమస్కరించి "ఆజ్ఞాపించమని" అడుగగా, విష్ణువు తన ఆరాధనకై శాస్త్రమును రూపొందించుమని ఆదేశించినాడు. విఖనసుడు వేదరాశి మీద ధ్యానించి మహత్తరమైన శ్రీ వైఖానసకల్పసూత్రాన్ని రూపొందించాడు. ఇదే తర్వాతికాలంలో విఖనసుడి శిష్యాదులచే విస్తరింపబడి, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రం అను పేరుతో ప్రసిద్ధి చెందినది.

## వైఖనసాగమ ముఖ్యస్థానం – తిరుమల

తిరుమల దివ్యక్షేత్రం ప్రపంచంలోని శ్రీ వైఖానస మతానుయాయులందరికి ప్రధానమైన స్థానంగా ప్రఖ్యాతి గాంచింది. వైఖానస అర్చకుల గురించి క్లుప్తంగా:

దేవాలయ ఆరాధనకు అంకితమైన భారతీయ అర్చక సమాజములలో శ్రీ వైఖానసులకు ప్రముఖ స్థానం ఉంది. అత్యంత ప్రాచీనమైన శ్రీ వైఖానస అర్చక



సమాజం, ఈ రోజుకీ తమ కులవృత్తికే కట్టుబడి ఉన్నారు. వైఖానసులను గురించి వేదములలో, ఇతిహాసాలైన భారత, రామాయణాలలో, పురాణాలైన భాగవతంలో ప్రస్తావన వున్నది. వైఖానసులగురించి తొలి ఉదాహరణలు ఇలావున్నాయి. వీరు అరణ్యములందలి ఆశ్రమాలలో నివసించే గృహస్థులుగా, బ్రాహ్మణములలో విధించిన విధంగా నిష్ఠతో యజ్ఞాదులను నిర్వహించే వారుగా వర్ణిస్తున్నది. వైఖానసులు ఇంద్రునకు (విష్ణువునకు) ప్రీతి పాత్రులైన ఋషులుగా తాండ్య మహాబ్రాహ్మణము పేర్కొన్నది. (14–4–7)

**వైఖానసా వా ఋషయః ఇంద్రస్య ప్రియా ఆసన్ ॥**

భగవంతుని ఆరాధన రెండు విధములు: సమూర్త్యర్చన, అమూర్త్యర్చన. అగ్నిక్రియద్వార అర్చించడం అమూర్త్యర్చనం, దేవతలందరిలోకి అగ్ని తక్కువ స్థాయి గలవాడు (మనకు దగ్గరగా అందుబాటులో ఉండే దేవత); ఇంకా విష్ణువు అందరికంటే అధికుడు ఈ ఇరువురి మధ్య సర్వదేవతలు ఉంటారని ఐతరేయ బ్రాహ్మణం (1,1,1) పేర్కొంటున్నది.

**అగ్నిర్వై దేవానామవమః విష్ణుః పరమస్తదంతరేణ సర్వా అన్యా దేవతాః యితి బ్రాహ్మణమ్ ॥**

అందువల్ల నిత్యహోమాంత మందు విష్ణువును నిత్యం అర్చించాలి. తద్వారా సర్వదేవతలను ఆరాధించినట్లే. ఇట్లు హోమ పూజ చెప్పబడింది.

ఇక రెండవది ఇంటిలో కాని లేదా ఆలయంలో గాని ప్రతిష్ఠించిన విష్ణు ప్రతిమను పూజించటం. పై రెండు విధములకు పోలికలున్నాయని అత్రి మహర్షి తన సంహితయైన సమూర్త్యర్చనాధికరణంలో పేర్కొన్నాడు. అగ్న్యాధానం అనే హోమక్రియతో సమానమైనది విగ్రహ ప్రతిష్ఠ. యజ్ఞకర్మలోని క్రమ విధానం విగ్రహారాధనలోని క్రమవిధానాన్ని పోలిఉంటుంది. అవభృథస్నానం (బ్రహ్మోత్సవాలలో చివరిరోజు చక్రస్నానం)తో యజ్ఞవిధి పూర్తయినట్లుగా శ్రద్ధతో, వైభవంతో పూజ పరిసమాప్తి పొందుతుంది.

వేదవిహితమార్గంలో విష్ణుప్రతిమను పూజించటమనే సంప్రదాయాన్ని సంస్థాగతం చేయటమే కాక అటువంటి పూజ చేయవలసిన ఆవశ్యకతను దాని ఫలితాలను విశదంచేసిన ఖ్యాతి వైఖానసులకే దక్కుతుంది.

క్రీ.శ.1059 సం॥లో శ్రీ వేంకటేశ్వరస్వామిఆలయంలో ప్రధాన అర్చక కైంకర్యములు నిర్వహించిన అర్చకవరేణ్యులు శ్రీ శ్రీనివాసదీక్షితులవారు బ్రహ్మసూత్రాలకు, వైఖానస తత్త్వచింతనతో కూడిన ఒక వ్యాఖ్యానం రచించారు. దీని పేరు "శ్రీ లక్ష్మీ విశిష్టాద్వైతం". ఇది రామానుజులవారి శ్రీ భాష్యంలోని ప్రవచనాల కంటె పూర్తిగా భిన్నమైనవి. ఈ భాష్యం పేరు ఇలా వ్యాఖ్యానింపబడింది.

**లక్ష్మీ విశిష్టః నారాయణః అద్వైతం యత్ర మతే తత్ లక్ష్మీ విశిష్టాద్వైతమ్ ॥**

లక్ష్మీతత్త్వంతో కూడిన నారాయణుడు ఏ ఆరాధనా విధానంలో అద్వైతంగా (అభిన్నం) ఉంటాడో ఆ విధానమే లక్ష్మీ విశిష్టాద్వైతం.

వైఖానస దృష్టిలోని విశిష్టత ఏమంటే – మోక్షసాధన పరిపూర్ణం చేయడానికి జ్ఞానం (ఆదిశంకరులవారి అద్వైతం), భక్తి (రామానుజుల వారి విశిష్టాద్వైతం) మాత్రమే చాలదు. ఈ రెండింటిని ఉపకరణాలుగా భక్తి ప్రపత్తులతో సమూర్త్యర్చన (విగ్రహ పూజ) చేయాలి. ఇది ఈ కలియుగంలో ఉత్తమోత్తమైన విధానం. అందరూ ఆచరింపదగినది. భగవత్ సమూర్త్యర్చన అనేది బ్రహ్మవిద్యాజ్ఞానం కంటే ఎక్కువ ఫలవంతమైనదిగా తలంపబడింది.

అగ్నిష్టోమాది యజ్ఞకర్మలు అవి చేసే యజమానికి జీవిత పర్యంతమే సిద్ధిస్తూ ఫలవంతములవుతాయి. దాని సత్ఫలితాలు ఆ అగ్నిహోత్రికి వాని సన్నిహిత కుటుంబానికి మాత్రమే పరిమితాలు. కాని దేవాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ అనేవి దాతకు, అర్చకునకు మాత్రమే కాక ఆ దేవాలయాన్ని సందర్శించిన వారికీ, ఆ విగ్రహాన్ని పూజించిన వారికీ, అందరికీ, అనంతమైన సత్ఫలితాలను కలుగజేస్తాయి.



చక్కగా పూజించి, ప్రతిష్ఠించిన విష్ణు ప్రతిమ మానవుడు ఏయే కోరికలను కోరుతాడో వాటినెల్లా తప్పక ప్రసాదిస్తుంది – సంశయం లేదు. అది ఎట్లా అంటే జ్వలిస్తున్న అగ్ని – వెలుగు కోరేవారికి చీకటిని తొలగిస్తుంది, ఇతరులకు చలిని పోగొడుతుంది, స్వేదం కోరేవారికి స్వేదం కలిగిస్తుంది, ఆకలి గొన్నవారికి పాకక్రియద్వార ఆకలిని పోగొడుతుంది.

అట్లాగే నారాయణుడు ఎవరు కోరిన కోరికలను వారికి తీరుస్తాడు. కల్పవృక్షం నుంచి కావలసినది లభించినట్లు గానే, హరినుంచి ఇష్టమైనది, తప్పక లభిస్తుంది.

(భృగు ప్రకీర్ణాధికారః 35–23–29)

ఇటువంటి మహత్తరమైన వీటిని సులభంగా ఇవ్వగల శ్రీవైఖానసఆరాధనావిధానం తిరుమలలో ప్రాచీన కాలంనుండి వేల సంవత్సరాలపాటు శ్రీవారికి జరుపబడుతున్నది. అందువల్లనే శ్రీవారు కోరినవారి కోరికలను తీర్చి, ఆపదలోవున్నవారికి ఆపదమొక్కులవాడిగా కొంగు బంగారంగా కీర్తించబడినాడు.

## శ్రీ వైఖానస ఆరాధన విశిష్టత

శ్రీ వైఖానస ఆగమప్రకారం ఆరాధన జరిగే ఆలయంలో, వేదవిహితమైన యజ్ఞక్రియలలో ముఖ్యమైన అంశాలన్నీ ఉంటాయి. (దీక్ష, అధ్వర్యుడు, ఋత్విక్కు, హౌత్ర ప్రశంస, పూర్ణాహుతి, అవభృథం, త్రిషవణ, ప్రాయశ్చిత్తం మొ॥వి). వైఖానస ఆరాధన విధానం వేద విహితంగా, వేదోక్త మంత్రాలపఠనతో వైభవంగా నిర్వహించబడుతుంది. ఇందువలన రాజరాష్ట్ర యజమనాచార్య అర్చక పాచక పరిచారక, భక్తజన హితంగా వారి అభివృద్ధి, యశస్సుకై ఉద్దేశించి చేయబడినదే వైఖానసఆరాధన.

ఈ కలియుగంలో విగ్రహారాధన సర్వోత్కృష్టమైనదిగా మరీచిమహర్షి 'ఆనందసంహిత'లో తెలియజేశారు. కృతయుగంలో భగవంతుని ధ్యాన రూపంలో దర్శించేవారు. త్రేతాయుగంలో యజ్ఞక్రియల ద్వార ఆ శ్రియఃపతిని కొలిచేవారు.

ద్వాపరయుగంలో ప్రతిమార్చనం మరియు కలియుగంలో భగవంతుని స్మరణ చేయటం వలన ఉత్తమ ఫలితాలు సిద్ధిస్తాయి. అయినప్పటికీ ప్రస్తుత యుగంలో అన్ని యుగాలలోని ఉత్తమ మార్గముల కలయికగా ఏర్పడినదే విగ్రహారాధన. అదియే సులభమైన రీతిలో ఫలితాల నివ్వగలదిగా చెప్పబడినది.

దీనిని దృష్టిలో వుంచుకునే, వేదవేద్యుడైన శ్రీనివాస ప్రభువును 'వేంకట–పరబ్రహ్మణే–నమః' అని కీర్తించారు.

## శ్రీవారి కైంకర్యాలు

శ్రీవారి ఆలయంలో ప్రతినిత్యం శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా అనేక వైదిక కైంకర్యములు, వేద విహితంగా నిర్వహించబడుతాయి. ప్రతిరోజు ఉదయం నుండి రాత్రివరకు శ్రీవారి కైంకర్యాలవిశేషాలు క్లుప్తంగా తెలుసుకుందాం.

శ్రీవారి ఆలయంలో ప్రతి నిత్యం ప్రత్యూషకాల ఆరాధనతో ఆలయ ద్వారములు తెరువబడుతాయి. దీనికే 'సుప్రభాత సేవ' అని ప్రసిద్ధమైన పేరు. ప్రతిరోజు ఉదయం 3 గం॥లకు, ఆలయ వేదపారాయణదారులచే సుప్రభాత శ్లోకాల పఠనం జరుగుతుంది. బంగారువాకిలికి ఇరువైపుల సుప్రభాత సేవార్థులు, అధికారులు, మహంతుమఠం ప్రతినిధి, మైసూరురాజా వారి ప్రతినిధి, తాళ్ళపాక అన్నమయ్య వంశీయులు. శ్రీవారి సేవకై సిద్ధంగా వుంటారు. వైఖానస అర్చకులు, సనిధి గొల్ల, జియ్యంగార్ స్వాములు సన్నిధిలోకి ప్రవేశించి స్వామి వారి తొలి దర్శనం చేసుకుంటారు. బంగారు వాకిలి వద్ద శ్రీ వేంకటేశ సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం మొ॥వి వరుసగా పఠించబడుతుండగా, సన్నిధిలో వైఖానస అర్చకుల ప్రత్యూషకాలఆరాధన లో భాగంగా శ్రీవారికి మొదటి నివేదనగా గోక్షీరాన్ని (పచ్చి ఆవుపాలు) నివేదిస్తారు. అంతకు పూర్వం ముందు రోజు రాత్రి పవళింపు సేవలో బంగారు నవారు మంచం పై శయినించివున్న శ్రీవారి కౌతుక బేరం శ్రీ భోగ శ్రీనివాసమూర్తి వారిని మూలవిరాట్ పాదముల వద్ద వున్న సింహాసనంపై జీవస్థానంలో వేంచేపు చేస్తారు.



అనంతరం ఏకాంతంగా శ్రీవారికి కర్పూర నీరాజన సమర్పణ జరుగుతుంది. దీనికే కైంకర్యపరుల హారతి అని పేరు. శ్రీవారి మూల విరాట్ ముఖమండలంలో గడ్డం మీద అర్చకులు, గడ్డం బొట్టుగా పచ్చకర్పూరాన్ని అద్దుతారు. శ్రీవారికి గొల్లహారతి సమర్పించిన తర్వాత వైఖానస అర్చకులు, ముందుగా బ్రహ్మతీర్థాన్ని తాము స్వీకరించినపిదప జియంగార్ స్వామికి, సన్నిధి గొల్లకు బ్రహ్మతీర్థం, శఠారి సాయిస్తారు.

బంగారువాకిలి వద్ద మంగళాశాసనశ్లోకాల పఠనం జరుగుతుండగా సన్నిధిలో శ్రీవారికి కర్పూరనీరాజన సమర్పణ జరుగుతుంది. అనంతరం జియర్‌స్వాములు, ఆచార్యపురుషులు, అన్నమయ్యవంశీయులవార్లకు వరుసగా బ్రహ్మతీర్థం, శఠారి ఇవ్వబడుతాయి. తదుపరి, మహంతుమఠం మరియు మైసూరురాజావారి ప్రతినిధి సమర్పించిన నవనీతం (వెన్న), తమలపాకులు, వక్కలు శ్రీవారికి నివేదించి, నవనీత హారతిని సమర్పిస్తారు. తదుపరి సుప్రభాతం సేవార్థులను శ్రీవారిదర్శనానికి వరుసక్రమంలో పంపుతారు. ఈ సమయంలో జరిగే దర్శనానికే 'విశ్వరూప దర్శనం' అని పేరు. భక్తులకు బ్రహ్మతీర్థం, శఠారి వితరణ జరుగుతుంది. శ్రీవారి ఆలయసంప్రదాయఆచారముల మేరకు, ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవ సమయంలో ఒక బంగారు బిందెలో, విమానప్రాకారంలోని బంగారు బావి నుండి తీసుకొనిరాబడిన తీర్థంతో నింపుతారు. ప్రతి నిత్యం రాత్రి ఆలయద్వారములు మూసి వేసిన తర్వాత, బ్రహ్మాది దేవతలు శ్రీవారికి ఏకాంతంగా ఆరాధన చేస్తారని ప్రతీతి. అందువల్లనే ఏకాంతసేవ అయిన తర్వాత విమాన ప్రాకారంలో దేవతా సంచారం వుంటుందని, శ్రీవారి సేవార్థమై వచ్చిన వారి ఏకాంతమునకు భంగం వాటిల్లకుండా, ఆ సమయంలో ప్రదక్షిణ చేయకూడదని కట్టడి వున్నది.

సన్నిధిలో ఆరాధన పాత్రశుద్ధి జరిగి, శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధనలో ఉపయోగించే పుష్పమాలికలు, తులసి మున్నగు సంభారములు, విమాన ప్రాకారంలో ఈశాన్యదిక్కునవున్న శ్రీ యోగ నరసింహస్వామివారి సన్నిధికి కుడివైపున 'యమునోత్తరై' అనే గది నుండి సన్నిధి ఏకాంగిచే ఒక పెద్ద

వెదురుబుట్టలో పుష్పములను అమర్చి, శిరస్సుపై ధరించి, ఆలయ మర్యాదలతో, ధ్వజస్తంభ ప్రదక్షిణగా సన్నిధిలో తేబడి, దక్షిణం వైపున వుంచబడుతాయి. తదుపరి ప్రాతఃకాల ఆరాధన అనే తోమాలసేవకు, సేవార్థులను వరుస క్రమంలో కూర్చుండబెడతారు ఉదయాస్తమాన సర్వసేవా పథకం గృహస్థులకు మాత్రం అర్చకస్వామిచే గోత్రనామాదులతో సంకల్పం గావించబడుతుంది. తదుపరి సన్నిధిలో పరదాను వేసి, శ్రీ భోగ శ్రీనివాసమూర్తి వారిని స్నాన పీఠం పై వేంచేపు చేస్తారు. పరదా తీసి అర్చకులు సంకల్పం చేసుకుని, శ్రీ భోగమూర్తివారికి తోమాలసేవలో భాగంగా. ఆకాశగంగా తీర్థం, పాలు, పరిమళం (చందనం, పచ్చకర్పూరం, కుంకుమపువ్వుల మిశ్రమం) మొదలైన ద్రవ్యాలతో పురుషసూక్త పఠనంతో అభిషేకం నిర్వహిస్తారు. తర్వాత శ్రీవారి బంగారు పాదకవచములకు, సాలగ్రామములకు యథాక్రమం తిరుమంజనం జరుగుతుంది.

తదుపరి పరదావేసి, అర్చకస్వామి ప్రాతఃకాల ఆరాధనకు సంకల్పం చేసి, ఆకాశగంగా తీర్థంతో పంచపాత్రలను. నింపి, భూతశుద్ధి, ఆవాహనాదులను పూర్తి చేసి పరదా తీస్తారు. శ్రీవారి మూలవిరాట్‌కు ఆసనం, పాద్యం, అర్ఘ్యం, అచమనం మొదలైన 30 ఉపచారములతో ఆ వేదమంత్రోచ్ఛారణ పురస్సరంగా భక్తి శ్రద్ధలతో ఆరాధన చేస్తారు. తరువాత వరుసగా వక్షఃస్థల లక్ష్మీ, పద్మావతీ తాయార్లకు, శ్రీ భోగ శ్రీనివాసమూర్తివారికి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తివారికి, శ్రీ కొలువు శ్రీనివాసమూర్తివారికి, శ్రీ సీత, లక్ష్మణ, రాములవారికి, శ్రీ రుక్మిణీ సమేత కృష్ణస్వామివారికి, సాలగ్రామ, శఠారిలకు, శ్రీ సుదర్శనులవారికి, విమానం, విమాన వేంకటేశ్వరస్వామివారికి ఆరాధనను నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి మూర్తులన్నింటినీ పుష్ప మాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. శ్రీవారి మూలవిరాట్టుకు మరియు ఇతరమూర్తులకు నక్షత్రహారతి, కర్పూర హారతి సమర్పించిన వెంటనే, భక్తాదులను దర్శనానికి అనుమతిస్తారు.



తోమాల సేవానంతరం. ప్రాతఃకాల ఆరాధనలో భాగంగా, స్నపన మంటపంలో, శ్రీ కొలువు శ్రీనివాసమూర్తి వారి సమక్షంలో దర్బార్ నిర్వహిస్తారు. శ్రీవారికి పంచాంగ శ్రవణం, హుండీ జమా ఖర్చులను విన్నవించి, బెల్లంతో కలిపిన నువ్వుల పిండిని నివేదిస్తారు. నవనీతహారతి సమర్పణ జరిపి శ్రీవారిమూర్తిని తిరిగి సన్నిధిలోకి వేంచేపు చేస్తారు.

తదుపరి సన్నిధిలో శ్రీవారికి సహస్రనామార్చన సేవను నిర్వహిస్తారు. శ్రీవేంకటేశ సహస్రనామావళి లోని 1008 నామాలు పఠిస్తుండగా తులసీదళములతో శ్రీవారికి అర్చనను నిర్వహిస్తారు. అర్చన తర్వాత శ్రీవారికి నక్షత్రహారతి, కర్పూరహారతి జరిపి, మొదటి నివేదనకు సన్నాహాలు జరుపుతారు. శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధనలో భాగంగా మొదటి గంట నివేదన జరుగుతుంది. అన్న ప్రసాదములు, లడ్డు, వడ వంటి నివేదనలు, శ్రీవారికి శ్రద్ధాభక్తులతో సమర్పించబడుతాయి. నివేదన అనంతరం ఆలయంలోని ద్వార దేవతలు, దిగ్దేవతలు, ద్వారపాలకులు, ఉపఆలయాలలోని మూర్తులకు బలిహరణంలో భాగంగా నివేదనలు సమర్పించబడుతాయి. సన్నిధిలో శ్రీవారికి, శ్రీ వైష్ణవ సంప్రదాయక 'శాత్తుమొఱ' ను, జియ్యంగార్ స్వాములు మరియు ఇతర శ్రీవైష్ణవులు నిర్వహిస్తారు. అనంతరం సర్కార్ హారతి జరిపి, భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. కొద్ది విరామం తర్వాత శ్రీవారికి మాధ్యాహ్నిక ఆరాధన ప్రారంభమవుతుంది. అర్ఘ్య,పాద్యాచమనాదులు సమర్పించిన తర్వాత శ్రీ వేంకటేశ అష్టోత్తర శతనామావళి పఠనంతో తులసీదళ అర్చన నిర్వహిస్తారు అనంతరం మాధ్యాహ్నిక రెండో గంటా నివేదన, బలి జరిపి, భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. శ్రీవారి ఉత్సవమూర్తి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, విమానప్రదక్షిణగా, సంపంగిప్రాకారంలోని కల్యాణమంటపానికి వేంచేపు చేస్తారు. అక్కడ మధ్యాహ్నం 12 గం॥లకు అభిజిల్లగ్నంలో శ్రీవారికి నిత్యకల్యాణోత్సవాన్ని, అర్చకులు నేత్రపర్వంగా నిర్వహిస్తారు. తదుపరి ఆర్జిత డోలోత్సవంసేవను. అద్దాలమంటపంలో నిర్వహిస్తారు.

అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులను, ఆలయం వెలుపలఉన్న వైభవోత్సవమంటపానికి ఊరేగింపుగా తీసుకువెళతారు. అక్కడవారికి ఆర్జిత బ్రహ్మోత్సవం, ఆర్జిత వసంతోత్సవం సేవలు నిర్వహిస్తారు. సాయంత్రం, కొలువు మంటపంలో సహస్రదీపాల కాంతులలో శ్రీవారికి ఊంజల్ సేవను వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారు, నాలుగు తిరుమాడా వీధులలో, నిత్యోత్సవానికి వేంచేస్తారు. ఉత్సవానంతరం శ్రీవారిని సన్నిధిలోనికి వేంచేపు చేస్తారు. సర్వదర్శనం నిలుపుదల చేసి, శ్రీవారికి రాత్రి కైంకర్యాలను ప్రారంభిస్తారు. శ్రీవారి మూలవిరాట్‌కు ఉదయం తోమాలసేవలో అలంకరించిన పుష్పమాలలను, సడలింపుచేసి, సన్నిధిలో పాత్ర శుద్ధి జరుపుతారు. అనంతరం శ్రీవారికి రాత్రి తోమాలసేవ, రాత్రి అర్చన, రాత్రి గంట, తీరువీసం ఘంట, బలి మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. తదుపరి భక్తులను, సర్వదర్శనానికి అనుమతిస్తారు. సర్వదర్శనం సమాప్తి అయిన తర్వాత, శ్రీవారికి చివరిసేవగా ఏకాంతసేవను నిర్వహిస్తారు. సళ్ళింపు, శుద్ధి అనంతరం స్వామివారి పాదములు, వక్షఃస్థల తాయార్లకు, భోగ శ్రీనివాసమూర్తి వారికి చందనం సమర్పించి, పాలు, పండ్లు, పంచకజ్జాయం, తాంబూలాదులను నివేదిస్తారు. శ్రీవారి కౌతుకబేరం భోగ శ్రీనివాసమూర్తివారిని బంగారునవారు మంచంపై పవళింప జేసి హారతి సమర్పించడంతో ఆ రోజు నిత్యకైంకర్యములు సమాప్తి అవుతాయి. అర్చకులు. సాబూతు (స్వామివారికి అలంకరించిన నగలపరిశీలన) చూసుకుని ఆలయద్వారములు మంత్రోచ్చారణ పురస్సరంగా కుంచెకోలతో మూసివేస్తారు. ఇది ప్రతినిత్యం తిరుమల శ్రీవారి ఆలయంలో వైఖానసాగమోక్తంగా నిర్వహించే నిత్యకైంకర్యాల సంక్షిప్త వివరణ.

## శ్రీవారి కైంకర్యపరులు

శ్రీవారి ఆలయంలో, నిత్యం నిర్వహించే వివిధ కైంకర్యములలో, అనేక మంది కైంకర్యపరులు, వివిధ రకాల సేవలను శ్రీవారికి అందించడం సంప్రదాయంగా జరుగుతున్నది. కైంకర్యపరులు ప్రధానంగా మూడు వర్గాలు. 1. అర్చకులు 2. జియ్యర్‌స్వాములు 3. ఆచార్యపురుషులు. శ్రీవారి కైంకర్యాలలో ఎవరెవరు పాల్గొంటారు, వారు ఎప్పటి నుండి ఆలయంతో అనుబంధం కలిగి



ఉన్నారు. వారెటువంటి విధులు నిర్వహిస్తారు అనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి. అంతేగాక వీరి గురించి తెలుసుకోవటం వల్ల కైంకర్యాలు ఏ విధంగా నిర్వహిస్తారు, శ్రీవారి ఆలయంలో అత్యంత ప్రాచీనమైన కట్టుబాట్లు, ఆచారాలు, ఈ రోజుటికి, శ్రీవారి మహిమతో ఎంతో చక్కగా నిర్వహించబడుతున్నాయనే విషయాలు స్పష్టమవుతాయి. ఒక్కసారి మనసారా గోవిందనామస్మరణతో ఈ వివరాలను (క్లుప్తంగా) తెలుసుకుందాం.

“శ్రీనివాసా.... శ్రీవేంకటేశా.... గోవిందా..గోవిందా!”

## (i) శ్రీ వైఖానస అర్చకులు

శ్రీవారి ఆలయంలో అన్ని కైంకర్యములలో అత్యంత ప్రధాన భూమికను పోషిస్తూ, శ్రీవారికి ప్రత్యక్షంగా సేవ చేసే భాగ్యాన్ని పొందినవారే వైఖానస అర్చకులు. ఆలయద్వారాలు తెరువటం మొదలు తిరిగి రాత్రి మూసివేసే వరకు, వీరు లేకుండా ఏ పని జరుగదంటే అతిశయోక్తి కాదు.

ఒక ఆలయం ప్రసిద్ధికి వచ్చిందంటే అందుకు దాని వాస్తు నిర్దోషత కాని, ప్రదేశం కాని, శిల్పవైచిత్రి కాని కారణం కాదు. అందుకు ఒకే ఒక కారణం, అర్చామూర్తిలో దైవత్వం నెలకొనటం. ఇలా దైవత్వం మూర్తీ భవించటానికి ప్రధాన కారణం – సుశిక్షితులు, సద్వర్తనులు అయిన అర్చకులు క్రమ పద్ధతిలో నిరంతరాయంగా, లోప రహితంగా శతాబ్దాల పాటు స్వామివారికి అర్చనలు చేయటమే అని ఆగమాలు పేర్కొంటున్నాయి. విగ్రహంలో దైవత్వం మూర్తీభవించటానికి గల మూడు ప్రధానాంశాలలో రెండింటికీ ఆలయఅర్చకుడు ప్రధాన కారణం. 1. అర్చకుని జీవనవిధానం 2. అతడు పాటించే యమ, నియమాదులు 3. అర్చామూర్తి విశిష్టత (ప్రకీర్ణాధికారః–భృగు)

**రూపద్వయం హరేః ప్రోక్తం బింబ మర్చక ఏవ చ ।**
**బింబే త్వావాహనాదూర్ధ్వం సదా సన్నిహితోఽర్చకే ।**
**అర్చకస్తు హరిః సాక్షాత్చరరూపీ న సంశయః ॥**

**(భృగుక్రియాధికారః)**

శ్రీహరిరూపం రెండు విధాలుగా చెప్పబడింది. 1.బింబం (విగ్రహం), 2.అర్చకుడు. విగ్రహానికి దైవత్వం ఆవాహన తర్వాతే సంక్రమిస్తుంది. కాని అర్చకునిలో దైవత్వం సదా సన్నిహితంగానే ఉంటుంది. అర్చకుడు సాక్షాత్తు కదిలే రూపంలో వున్న విష్ణువే, సందేహం లేదు అని శ్రీ వైఖానస భృగు సంహిత క్రియాధికారగ్రంథం తెలియజేస్తున్నది.

శ్రీవారిఆలయంలో ప్రాచీనకాలంలో మొట్టమొదట స్వామివారికి ఆరాధనాదులు నిర్వహించిన అర్చక వ్యవస్థ గురించి శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో అనేక చోట్ల వివరించబడినది. శ్రీవారి ఆలయానికి సంబంధించి అత్యంత ప్రామాణికంగా చెప్పుకునే బ్రిటీషుకాలం నాటి 'సవాల్-జవాబ్ కైంకర్య పట్టి' 1817 నాటి పుస్తకంలో ఆలయ మొదటి అర్చకుడు శ్రీమాన్ గోపీనాథ దీక్షితుల వంశానికి చెంది, అనూచానంగా శ్రీవారికి కైంకర్యాలు నిర్వహించిన అర్చక కుటుంబములగురించి తెలియజేయబడివుంది.

గోపీనాథ దీక్షితులవారి కుటుంబం, సుమారు క్రీ.శ. 9 వ శతాబ్దంలో రెండుగా విభజింపబడింది. మొదటి కుటుంబం భారద్వాజ గోత్రానికి చెందిన గోపీనాథ దీక్షితులది కాగా, రెండవది కౌశిక గోత్రానికి చెందిన తపస్సంపన్నుడైన అర్చకుడు శ్రీ శ్రీనివాస దీక్షితుల వారిది. ప్రస్తుతం ఈ రెండు గోత్రాల వారు, గోత్రానికి రెండుకుటుంబాల చొప్పున, మొత్తం 4 కుటుంబాల వారు. శ్రీవారికి కైంకర్యాలను నిర్వహిస్తున్నారు. ఈ 4 కుటుంబములవారిని, వారికి రాజుల చేత దానమివ్వబడిన గ్రామాల పేరుతోనే కైంకర్యపట్టీలో పేర్కొనబడింది.

భారద్వాజ గోత్రం
- 1. గొల్లపల్లి కుటుంబం
- 2. పైడిపల్లి కుటుంబం

కౌశిక గోత్రం
- 3. తిరుపతమ్మ గారి కుటుంబం
- 4. పెద్దింటి వారి కుటుంబం

శ్రీ వైఖానస అర్చకులు మాత్రమే శ్రీవారి మూలవిరాట్ మరియు ఇతర మూర్తులను తాకి కైంకర్యం చేయగల కట్టడి ఆలయంలో ఆచారంగా వస్తున్నది.



శ్రీవారికి జరిగే నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాలు మరియు సంవత్సరం పొడవునా నిర్వహించే కాలోత్సవాలు యివన్నీ పూర్తిగా వైఖానస అర్చకులచే నిర్వహించబడుతాయి.

## (b) జియ్యంగారు స్వాములు

అర్చకుల తర్వాత, శ్రీవారి కైంకర్యాలలో ముఖ్య పాత్ర పోషించే వర్గమే జియ్యంగారు స్వాములు. 11వ శతాబ్దంలో మొదటగా శ్రీ రామానుజులవారు. 'ఏకాంగి' వ్యవస్థను నెలకొల్పినట్లు ఆలయ చరిత్ర తెలుపుతుంది. ఈ ఏకాంగి వ్యవస్థే కాలక్రమేణ జియ్యంగారు వ్యవస్థగా రూపాంతరం చెందినది. ప్రస్తుతం శ్రీవారి ఆలయంలో పెద్దజియ్యంగార్ స్వామి, చిన్న జియ్యంగార్ స్వామి మరియు ఏకాంగులు శ్రీవారి సేవలో ఉన్నారు. శ్రీవారి కైంకర్యాలో జియంగారి పక్షాన సేవలందిస్తున్న ఏకవస్త్రధారియైన బ్రహ్మచారే 'ఏకాంగి'.

శ్రీజియ్యంగార్ల వారు, శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాదులలో అన్ని ద్రవ్యాలను. అర్చకుల చేతికి అందిస్తూ, స్వామి వారికి సమర్పణ చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తూ, శ్రీవారి అనుగ్రహానికి పాత్రులవుతున్నారు. అలాగే శ్రీవారి తిరువీధి ఉత్సవ సమయంలో వీరి ఆధ్వర్యంలోనే, ఊరేగింపుకు ముందువైపున దివ్యప్రబంధ సేవాకాలం జరుగుతుంది.

(c) ఇక ఆలయంలో జరిగే వివిధ కైంకర్యాలలో పాలు పంచుకునే మూడవ వ్యవస్థే 'ఆచార్యపురుషుల' వ్యవస్థ. ప్రాచీన కాలంలో తిరుమల ఆలయం అనేక క్రూరమృగాలతో, విషపురుగులతో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండేది. ఆ కాలంలో దర్శనానికి వెళ్ళటమే గొప్ప విషయం. మరి యితర సేవల ప్రస్తావనే లేదు. అటువంటి సమయంలో శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన గొప్ప భక్తులు. స్వామివారికి జరిగే కైంకర్యాలలో, కావలసిన సమస్త సదుపాయాలు సమకూరుస్తూ ఆలయ సంప్రదాయాలు కాపాడుతూ సేవ చేసిన వారే ఈ ఆచార్యపురుషులు. వీరు మొత్తం 7 మంది అని 'కైంకర్యపట్టీ' తెలియజేస్తోంది.

1. తోళప్పాచారి (తిరుమల నంబి వంశీయులు). వీరిది తీర్థకైంకర్యం, మంత్ర పుష్ప కైంకర్యం, వేదపారాయణ కైంకర్యాలు.

2. పురిశై (అనంతాళ్వారు వంశీయులు). పుష్పకైంకర్యం మరియు ఉత్సవ సమయంలో దివ్యప్రబంధగానం వీరి బాధ్యతలు.

3. భావనాచారి – ఉత్సవ సమయాలలో దివ్యప్రబంధసేవాకాలం.

4. ప్రతివాది భయంకరం (శ్రీ వేంకటేశ సుప్రభాతం రచయిత అణ్ణన్‌స్వామి వంశీయులు) – వీరి సేవ 3లో చెప్పబడినదే.

5. వీరవల్లి 6. కిడాంబి ధర్మపురి 7. పరవస్తు – వార్ల కైంకర్యం 3 లో చెప్పబడినది.

**సన్నిధి గొల్ల :** శ్రీవారి సన్నిధిలో కైంకర్యాలను నిర్వహించే శ్రీవైఖానస అర్చకులను వారి నివాసగృహం నుండి జాగ్రత్తగా సన్నిధికి దారి చూపుతూ, చేతిలో దివిటీ నుంచుకుని శ్రీవారి ఆలయానికి పిలుచుకొనిరావడం వీరి బాధ్యత. శ్రీవారి ఆలయంలో మొదటి కైంకర్యపరులైన వైఖానస అర్చకులతో పాటు, సన్నిధి గొల్ల కూడా స్వామిసేవలో తరిస్తున్నాడు.

**భగవదారాధన వైశిష్ట్యం**

వైఖానస అర్చకులు విష్ణువునే పరమదైవంగా భావించి, రెండు విధములుగా ఆరాధిస్తారు. 1. నిష్కల రూపం: నిరాకార రూపంలో సర్వవ్యాపిగా ఉండే నారాయణుని ఆరాధించటం, నిష్కలారాధన అని చెప్పబడింది.

2. సకల రూపం: అర్చా రూపంలో, సకల కళ్యాణ గుణములు కలిగి, చక్కటి రూపంతో తేజోమయంగా విరాజిల్లే నారాయణుని ఆరాధించటం.

భగవంతుణ్ణి ఇంకా మూడు విధములుగా ఆరాధించి దర్శించవచ్చు అవి.

1. మానసపూజ: ధ్యానం ద్వార భగవత్సాక్షాత్కారం పొందటం

2. వాచికము: వేద మంత్రాలు, ప్రార్థనలు చేయడం



3. కాయికం: ఇది రెండు విధాలు. 1. అగ్ని ద్వార ఆరాధన చేయటం అమూర్త్యర్చన (హోమం ద్వార) 2. శిలా రూపంలో ఆరాధన చేయటం సమూర్త్యర్చన.

విగ్రహారాధన పై చెప్పబడిన అన్ని విధములలో కెల్ల ఉత్తమమైనదిగా చెప్పబడింది, ఎందుకంటే పైన చెప్పబడిన మూడు విధానములు ఇందులో ఉంటాయి. అంతేగాక, మంత్రోచ్చారణ–క్రియా–ద్రవ్య–ధ్యాన–భావాంగములని అయిదు విధానములతో ఆరాధన జరుగుతుంది.

ఈ విగ్రహారాధన గృహంనందుకాని, ఆలయమునందుగాని చేయవచ్చు. గృహారాధన ఆ గృహం యజమాని మరియు అతని కుటుంబం క్షేమం కోరి చేయబడేది (స్వార్థార్చన), మరి ఆలయంలో జరిగే ఆరాధనలు. సమస్త మానవాళి సంక్షేమాన్ని కోరి చేయబడేది. (పరార్థం–సర్వలోకాభివృధ్యర్థం).

**కైంకర్యము**

'కైంకర్యం' అంటే శాస్త్రం ద్వార తెలియచెప్పబడిన విధానంలో, భగవంతునికి ప్రియమైన పని చేయడం అని అర్థం. 'కైంకర్యం' అనే పదం. 'కింకరుడు చేసే పని' నుండి తీసుకొనబడింది. కింకరులనగా తమనాయకులు చెప్పిన పనిని ఎటువంటి తడబాటు, సందేహం లేకుండా ఒక సైనికుడిలాగా పని చేసేవారని అర్థం. వీరి విశ్వాసం, పర్వతంవలె మహోన్నతమైనది. వీరు చేసే ముఖ్యమైన పని, వారి నాయకుడు చెప్పిన పని చేయడం.

కైంకర్యం అనేది రెండు రకములుగా చెప్పబడింది. ఆజ్ఞ మరియు అనుజ్ఞ. వేదములలో చెప్పబడిన శౌచ, మానసిక మరియు శారీరక పరిశుభ్రత, ఆచమనం, స్నానం, సంధ్యావందనం, జపం, ఉపాసనం మొదలైనవి ఆజ్ఞా కైంకర్యములు. శాస్త్రములందు చెప్పబడిన పై కర్మలు చేయనివారు సర్వకర్మ బహిష్కృతులుగా, భగవదారాధన నుండి కూడా నిరోధింపబడినవారు. ఇదే అనుజ్ఞా కైంకర్యం. అనుజ్ఞా కైంకర్యం భగవంతుని ఆజ్ఞతో, ప్రీతికరంగా చేయటం. కాని

భగవంతునికి ప్రియమైన ఆజ్ఞ కైంకర్యం చేయనివారు ఆరాధనకు నిషేధింపబడినవారు.

తిరుమల శ్రీవారి ఆలయానికి సంబంధించి, 'కైంకర్యం' అనగా వైఖానస అర్చకులు, అనుచానంగా, సంప్రదాయంగా మహర్షులు చెప్పిన వేద విధానంలో, వారి పూర్వీకుల ఆజ్ఞ ననుసరించి చేసే పని. అర్చకుల యొక్క ప్రధానమైన పని, భగవాన్ విఖనస మహర్షి చే చెప్పబడిన శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా శ్రీవారికి కైంకర్యాలు నిర్వహిస్తూ, స్వామివారి సాన్నిధ్యం దినదిన ప్రవర్ధమానమగునట్లు భక్తి శ్రద్ధలతో నిర్వహించేది అని శాస్త్రవచనం.

**శ్రీవారి కైంకర్యాలు – షట్కాలార్చన**

తిరుమల శ్రీవారి ఆలయంలో, శతాబ్దాలుగా, అనాదిగా వస్తున్న సంప్రదాయం మేరకు, కైంకర్యాల నిర్వహణ అత్యంత సమర్ధవంతంగా, వైఖానస అర్చకులచే నిర్వహింపబడుతోంది. ఆలయంలో మొదటి కైంకర్యంగా సుప్రభాతసేవ నుండి చివరి కైంకర్యంగా ఏకాంతసేవ వరకు ప్రతినిత్యం వైభవంగా జరుగుతుంది. ఈ రెండు కైంకర్యాల మధ్యలో అనేక ఇతర కైంకర్యాలు నిత్య ఆరాధనలో భాగంగా జరుపబడుతున్నాయి. శ్రీ వైఖానస భృగుసంహితలో చెప్పబడిన విధంగా శ్రీవారికి షట్కాలార్చనలు నిర్వహిస్తారు. భృగు ప్రణీతమైన ప్రకీర్ణాధికారం అనే వైఖానస సంహితలో రోజుకి ఒక్కసారి, రెండుసార్లు, మూడుసార్లు లేక ఆరు సార్ల వరకు శ్రీవారిని ఆరాధించ వచ్చని చెప్పబడింది. అంతేగాక ఈ ఆరు కాలములు.

**ప్రత్యూషశ్చ ప్రభాతశ్చ మధ్యాహ్నశ్చా పరాహ్ణకాః ।**
**సాయంకాలో నిశీథశ్చ పూజాకాలాస్తు షట్ స్మృతాః ।**

ప్రత్యూష – (సూర్యోదయాత్పూర్వం బ్రాహ్మీముహూర్తంలో), ప్రాతఃకాలం– (సూర్యోదయంలో), మధ్యాహ్నం, అపరాహ్ణం, సాయంకాలం మరియు అర్ధరాత్రి అని భృగుసంహితలో చెప్పబడిన విధంగా శ్రీవారి ఆలయంలో కైంకర్యాలు జరుగుతున్నాయి.



**షట్కాలార్చన ఫలం**

సమస్త మానవాళికి ఐహిక (భౌతికమైన) ప్రయోజనం కొరకే షట్కాల పూజ అని ఆగమాలు పేర్కొంటున్నాయి. ప్రత్యూషకాలపూజ ప్రజా పశువృద్ధిని కలిగిస్తుంది. ప్రాతఃకాలపూజ జపహోమాదులను వృద్ధి చేస్తుంది. మధ్యాహ్న పూజ, రాజ రాష్ట్ర అభివృద్ధిని కలిగిస్తుంది. సాయంకాల పూజ వలన లోకంలో పంటలన్నీ సమృద్ధిగా పండుతాయి. అపరాహ్ణ పూజ దైత్య వినాశనాన్ని కలిగిస్తుంది. ఇక అర్ధరాత్రి పూజ పశుగణాభివృద్ధి కొరకు ప్రయోజనంగా చెప్పబడింది.

శ్రీవారిఆలయంలో కైంకర్యాలు నిర్వహించే వైఖానస అర్చకులు సాంప్రదాయంగా ఆలయానికి ఉత్తరంవైపున ఉత్తరమాడావీధిలో నివాసం ఉంటారు. ఎందుకంటే అనాదిగా వస్తున్న ఆచారం మేరకు, అర్చకులు. ఆలయానికి వెళ్ళేటప్పుడు ప్రదక్షిణ క్రమంలో వెళ్ళాలి. అందువల్లనే ఇప్పటికీ అనేక ప్రాచీన వైష్ణవ దివ్యదేశములలో అర్చకుల – నివాసగృహం సన్నిధి వీధిలో లేక ఉత్తరమాడావీధి లో ఏర్పాటు చేయబడివుంటుంది.

శ్రీవారికి కైంకర్యాలను నిర్వహించే అర్చకులు వారి గృహంలో శుచిగా తలస్నానం చేసి, మడిగా ఆరవేయబడిన తెల్లటి ధోవతులను ధరించి, ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలను (12 నామములు), కేశవాది నామములను పఠిస్తూ, తిలకధారణ చేస్తారు. మరియొక ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, శ్రీవారి అర్చకులు, తిరుమల పొలిమేరలు దాటివచ్చినట్లయితే మరల శ్రీవారి కైంకర్యానికి వచ్చే ముందు, నూతన యజ్ఞోపవీతాన్ని (జంధ్యం) ధరించాలి. ఇది చాలా ప్రాచీన కాలంనుండి అమలులో ఉన్న, తిరుమల ఆలయానికి మాత్రమే ప్రత్యేకమైన ఆచారం. అంతమాత్రమేగాక వైఖానస అర్చకస్వాములు శ్రీవారి అర్చనకైంకర్యంలోవున్న సమయంలో అనగా తిరుమలక్షేత్రంలో బ్రహ్మచర్యవ్రతం అన్నది విధిగా పాటించవలసిన అంశం.

## అర్చకుని ఆలయప్రవేశం

అర్చకుడు కైంకర్యానికి వెళ్లేటప్పుడు పంచాంగభూషణములైన కటకం (చేతి కంకణం), ఉపవీతం (జంధ్యం), కుండలం (చెవి పోగులు), అంగులీయకం (ఉంగరం), గ్రైవాలంకరణ (మెడలో వేసుకునే ఆభరణములు) ధరించాలని భృగుసంహిత నిర్దేశిస్తుంది. ఇవే కాక పద్మాక్ష (తామర పూసలు), తులసీ మాలలను ధరించాలి. ఇవి ధరించటంవలన కోటిగుణితమైన ఫలితాలను పొందవచ్చని శ్రీనివాసదీక్షితీయంలో చెప్పబడింది. ఆలయఆచారం మేరకు సన్నిధి గొల్ల ముందు వెళుతుండగా, అతన్ని అనుసరిస్తూ నలుగురు వైఖానస అర్చకులు, కుంచెకోల అనే తాళంచెవిని గైకొని ఉత్తరమాఢావీధి నుండి ఆలయానికి బయలు దేరుతారు. మార్గమాధ్యంలో శ్రీ వరాహస్వామివారికి, శ్రీ విఖనస మహర్షులసన్నిధికి ప్రణామములర్పించి ఆలయం చేరుకుంటారు. ద్వితీయ ప్రాకార ద్వారదేవతలైన వక్రతుండ (గణేశుడు), నాగరాజులకు ప్రణామములర్పించి, పడికావలి దాటి ధ్వజస్తంభం వద్దకు చేరుకుంటారు. బలిపీఠమునకు నమస్కారములర్పించి, వెండివాకిలి దాటి ప్రథమప్రాకార ద్వారపాలకులైన కిష్కింధుడు, తీర్థుడు వీరికి నమస్సులర్పించి, వరదరాజస్వామికి, పాకలక్ష్మికి (పోటుతాయారు లేక వకుళమాలిక) నమస్కారం చేసి, విమాన ప్రాకారం ప్రదక్షిణగా చుట్టివస్తారు. రెండు ప్రదక్షిణలు చేయాలని ఆగమ శాస్త్ర వచనం. దారిలో విమాన వేంకటేశ్వరుడు, యోగ నరసింహస్వామి, శంకుస్థాపన స్తంభమునకు నమస్సులర్పిస్తారు. బంగారువాకిలి ప్రవేశించి గర్భాలయ ద్వారపాలురైన మణిక, సంధ్యలకు నమస్సులర్పించి, కుంచెకోలతో ద్వారములు తెరిచి లోపలికి ప్రవేశిస్తారు. లోనికి ప్రవేశించేటప్పుడు ప్రణవాన్ని ఉచ్చరిస్తూ కుడివైపుగా ప్రవేశించాలి. ద్వార దేవతలైన భువంగునికి నమస్కరిస్తూ గడపని దాటుకుని స్నపనమంటపం లోనికి ప్రవేశిస్తారు. స్వామివారి దివ్యమైన ముఖారవిందాన్ని దర్శించుకుంటూ అర్చకులు వేదమంత్రాల్ని స్మరిస్తారు. కుడి చేతిలో ఎడమ చేతిని తగిలిస్తూ మూడుసార్లు చప్పట్లు కొడతారు. ఒకసారి



చప్పట్లు కొడితే మరణం, రెండుసార్లు వ్యాధిపీడ, మూడుసార్లు సుఖసంతోషములు కలుగుతాయని చెప్పబడింది.

శ్రీ వైఖానసాగమంలో చెప్పబడిన విధంగా, ఆలయ ద్వారములు తెరిచి, అర్చకులు లోపలికి ప్రవేశించిన తర్వాత, మొదటగా స్వామివారి దృష్టి పథంలో గోవు, వేదబ్రాహ్మణుడు, ఆదర్శం (అద్దం), అశ్వం, ఏనుగులను నిలిపి, శ్రీవారి ప్రథమ దృష్టి వీరిపై ప్రసరింపజేయాలని నిర్దేశింపబడింది. ప్రాచీనకాలం నుండి శ్రీవారిఆలయంతో అనుబంధం కలిగిన అర్చకులతో బాటు, సన్నిధిగొల్ల కూడా శ్రీవారిసేవలో తరించాడని అనుచానంగా వస్తున్న సంప్రదాయం. ఒకానొక కాలంలో సన్నిధి గొల్ల, అర్చకులతో బాటుగా, ఒక ఆవును కూడా సన్నిధి వరకు తీసుకెళ్ళి, శ్రీవారి ప్రథమ దృష్టి పథంలో నిలిపే ఆచారం వుండేదని, పారంపర్య అర్చకుల వలన తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సంప్రదాయం కొనసాగక పోయినా, వైఖానస భగవదారాధన క్రమంలో తెలుపబడిన విశిష్టమైన 'గోసూక్తం' అనే వేదమంత్ర పఠనంతో ఇప్పటికీ అర్చకులు మంత్రసహితంగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ సమయంలో ఆలయ సంప్రదాయాన్ననుసరించి, తిరుమలనంబి (ప్రథమాచార్యపురుషులు) వంశీయులు, ఆలయానికి సమీపంలోని ఆకాశగంగా తీర్థంనుండి మూడు బిందెల తీర్థాన్ని సన్నిధికి చేరుస్తారు. అర్చకులు సన్నిధిలోనికి ప్రవేశించి శ్రీవారి దివ్యమైన సాలగ్రామశిలాబింబాన్ని మొదటగా భక్తి పూర్వకంగా స్పృశించి పాదసేవ చేసికొంటారు. అనంతరం ముందు రోజు రాత్రి పవళింపు సేవలో శయనించిన శ్రీ భోగశ్రీనివాసమూర్తివారిని, జీవస్థానానికి వేంచేపు చేస్తారు. ఏకాంగి మైసూరా అఖండం, బ్రహ్మ అఖండం అనే రెండు పెద్ద దీపాలను వెలిగిస్తాడు. శ్రీవారికి ప్రత్యూష కాల అర్చనలో భాగం మొదటి నివేదనగా ధారోష్ణం కలిగిన పచ్చి ఆవుపాలను సమర్పిస్తారు. శ్రీవారి ముఖమండలమునకు పునుగు తైలంతో మర్దన చేసి పచ్చకర్పూరంతో 'గడ్డం బొట్టు' అనే చుక్కను తీర్చిదిద్దుతారు. కైంకర్యపరుల హారతి జరిగిన తర్వాత, గొల్లహారతిని శ్రీవారికి సమర్పిస్తారు. అనంతరం ముందుగా అర్చకులు,

బ్రహ్మతీర్థాన్ని తాము స్వీకరించి, తర్వాత జియ్యర్‌స్వామికి, సన్నిధిగొల్లకు బ్రహ్మతీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు.

**శ్రీవారి ఆరాధన– షడాసనములు**

శ్రీవారికి ఒకరోజు పూర్తిగా జరిపే కైంకర్యాలను ఆగమశాస్త్రాలలో షడాసనములుగా వర్గీకరణ చేయబడింది. 8 వ శతాబ్దానికి చెందిన వైఖానస పండితుడు శ్రీమన్నృసింహవాజపేయయాజులవారు. 'శ్రీమద్భగవదర్చా ప్రకరణమ్' అనే గ్రంథాన్ని రచించారు. పరిశోధకుల అభిప్రాయం మేరకు ఈ గ్రంథం, అప్పట్లో (8 వ శతాబ్దం) తిరుమల శ్రీవారిఆలయంలో జరిగే కైంకర్యాలను ఆగమశాస్త్ర మంత్రసహితంగా పొందుపర్చారని చెప్పబడుతున్నది. ఇది పంచ ఖండ తిరువారాధన క్రమంగా వైఖానస ఆలయాలలో ప్రసిద్ధి చెందినది. పూజాక్రమము ఆరు విధములుగా విభాగింపబడినది.

1. మంత్రాసనము, 2. స్నానాసనము, 3. అలంకారాసనము, 4. భోజ్యాసనము, 5. యాత్రాసనము, 6. పర్యంకాసనము వీటి గురించి వివరంగా తరువాతి భాగములలో తెలుపబడింది.

**పంచశుద్ధి**

వైఖానసాగమాన్ననుసరించి ఆలయంలో పూజాదికాలు ప్రారంభం చేసే ముందు, అత్యుత్తమ ఫలితములు పొందటానికి 'పంచశుద్ధులు' నిర్వహించాలని భృగు ప్రణీతమైన 'వాసాధికారం'లో చెప్పబడింది.

**ప్రథమం దేహశుద్ధి స్స్యాత్థానశుద్ధిర్ద్వితీయకమ్ ।**
**పాత్రశుద్ధిస్తృతీయం స్యాదాత్మశుద్ధిశ్చతుర్థకమ్ ।**
**పఞ్చమం బిమ్బశుద్ధిసాస్యదీరితాః పఞ్చ శుద్ధయః ॥**
**(ఇతి వాసాధికారే)**

అయిదు రకాల శుద్ధిప్రక్రియలో 1. దేహశుద్ధి, 2. స్థానశుద్ధి, 3.పాత్రశుద్ధి, 4. ఆత్మశుద్ధి 5. బింబశుద్ధిగా చెప్పబడింది. దేహశుద్ధి అనగా పూజ చేసే



అర్చకస్వాములు శుచిగా తలస్నానం చేసి, మడి ధోవతులు ధరించి సంధ్యావందనం, జపం, నిత్యహోమం (గృహ సంబంధితమైన) మొదలైన అనుష్ఠానములు చేసుకోవటం. ఇక స్థానశుద్ధి అనగా గర్భాలయం మరియు పూజ జరిగే స్థలములను చీపురుతో శుభ్రము చేసి, వేదమంత్రాలతో స్థలశుద్ధి జరిపి ఆరాధనకు సిద్ధం చేయటం.

శ్రీవారి ఆరాధనకు గర్భాలయంలో బంగారు పంచ పాత్రల (ఐదు) పాత్రలను ఉపయోగిస్తారు. అందులో నాలుగు చిన్న బంగారు పాత్రలు వరుసగా పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం ఉపచారాలకు వినియోగిస్తారు. మధ్యలో ఉన్న పెద్ద బంగారు పాత్ర శుద్ధతోయ పాత్రగా వినియోగిస్తారు. ఇంకా స్వామివారికి శంఖోదక సమర్పణ (శంఖంలో నీరు) కొరకు బంగారు శంఖం, ఉపచార సమర్పణకు బంగారు ఉద్ధరిణ మరియు ఈ పాత్రలన్నీ ఉంచటానికి ఒక వెండివేదిక, ఆచమనతీర్థం పరిగ్రహించటానికి బంగారు పతద్గ్రహ పాత్ర మొదలగునవి నిత్యార్చనలో ఉపయోగిస్తారు. వీటిన్నంటినీ ఆరాధనకు ముందు చక్కగా శుభ్రం చేయాలి. ఆరాధన సమయంలో అర్చకస్వామి వేదమంత్ర పురస్సరంగా ప్రోక్షణ చేసి శుద్ధి జరుపుతారు. ఈ ప్రక్రియనే పాత్రశుద్ధి అంటారు.

ఆరాధన సమయంలో భగవంతుని మూలబేరంలో నిక్షిప్తమై ఉన్న మహత్తర దివ్యసాన్నిధ్య శక్తిని, శ్రీనివాసుని ఇతర 4 రూపములలోకి మంత్ర పూర్వకంగా ప్రసరింపజేస్తారు. అంతేగాక ఈ శక్తిలో కొంతభాగాన్ని అర్చకస్వామి స్వయంగా తన దేహములో ప్రవేశపెట్టుకొనడం జరుగుతుంది. అంతటి దివ్యమైన శక్తిని స్వీకరించటం కొరకు, ఆగమశాస్త్రంలో చెప్పబడినరీతిగా ప్రాణాయామాది యోగక్రియలు మరియు ఆత్మసూక్తిపఠన జరిపి అర్చకులు శరీరాన్ని శుద్ధి చేసుకోవాలి. అర్చకులు చేసుకొనే శరీరశుద్ధి ప్రక్రియనే ఆత్మశుద్ధి అంటారు.

ఇక బింబశుద్ధి అనగా శ్రీవారిదివ్యమైనరూపాన్ని నిర్దేశించబడిన ద్రవ్యములతో (పాలు, పెరుగు మొ॥వి) మంత్రపూర్వకంగా శుద్ధి చేయటం.

**పంచపాత్రలు - విశేషాలు**

పంచపాత్రలను ఆ యా స్థానాలలో ఎలా వుంచాలో ఆగమంలో విశదీకరించబడివుంది. స్నాన పాత్ర ఆగ్నేయ దిక్కులోనూ, అర్ఘ్యపాత్ర నైఋతి నందు, పాద్యపాత్ర వాయవ్యంలో, ఆచమనపాత్ర ఈశాన్యంలో ఉంచాలి. శుద్ధతోయ పాత్ర మధ్యలోనూ, పతద్గ్రహ పాత్ర, పంచపాత్రల వేదికకు ఉత్తరం వైపున ఉంచాలి. శ్రీవారికి వివిధ ఉపచారములను సమర్పించడానికి ఉపయోగించే పంచ పాత్రలలో, చెప్పబడిన ఆ యాద్రవ్యములతో నింపవలెను. స్నానపాత్రలో కర్పూరం, ఉశీరం(వట్టివేరు), తక్కోలం(సుగంధతైలం), నల (లేపనంకొరకు), ఏలక్కాయలు, లవంగములు, మొదలైనవి స్నాన పాత్ర ఉపచారములకు సంబంధించిన ద్రవ్యములు. దర్భలు, అక్షతలు, తిల లు(నువ్వులు), వ్రీహి (బియ్యం), యవలు, మాష (మినుములు) , ప్రియంగు (కొఱ్ఱలు), సిద్ధార్థకం (తెల్ల ఆవాలు) మొదలైనవి అర్ఘ్య ద్రవ్యాలు.

ఇక పాద్యపాత్ర ద్రవ్యములు (తామరలు) పంకజం, విష్ణుపర్ణీ (పొన్న), శ్యామాకం (చామలు), దౌర్వమంకురములుగా చెప్పబడినవి. ఏలకులు, లవంగములు, ఉశీరము (వట్టివేరు), కర్పూరం, అగరుచందనం మొదలైనవి ఆచమన ఉపచారద్రవ్యములుగా నిర్దేశింపబడినవి.

ఈ ద్రవ్యములన్ని సమయాసందర్భములననుసరించి అన్ని దొరకడం దుర్లభం కావచ్చు. అందువల్ల దీనికి ప్రత్యామ్నాయం కూడా ఆగమశాస్త్రంలో చెప్పబడింది. పై ఉపచారములకు సంబంధించిన ద్రవ్యములలో ఏదీ లభ్యం కాక పోయినా, ఆ యా ద్రవ్యముల పేర్లు ఉచ్చరిస్తూ తులసీదళములు ఉపయోగించి ఆరాధన జరుపవచ్చు.

**ఘంటానాదం-విశిష్టత**

పంచపాత్రలు ఆయా స్థానములలో వుంచి, ద్రవ్యములు సమర్పించిన అనంతరం, శ్రీవారి ఆరాధన ప్రారంభించేముందు విధిగా ఘంటానాదం చేయాలి. ఘంటానాదమునకు ఆగమశాస్త్రంలో ప్రత్యేకమైన ప్రాముఖ్యత యివ్వబడింది.



**ఆగమార్థం తు దేవానాం గమనార్థం తు రక్షసామ్ ।**
**తస్మాత్సర్వ ప్రయత్నేన ఘంటాం సమ్యఙ్నినాదయేత్॥**
**[శ్రీ వైఖానస అర్చనానవనీతం]**

వైదిక క్రియలు ప్రారంభించే ముందు ఘంటానాదం చేయటం వలన, ఆ ప్రణవ ధ్వని విన్నంతనే, భూత, ప్రేత, పిశాచ, భేతాళాది బ్రహ్మరాక్షస గణాలు భయంతో చెల్లా చెదురయి పారిపోతాయి. దేవతాగణాలు ప్రసన్నమయి, మనం చేసే వైదిక క్రియ సంపూర్ణమైన ఫలితాన్ని ప్రసాదించునట్లు శుభాశీస్సులను అందజేస్తారు. ఏ యే సందర్భాలలో ఘంటానాదం చేయాలో ఆగమశాస్త్రంలో తెలుపబడివుంది. అర్చన ప్రారంభమునకు ముందు, దేవతలను ఆవాహన చేయునపుడు, ధూప, దీప సమర్పణ సమయంలో, మహానైవేద్యసమయంలో, కుంభ ధ్యానంలో, హోమకాలంలో, ఘంటానాదం విధిగా చేయాలి. విజయనగర సామ్రాజ్యానికి చెందిన ఒక రాజు. శ్రీవారి ఆలయం నుండి చంద్రగిరిలో తన కోట వరకు, శ్రీవారి మహానైవేద్యం సమయంలో మ్రోగించే రెండు భారీ ఘంటల ధ్వని, వినబడునట్లుగా, అక్కడక్కడ ఘంటా మండపములను ఏర్పాటు చేసి, ఆ ఘంటానాదం విన్నంతనే శ్రీవారికి నివేదన పూర్తయినదని గ్రహించి, తాను భోజనానికి ఉపక్రమించేవాడని చరిత్ర ద్వారా తెలుస్తోంది.

**మంత్రాసనమ్**

అర్చకస్వామి ఘంటానాదం చేసి శ్రీవారికైంకర్యాన్ని ప్రారంభిస్తారు. షడాసనములలో మొదటిదైన మంత్రాసనంతో పూజ ఆరంభమవుతుంది.

**ఆసనం పాద్యమాచామమర్ఘ్యం చ ముఖవాసనమ్ ।**
**పఞ్చోపచారా దేవస్య మన్త్రాసనపరిగ్రహే ॥**

మూలవిరాట్టుకు ప్రతిరూపమైన కౌతుక బేరం భోగ శ్రీనివాసమూర్తి వారికి మొదటగా ఆసనం (తులసీ దళములతో) సమర్పిస్తారు. అనంతరం వరుసగా పాద్యం, అర్ఘ్యం, ఆచమనమ్, ముఖవాసనమ్ వంటి ఉపచారములు సమర్పించి, ఆరాధనాక్రమంలో రెండవదైన స్నానాసనమునకు ఉపక్రమిస్తారు.

**స్నానాసనమ్**

**పాదుకం దంతకాష్ఠం చ తైలముద్వర్తనం తథా**
**శిరస్యామలకం తోయం కంకతం ప్లోతమేవ చ**
**అష్టోపచారా దేవస్య స్నానాసనపరిగ్రహే**
**[శ్రీ వైఖానస భగవదర్చాప్రకరణమ్]**

శ్రీవారిఆలయంలో అనాదిగా వస్తున్న సంప్రదాయంమేరకు కౌతుక బేరమైన శ్రీ భోగశ్రీనివాసమూర్తివారికే స్నానాసన ఉపచారములు సమర్పించబడుతాయి. మూలవిరాట్‌కి నిత్యం అభిషేకం నిర్వహించడం, తిరిగి అలంకరణ చేయడం ఇవన్నీ, లక్షలాది మంది భక్తులు విచ్చేసే శ్రీవారి ఆలయంలో, సమయాభావం వలన చేయుటానికి వీలుపడదు. అందువలన మహర్షులు శ్రీ వైఖానససంహితలలో చెప్పబడిన విధానంమేరకు, నిత్య స్నపనం (నిత్య అభిషేకం), కౌతుక బేరమైన శ్రీ భోగ శ్రీనివాసునికే సమర్పిస్తారు. నిత్య స్నపనం, విగ్రహ శుద్ధి (బింబ శుధ్యర్థం) కొరకు నిర్దేశింపబడినది. ఇది రెండు విధములుగా చెప్పబడింది. 1.అభిషేకం: శంఖంతోగాని లేక గిన్నెతో కాని విగ్రహంయొక్క శిరస్సుపై నీటితో అభిషేకించడం, 2. అభ్యుక్షణం (ప్రోక్షణం): వేదమంత్రపురస్సరంగా విగ్రహంమీద నీటిని చల్లటం (ప్రోక్షించటం). మొదటిది పాత్రఃకాల ఆరాధనలో భాగంగా చేయబడుతుంది. ఇక రెండవది మాధ్యాహ్నిక ఆరాధనలో నిర్దేశించబడినది. ఈ రెండూ కూడా రాత్రి ఆరాధనలో చేయనవసరం లేదు.

కౌతుక బేరమునకే నిత్యస్నపనం చేయాలని శ్రీవైఖానస అత్రిసంహిత సమూర్త్యర్చనాధికరణంలో చెప్పబడింది. ('కౌతుకే స్నపనం నిత్యం అర్చనాంగం ఉదీరితమ్॥'). ఈ స్నపనంలో చందనం, పరిమళ ద్రవ్యములు నీటితో కలిపి ఉపయోగించాలి ('కౌతుక స్నాపనం కుర్యాన్నిత్యం వై చందనాదిభిః॥'). తిరుమల శ్రీవారిఆలయంలో ఈ విధానమునే అనుసరిస్తారు.

'రూపే తు స్నపనం కుర్యాద్ అరూపే ప్రోక్షణం చరేత్' అని (సమూర్త్యర్చనాధికరణం) చెప్పబడినట్లు, సర్వాంతర్యామి అయిన ధృవబేరం (మూలరూపం)కు మంత్రించిన నీటితో ప్రోక్షణ మరియు ప్రతిరూపమైన కౌతుకబేరంకు అభిషేకం విధిగా నిర్వహించాలి. అర్చకస్వామి ప్రాతఃకాల ఆరాధనలో భాగంగా స్నానాసనమునకు సంకల్పం చేసికొంటారు. భోగ శ్రీనివాసమూర్తి అభిషేకం కొరకు కపిలగోవుపాలు, ఆకాశగంగాతీర్థం మరియు చందనం, పచ్చకర్పూరం, కుంకుమపువ్వు కలిసిన 'పరిమళం' అనే మిశ్రమాలను, సన్నిధి శ్రీ వైష్ణవ పరిచారకులు సిద్ధం చేస్తారు. స్నానాసనాంగ ఉపచారములైన పాద్యం, దంతకాష్ఠం (పండ్లు తోమడం, నాలుక శుభ్రం చేయటం) – జిహ్వాశోధన, తైలం (సుగంధభరితమైన తైలంతో స్వామివారికి మర్దనచేయడం), ఉద్వర్తన (మాష–పిష్టములతో శ్రీవారికి లేపనం చేయడం), ఆమలక (శిరస్సు మీద ఉసిరికను లేపనం చేయటం), స్నపన (నీటితో అభిషేకం), కంకతం (శిరస్సును శుభ్ర పరచటం), ప్లోతం (మెత్తటి నూలు వస్త్రముతో తుడవటం) వంటివి శ్రీవారికి భక్తి శ్రద్ధలతో, వేదపారాయణదారుల పురుషసూక్తాది పఠనంతో చేయబడతాయి. ఆవుపాలు, ఆకాశగంగా తీర్థం, పరిమళలేపనం తదితర ద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తారు. అభిషేక తీర్థాన్ని పతద్గ్రహ పాత్రలో సేకరించి, నివేదన అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదంగా వినియోగం చేస్తారు.



ఆగమశాస్త్రం ప్రమాణం మేరకు పంచబేరములలో, స్నపన బేరమునకు నిత్యస్నపనం నిర్వహించాలి. శ్రీవారిఆలయ ఆచారంమేరకు భోగ శ్రీనివాసమూర్తికే (కౌతుక బేరం) నిత్య స్నపనం జరుగుతున్నది. ఇది కూడా ఆగమసమ్మతమే. ఎందుకంటే ఆగమశాస్త్రాలలో ఒకే క్రియకు అనేక ప్రత్యామ్నాయాలు సూచించబడివున్నాయి. నిత్యం మూలవిరాట్టుకు స్నాపనం చేయలేని పక్షంలో, ఒక అద్దంలో శ్రీవారి ప్రతిబింబానికి స్నపనం జరుపవచ్చు. కౌతుకబేరం ఉన్నట్లయితే, నిత్యస్నపనం కౌతుక బేరానికి చేయవచ్చు. కౌతుక బేరానికి జరిపే స్నపనం నిత్యార్చనలో భాగంగా జరుపబడుతుంది. ఇవి షడాసనములలో స్నానాసన విశేషాలు. భోగమూర్తిని అభిషేకించిన తర్వాత సన్నిధిలో పరదావేసి, భోగమూర్తికి పచ్చకర్పూరనామం, చందనతిలకం, వస్త్ర ధారణ చేస్తారు. తదుపరి శ్రీవారి బంగారు పాద కవచములను స్నానవేదిక

మీద ఉంచుతారు. పరదా వేసి వుండగానే, అనాదిగా వస్తున్న ఆచారం మేరకు మూలవిరాట్ పాదములు రెండింటిమీద మెత్తటి ఎరుపురంగు నూలు వస్త్రాలనుంచి (10×10 అంగుళములు కొలత గలది) ఆ వస్త్రాలమీద తులసీ దళములను సమర్పిస్తారు. శ్రీవారి దివ్యరూపం అత్యంత పవిత్రమైన సాలగ్రామ శిలామయం. ప్రపంచంలో ఇంక ఏ క్షేత్రంలోనూ కానరాని విధంగా సుమారు 9 అడుగుల ఎత్తుతో భారీ పరిమాణమున్న సాలగ్రామశిలాబేరం శ్రీవారి మూర్తి. అందు వలన పాదకవచములను. అలంకరించేటప్పుడు ఎటువంటి ఒత్తిడి నిజపాదముల మీద కలుగకుండా, నూలు వస్త్రాలు, తులసిని వుంచుతారు. భోగ శ్రీనివాసమూర్తివారి పీఠంమీద కూడా తులసిదళ సమర్పణ జరిపి అనంతరంవారిని యథాస్థానమునకు (జీవస్థానం లేదా బ్రహ్మస్థానం అంటారు) వేంచేపు చేసి పరదా తీస్తారు. అర్చకులు శ్రీవారి బంగారుపాదకవచములకు (శఠారి ప్రతిరూపం) ఆసన, పాద్య, అర్ఘ్య, ఆచమనాది ఉపచారసమర్పణ చేసి, పరిమళభరిత జలంతో అభిషేకిస్తారు. తదుపరి తెల్లటి నూలువస్త్రంతో పాదకవచములను తుడిచి, శ్రీవారినిజపాదములను అలంకరిస్తారు. సన్నిధిలో రెండు పెద్ద వెండిపాత్రలలో అత్యంతప్రాచీనమైన, దివ్యమైన సాలగ్రామాలున్నాయి. ఒక వెండి పాత్రలో సుమారు ఎనిమిది పెద్ద సాలగ్రామములు, మరొక వెండిపాత్రలో 38 కి పైగా చిన్న సాలగ్రామాలు నిత్య పూజలందుకుంటున్నాయి. ప్రాచీన వైష్ణవ క్షేత్రాలలో, స్వామివారితో పాటు, సాలగ్రామాలను కూడా అర్చించడం సంప్రదాయంగా చేయబడుతోంది. అందులో శ్రీవారిసన్నిధిలోవున్న అరుదైన సాలగ్రామాలు మహత్తరమైన శక్తి గలవిగా పెద్దలు చెప్పుకుంటారు.

స్నానాసనంలో భాగంగా అర్చకస్వామి మొదటగా పెద్ద సాలగ్రామాలను వేదికమీద వుంచి, ఆసన, పాద్యాది ఉపచార సమర్పణ గావించి వెండి పాత్ర అడుగున మెత్తటి నూలువస్త్రం, వస్త్రంపై తులసీ దళాలుంచి ఆపై సాలగ్రామాలనుంచుతారు. ఇదేరీతిగా మరొక వెండిపాత్రలోని చిన్న సాలగ్రామాలకు స్నపన జరుగుతుంది. తర్వాత మెత్తటి వస్త్రంతో ధ్రువాది



పంచ మూర్తులకు ప్లోత సమర్పణ జరుగుతుంది. స్నపన పూర్తయ్యే సమయంలో జియ్యర్ స్వామివారు శ్రీ గోదాదేవి విరచితమైన 'నీరాట్టం' పాశురాలను పఠిస్తారు. ప్రతిరోజు శ్రీవారికి జరిపే తోమాలసేవలో, (ప్రాతఃకాల ఆరాధనకు ఆలయ పరిభాషలో తోమాలసేవ అని పేరు), మొత్తం అయిదు వస్త్రములు [మెత్తటి నూలు వస్త్రములు 10×10 అంగుళములు] ఉపయోగిస్తారు. అందులో ఎరుపు రంగులో వున్న రెండు శ్రీవారిపాదముల మీదుంచుతారు. రెండు తెల్లటి వస్త్రములు రెండిటిని వెండి పాత్రల్లోని సాలగ్రామాల క్రింద ఉంచుతారు. ఇక 5 వది శ్రీవారి పంచమూర్తులకు 'ప్లోతం' అనే ఉపచారమివ్వడానికి ఉపయోగిస్తారు. ప్రాతఃకాలార్చనలో భాగంగా స్నానాసనం పూర్తి కాగానే, ముందురోజు ఉదయం ఉపయోగించిన వస్త్రాలను, అర్చకస్వామి ముడివేసి, తన కళ్ళకు అద్దుకొని, శిరస్సు మీదుంచుకుని జీయర్‌స్వాములకు అందజేస్తారు. దీనికే 'తిరువడి వస్త్రం' అనే పేరు (శ్రీపాద వస్త్రం).

**పరదా(తెర)–విశేషాలు**

అనంతరం గర్భాలయం పరదా వేయబడుతుంది. ఈ పరదానే ఆగమ పరిభాషలో 'తిరస్కరిణి' లేక 'యవనిక' అని కూడా అంటారు. శ్రీవారి గర్భాలయంలో ఉన్న ప్రతి వస్తువుకు వైఖానస ఆగమశాస్త్రంలో ఒక ప్రత్యేకత ఉంది. అలాగే సిల్కుతో తయారుచేసిన పరదాల గురించి.

శ్రీవారిని అర్చించే అర్చకస్వాములు తప్ప; ఇతురులెవ్వరును అనగా, రోగగ్రస్తులు, నాస్తికులు, అశుచిగానున్న అనేకరకాలవారు శ్రీస్వామివారికొన్ని పూజలను దర్శించరాదు. అందువల్లే 'యవనిక' అనబడే పరదాదాపున వాటిని నిర్వహిస్తారు. [శ్రీ వైఖానస భగవదర్చా ప్రకరణమ్] అని చెప్పబడింది. భగవంతుని దర్శించడానికి వచ్చే భక్తులు అకాల సమయాలలో దర్శించినచో అనేక దుష్ఫలితాలు కలుగుతాయి. అందువల్ల శ్రీ వైఖానససంహితలలో సూచించిన విధంగా గర్భాలయ ద్వారమునకు ఒక చక్కటి పరదాను ఏర్పాటు చేయాలి. స్వామివారి నిత్యార్చనలో భాగంగా పీఠార్చన సమయంలోను,

మహానివేదన, మొదలైన సమయాలలో స్త్రీలు, పతితులు, పాషండులు, బౌద్ధులు, దురహంకారులు, పిచ్చివారు, తలస్నానం కొరకు శిరస్సుపై నూనె మర్దన చేసుకున్నవారు, కుష్ఠవ్యాధి గ్రస్తులు, అన్య దేవతా భక్తులు (హైందవేతరులు). మొదలైనవారు స్వామివారిని దర్శింపరాదు. అట్లు దర్శించినచో మహత్తర దోషం సంభవించి, ఆ పూజ నిష్ఫలమవుతుంది. అందుకే ద్వారమునకు విధిగా పరదాను ఏర్పరిచి ఆ యాపూజా సమయములయందు పరదాను మూసివేయాలి. శాస్త్రం అనుమతించిన సమయంలో స్వామివారి దర్శనం చేయటం వలన అత్యుత్తమ ఫలితాలు శుభాలు కలుగుతాయి. అకాల దర్శనం వల్ల అనారోగ్యం, ధననష్టం, సంతాననష్టం కలుగుతుంది. సకాలంలో స్వామివారిని సేవించటంవలన దీర్ఘాయుష్షు, ధనలాభం, సంతానప్రాప్తి, చక్కటి గృహం ఉద్యానవనంతో సహా, గొప్పగౌరవం వంటి అత్యుత్తమ ఫలితాలు ఇహ లోకంలో ప్రాప్తిస్తాయి. మరణం తర్వాత భక్తునికి విష్ణువు యొక్క శంఖ, చక్రములు, శ్యామవర్ణం, చతుర్భుజాలు ప్రసాదించబడుతాయి. గరుడుని అధిరోహించి ఊర్ధ్వలోకాలలో ప్రయాణంచేస్తూ, దేవతల నమస్కారాలు అందుకుంటూ, సూర్య, చంద్ర మండలములు మరియు అత్యున్నతమైన సత్యలోకం చేరి అక్కడ అమృతం సేవించి, తర్వాత పునరావృత్తి (పునర్జన్మ లేకుండా) రహితమైన మోక్షప్రాప్తి, విష్ణుసాయుజ్యం పొందుతాడని శ్రీ వైఖానస కాశ్యప జ్ఞానకాండలో చెప్పబడింది.

**భూశుద్ధి–ఆవాహన**

శ్రీవారిసన్నిధిలో పరదా వేసిన తర్వాత వైష్ణవ పరిచారకుడు, ఆకాశగంగ నుండి తేబడిన మిగిలిన రెండు బిందెల తీర్థమును, పరిమళ ద్రవ్యములు సిద్ధం చేస్తాడు. అర్చకస్వామి ఘంటానాదం చేసి, శ్రీవారికి 'భూశుద్ధి' అనే ఆవాహన ప్రక్రియను నిర్వహిస్తారు. అర్చకస్వామి రేచక, పూరక, కుంభకాదులతో అష్టాంగయోగమార్గ విధిగా ప్రాణాయామం చేసి భూశుద్ధి కొరకు సంకల్పం చేస్తారు. తదుపరి ఆకాశగంగా తీర్థమును పంచపాత్రలయందు వరుసగా పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, శుద్ధతోయం పాత్రలలో నింపి, (అంతకు ముందు



ఆ యా పాత్రలకు చెప్పబడిన ద్రవ్యములను లేక ఆ ద్రవ్యముల పేర్లు ఉచ్చరిస్తూ తులసీదళములను పాత్రలలో వేయవలెను). వేదమంత్రోచ్చారణతో అభిమంత్రించవలెను. అనంతరం విష్ణుగాయత్రీ ఉచ్చారణతో దశదిగ్బంధనం చేయాలి. ఒకసారి దశదిగ్బంధనం పూర్తయిన తర్వాత, ఆరాధన ముగిసే వరకు పంచపాత్రలను జరపడం, కదిలించటం చేయకూడదు. పంచపాత్రల ఆవాహన చేసి, అర్చకుడు ఆత్మసూక్తాన్ని పఠించి తదుపరి భూశుద్ధి జరుపుతారు. బంగారు ఉద్ధరిణెలో ప్రణిధీజలం (పంచపాత్రలనుండి) తీసుకుని మొదటగా ధ్రువబేరమునందు విష్ణ్వాది పంచ మూర్తులను ఆవాహనం చేస్తారు. తిరుమలలో శ్రీవారిబింబం స్వయంవ్యక్తంగా ఆవిర్భవించడంవల్ల, ఆవాహన, విసర్జన అనే క్రియలు స్వయంవ్యక్తక్షేత్రంలో నిత్యార్చనయందు నిర్వహించరు. స్వయంవ్యక్త అర్చామూర్తిలో సదాస్వామివారి సాన్నిధ్యం ఉంటుంది వైఖానస ఆగమంలో ఈ పంచమూర్తుల పేర్లు ఈ విధంగా చెప్పబడినాయి. పంచమూర్తులతో పాటు విధిగా అమ్మవార్లైన 'శ్రీ' (లక్ష్మీ), 'భూ' లకు అన్ని ఉపచారాలు సమర్పించాలి.

| ఆగమం | | మంత్రోక్తం | | లౌకికం |
|---|---|---|---|---|
| ధ్రువబేరం | – | విష్ణు | – | మూలవిరాట్టు,శ్రీ వేంకటేశ్వరస్వామి |
| | | శ్రీ,శ్రియ | – | శ్రీదేవి, లక్ష్మీదేవి |
| | | హరిణీ | – | భూదేవి, పద్మావతి |
| కౌతుకబేరం | – | పురుష | – | భోగ శ్రీనివాసమూర్తి |
| | | శ్రియ | – | లక్ష్మి |
| | | భూ | – | పద్మావతి |
| ఉత్సవబేరం | – | సత్య | – | మలయప్పస్వామి |
| | | ధృతి | – | శ్రీదేవి |
| | | పౌష్ణీ | – | భూదేవి |

స్నపన బేరం - అచ్యుత - ఉగ్రశ్రీనివాసమూర్తి
పవిత్రీ - శ్రీదేవి
క్షోణీ - భూదేవి

బలి బేరం - అనిరుద్ధ - కొలువు శ్రీనివాసమూర్తి
ప్రమోదాయినీ - శ్రీ
మహీ - భూ

పై పంచ మూర్తులలో భోగ శ్రీనివాసమూర్తి, కొలువు శ్రీనివాసమూర్తి వీరిద్దరూ ఏక మూర్తులుగా వేంచేసి ఉన్నారు. అనగా వీరిరువురికి ప్రక్కన అమ్మవార్లు ఉండరు. శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రంలో అమూర్తి (రూపం లేకుండా పూజ) పూజ, సమూర్తి పూజ (విగ్రహ పూజ) చెప్పబడివుంది. అంటే భౌతికంగా విగ్రహరూపం లేకపోయినా, వారున్నట్టుగానే భావించి ఆరాధన చేయాలి. అంతేగాక విష్ణువును ఎల్లప్పుడు లక్ష్మీదేవితో కలిపే ఆరాధన విధిగా జరుపవలెనని వైఖానసాగమం విశదీకరిస్తోంది. అందుకే భోగమూర్తి, కొలువుమూర్తి వార్లను అమ్మవారల సమేతంగా ఉన్నారని భావించి ఆరాధన చేయడం, అనాదిగా వస్తున్న సంప్రదాయం. మూలవిరాట్ లోని విష్ణు, పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధ-శ్రీ, ధృతీ, పవిత్రీ, ప్రమోదాయినీ-హరిణీ, పౌష్ణీ, క్షోణీ, మహీలను స్మరించి, ఈ శక్తులను మిగతా బేరములలో ఆవాహన చేయాలి. ఇక్కడ ఆవాహన ప్రశంస గురించి కొంత తెలుసుకోవాలి. మాములుగా వచ్చే సందేహం ఏవిటంటే మూలవిరాట్టు నుండి శక్తులను ఇతర మూర్తులలో ఆవాహన చేయడం వలన, మూలవిరాట్ శక్తి క్షీణమవుతుందా? ఈ సందేహానికి 'శ్రీ విష్ణ్వర్చనా సార సంగ్రహం' లో చక్కటి వివరణ యివ్వబడింది.

**ధ్రువా దావాహనం నిత్యం కౌతుకాదౌర్విధీయతే ।**
**దీపాద్దీపశతం జాతం మూలదీపో న శామ్యతి ॥**



**యథా కుణ్డగతో వహ్ని ర్వాయునా జ్వలితో భవేత్ ।**
**తథా బిమ్బగతో విష్ణుర్మన్త్రేణ జ్వలితో భవేత్॥**

[శ్రీ విష్ణ్వర్చనసారసంగ్రహం]

ప్రతిరోజు నిత్యార్చనయందు ధ్రువబేరంనుండి కళలను కౌతుకాది మూర్తులలో ఆవాహన చేయవలెను. ఒక దీపం నుండి మరికొన్ని వందల దీపాలను వెలిగించినా, మొదటి దీపం యొక్క వెలుగు తగ్గనట్లే, మూలవిరాట్ నుండి కళలను ఇతరమూర్తులలో ఆవాహన చేసినప్పటికీ, శ్రీవారి శక్తి అలాగే నిలిచి ఉంటుందని ఆగమశాస్త్ర వచనం. అగ్నికి గాలి తోడైతే ఏ విధంగా ఉజ్జ్వలంగా దేదీప్యమానంగా జ్వలిస్తుందో, అట్లే బింబంలోని విష్ణువు మంత్రోచ్చారణ వలన ప్రసన్నుడయి, సదా సాన్నిధ్యం లో ఉండి భక్తులకు వరాలు ప్రసాదిస్తాడని వివరణ. ఆవాహన చేయునపుడు ధ్రువబేరంనుండి కౌతుక బేరమునకు సంధానం చేయాలి. ఈ సంధానం 'సంబంధ కూర్చ' ద్వారా చేయాలి. సంబంధ కూర్చ బంగారు, వెండి, లేక దర్భలతో (32 దర్భలు) తయారు చేసినదిగా ఉండాలి. ఇవేవి లేని పక్షంలో తులసీ దళముతోనే సంధానం చేయాలి. సంబంధ కూర్చతో సంధానం చేసిన తర్వాత కౌతుక బేరం నందు పురుష-శ్రీ-హరిణి శక్తిని ప్రసరింపజేయాలి.

**మూలబేరం తు పంకం స్యా త్పుష్పం కౌతుకమేవహి ।**
**జలం విమానం కూర్చం చ నాళమిత్యేవ భావయేత్ ॥**

సంబంధకూర్చ ద్వార శ్రీవారి కళలు ఏ విధంగా కౌతుకబేరంలోకి ప్రసరిస్తాయో పై శ్లోకంలో వర్ణించబడింది.

గర్భాలయం నీళ్ళని ప్రతిబింబిస్తుంది, ధ్రువ బేరం ఆధారంగా వున్న భూమి, పుష్పం కౌతుకబేరం. ఈ పుష్పం భూమిలో నుండి పుష్పిస్తుంది, కానీ నీటి ద్వారా పెరుగుతుంది. ఈ సంబంధ కూర్చ పువ్వు యొక్క కాడగా చెప్పబడింది. ఈ కాడ, భూమిని పుష్పాన్ని నీటిద్వారా కలుపుతుంది

తరువాత కౌతుకబేరంనుండి ఉత్సవబేరంలోకి సత్య-ధృతీ-పౌష్ణీలను, ఉత్సవబేరంనుండి స్నపనబేరంలోకి అచ్యుత-పవిత్రీ-క్షోణీలను, స్నపన బేరంనుండి బలిబేరంలోకి అనిరుద్ధ-ప్రమోదాయినీ-మహీలను. ఆవాహన చేయవలెను. విగ్రహంలోకి కళలను ఆవాహన చేసే స్థానాలు ఈ విధంగా చెప్పబడింది. మూర్ధ్ని (శిరస్సు), లలాటం (నుదురు), చక్షు (కళ్ళు), ఘ్రాణ (ముక్కు), కర్ణ (చెవులు), వక్త్ర (నోరు), బాహు (భుజములు), హృది (గుండె), నాభి, కామ్యాధార, పాదములలో కళలను ఆవాహన చేయాలి. ధృవబేరంలో అన్ని కళలు సంపూర్ణంగా ఉంటాయి. అందులో 6 వ వంతు కౌతుకబేరంలోకి ఆవాహన చేయాలి, అదే విధంగా 7 వ వంతు ఉత్సవ బేరంలో, 8 వ వంతు స్నపన బేరంలో, 10 వ వంతు బలి బేరమునందు ఆవాహనం చేయాలి. బలి బేరంలో ఒక వంతు శక్తిని గర్భాలయవిమానం, నిత్యాగ్నిహోమగుండం, మహాబలిపీఠం మరియు అర్చకునిలో ఆవాహన చేయాలని శ్రీ వైఖానస భృగుసంహిత క్రియాధికారంలో చెప్పబడింది. అందువల్ల సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామి సాన్నిధ్య శక్తి కలిగిన విమానం, నిత్యాగ్ని హోమగుండం, మహాబలిపీఠం, వైఖానస అర్చకస్వామి, శ్రీవారికి ప్రతిరూపంగా, పవిత్రమైనవిగా చెప్పబడినవి.

## నిత్యార్చన సంకల్పం

భూతశుద్ధిలో భాగంగా ఆవాహన ప్రక్రియ తర్వాత పంచబేరములకు ఏకాంతంగా (పరదా వేసి ఉండగానే) ఉపచార సమర్పణ చేసి, శంఖోదకం సమర్పించి, మరల ప్రాతఃకాలార్చన-అలంకారాసనం చేయటం కొరకు ఘంటానాదం చేసి పరదా తీయడం జరుగుతుంది. అర్చకులు 'ఆలవట్టం' (విసనకర్ర) ను జీయర్ స్వామి చేతికిచ్చి, వారి వద్దనుండి శ్రీవారి తోమాలసేవ నిర్వహించడానికి తులసిని స్వీకరిస్తారు. తదుపరి అర్చకులు ప్రాణయామం చేసుకుని, మహాసంకల్పం పఠిస్తారు. ఆలయంలో అర్చకుల ద్వార జరుపపడే నిత్యార్చన, లోకక్షేమాన్ని కాంక్షించి చేస్తారు. ఒకసారి సంకల్పంలో ఏమి చెప్పుకుంటారో పరిశీలిద్దాం. మొదటగా గురుపరంపరానుసంధానమ్ (భగవాన్ విఖనస మహర్షి ప్రార్థన) చేసుకుని, దేశకాల వర్తమానములను, పంచాంగమును.



కీర్తించి, తదుపరి .... శ్రీ శ్రీనివాస స్వామినః ప్రీత్యర్థం, అస్మిన్ గ్రామే స్థితానాం ప్రజానాం బ్రాహ్మణాది సర్వవర్ణాణాం సర్వేషాం భక్తజనానాం చ, వ్యాధి చోర దుర్భిక్ష అనావృష్టి రాజబాధాది సర్వోపద్రవ శాంత్యర్థం, స్వస్త్యర్థం, సమస్తసన్మంగళావాప్త్యర్థం, రాజరాష్ట్రగ్రామ యజమానాచార్యార్చకపాచక పరిచారికాభివృధ్యర్థం, ధర్మార్థ కామమోక్ష చతుర్విధ పురుషార్థ ఫల సిధ్యర్థం, సంభవతా నియమేన, సంభవతా కాలేన, సంభవతా ద్రవ్యేణ, సంభవద్భిరుపచారైశ్చ, శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రవిధి మవలంబ్య, ప్రాతఃకాలార్చనం కరిష్యే.

ఇక్కడ గ్రామం అంటే విస్తృతమైన అర్థం చెప్పబడివుంది. ఎందుకంటే స్వయంవ్యక్త దేవాలయంలో అర్చన సర్వలోక సమృద్ధికరం. గ్రామం-అంటే స్వామివారు వెలిసిన ఊరు, పట్టణం, జిల్లా, రాష్ట్రం, దేశం, ప్రపంచం అని అర్థం చెప్పవచ్చు. సమస్త మానవాళి, బ్రాహ్మణాది నాలుగు వర్ణములవారు. ఇంకా అందరు భక్తులకు, వ్యాధులు, దొంగలభయం, కరువుకాటకాలు, రాజు యొక్క దుష్పరిపాలన వంటి అన్ని ఉపద్రవములు కలుగకుండా, శ్రీవారిని ప్రార్థిస్తూ, ఈ చెడు ఫలితాలు తొలగి అన్ని మంచి ఫలితాలు కలగాలని, రాజు, రాష్ట్రం (దేశం), యజమాని, ఆచార్యుడు, అర్చకుడు, వంటవారు (పాచక), పరిచారకులు సుఖంగా వుంటూ వారి పని సక్రమంగా నెరవేర్చాలని, సమస్త మానవాళికి నాలుగు పురుషార్థములైన ధర్మ, అర్థ, కామ, మోక్షములు అన్నీ స్వామివారు ప్రసాదించాలని శ్రీవారిని సంకల్పంలో కోరుకుంటారు. అంతేగాక అన్ని నియమములు, ద్రవ్యములు, సమయం, ఉపచారములు శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర విధిగా అవలంబిస్తూ ప్రాతఃకాలార్చనం చేయబోతున్నాను అని మహాసంకల్పమునకు అర్థం.

## తోమాల సేవ

జియ్యర్ స్వాములు అర్చకుల చేతికి తులసి యిచ్చి, ప్రబంధానుసంధానం చేస్తూ 'సాయిత్తురుళా శ్రీ శైలేశ దయాపాత్రం' అని ప్రారంభించగా, శయన మంటపంలో ఉన్న అధ్యాపకులు సుస్వరంగా ప్రబంధ సేవాకాలం పారాయణ

చేస్తారు. ఉదయం తోమాలసేవలో శ్రీ ఆండాళ్ విరచితమైన 'తిరుప్పావై', తొండరడిప్పొడి ఆళ్వార్ రచించిన 'తిరుప్పళ్ళియెళుచ్చి', 'తిరుప్పళ్ళాండు' (పెరియాళ్వార్) మొదలైన పాశురాలను పఠిస్తారు. జియ్యర్ స్వాములు, అధ్యాపకులు ప్రబంధ పాశురాలను పఠిస్తుండగా వైఖానస అర్చకస్వామి సన్నిధిలో శ్రీవారికి వేదమంత్ర పురస్సరంగా తోమాలసేవకు సంబంధించిన ఉపచారములు సమర్పిస్తారు.

తమిళ పదమైన 'తోమాల' నుండి, 'తోమాలసేవ' అనే పేరు స్థిరపడింది. శ్రీవారి ఆలయంలో స్వామి వారికి నిత్యార్చనలో భాగంగాజరిపే 'తోమాలసేవ', ఉదయం (విస్తారంగా జరుగుతుంది), మధ్యాహ్నం (లఘువుగా జరుపబడుతుంది), సాయంత్రం (విస్తారంగా) మూడు పుటలు నిర్వహిస్తారు. 'తోమాల' అంటే చేతితో కట్టిన పూలదండ అని అర్థం. ఈ తోమాలసేవలోనే గర్భాలయంలోని శ్రీవారి పంచమూర్తులకు మరియు ఇతర దేవతామూర్తులకు. పూలదండలతో అలంకరణ జరుగుతుంది.

**అలంకారాసనం**

తోమాలసేవలో భాగంగా శ్రీవారికి అలంకారాసనం సమర్పించబడుతుంది.

**వస్త్రం యజ్ఞోపవీతం చ గంధాలేపనభూషణే**
**పుష్పదామాంజనాదర్శ ధూపదీపో౽ర్ఘ్యమేవ చ**
**దశోపచారాన్ దేవస్య అలంకారాసనే దదేత్ ॥**

అలంకారాసనంలో భాగంగా వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, ఆభరణ సమర్పణ, పుష్పదామ, అంజన, ఆదర్శ, ధూప, దీప, అర్ఘ్యమనే 10 ఉపచారములు సమర్పించబడతవి. భోగ శ్రీనివాసమూర్తి వారికి స్నానాసనం అయిన తరువాత వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, ఆభరణం, మొ॥న ఉపచార సమర్పణ జరుగుతుంది. తోమాలసేవలో భాగంగా అర్చకులు ధ్రువాది మూర్తులకు ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, స్నానపాత్ర ఉపచారములు మరియు శంఖోదకమును. సమర్పిస్తారు. మొదట దివ్యమంగళసాలగ్రామ



అర్చారూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి మూలవిరాట్టుకి, వక్షఃస్థలంలో కుడివైపున ఉన్న బంగారు లక్ష్మీ ప్రతిమకు, ఎడమవైపున ఉన్న బంగారు పద్మావతి (భూదేవి) ప్రతిమకు ఉపచార సమర్పణ జరుగుతుంది. తరువాత వరుస క్రమంలో శ్రీ భోగ శ్రీనివాసమూర్తివారికి శ్రీ–భూసమేతంగా, మలయప్పస్వామి, శ్రీదేవి, భూదేవులకు – కొలువు శ్రీనివాసమూర్తికి (శ్రీ–భూసమేతంగా), సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారికి, రుక్మిణి సమేత శ్రీ కృష్ణస్వామివారికి, సుదర్శన చక్రమునకు, సాలగ్రామములకు, విమాన వేంకటేశ్వరస్వామివారికి ఉపచార సమర్పణ చేస్తారు. ఇది ఆలయంలో వస్తున్న ఆచారంమేరకు అనుసరించే క్రమము.

అర్చకస్వామి అన్ని దేవతామూర్తులకు ఉపచార సమర్పణ చేసి మిగిలిన తులసిని శ్రీవారి పాదముల చెంతనుంచి క్షమా ప్రార్థన, పాదసేవ చేసుకుంటారు.

ఇప్పుడు గర్భాలయంలోని దేవతామూర్తులకు పూలదండలతో అలంకరణ జరుగుతుంది. తిరుమల ఆలయంలో శ్రీవారి ధ్రువబేరమును పూలదండలతో అలంకరించటమన్నది ప్రత్యేక లక్షణము. పూజాంతంలో చేసే పూలదండల అలంకారం వలన భక్తునిదృష్టి శ్రీవారిమూర్తి మీద లగ్నమవుతుంది. పూలదండలు పరిమాణం చిన్నవి, పెద్దవిగా వివిధ ఆకృతులలో తయారు చేయబడి, ఒక్కొక్క ప్రత్యేక భాగములో అలంకరించుటకు ఉద్దేశింపబడినవి. ఆగమశాస్త్రంలో పుష్పమాలలను, నిత్యార్చన తర్వాత ఏయే భాగములలో అలంకరించాలో తెలుపబడివుంది. చక్కటి సువాసన వెదజల్లే పుష్పమాలికలను, విగ్రహంలోని వివిధ భాగాల అలంకరణకు సరిపడే కొలతలతో రూపొందించి శ్రీవైఖానస భృగుసంహితలో చెప్పబడిన విధంగా మూర్ధ్న (శిరస్సు), నుదురు (లలాటం), పాదం (పాదాలు), పీఠం (శ్రీవారి పాదాల క్రింద పద్మపీఠం), భుజములు, కర్ణములు, హృదయం, శంఖ, చక్రములకు. విధిగా పూలమాలలతో అలంకరణ చేయాలి.

**భుజే చక్రే చ శంఖే చ పుష్పం దద్యాత్ సమంత్రకమ్ ।**
**మౌళౌ లలాటే కర్ణం చ హృదయే భుజయోస్తథా ॥**

ఒకవేళ కిరీటం, కంఠాభరణాలు, చేతి కంకణాలు లేని పక్షంలో, స్వామివారి విగ్రహం లోని ఆ యా భాగాలను కూడా విధిగా పుష్పమాలలతో అలంకరించాలి. ('తదలాభే తత్తదంగేషు పుష్పాణి యోజయేత్॥'). శ్రీవారికి నిత్యం అలంకరించే పుష్పమాలల వివరాలు:

**మూలవిరాట్టుకు:**

1. పాదములకు, పీఠమునకు – 2 మాలలు, 18 అంగుళాలు పొడవుతో దీన్నే ఆలయ పరిభాషలో 'తిరువడిసరం' అని అంటారు.

2. కంఠ భాగమునకు – 1 మాల, 60 అంగుళాల పొడువుతో, వ్యావహారిక నామం – 'కంఠసరి'.

3. వక్షఃస్థలంలో కొలువైవున్న బంగారు లక్ష్మి, పద్మావతి (భూదేవి) ప్రతిమలకు – 2 మాలలు, 27" పొడవు – 'వక్షఃస్థల తాయార్ల సరాలు'

4. తావళములు – (1 మాల – 40" పొడవు, 1 మాల – 50" పొడవు) ఈ మాలలను, శ్రీవారికి శంఖ, చక్రముల నుండి ఇంగ్లీషు అక్షరం 'U' ఆకారం లో వేలాడదీస్తారు.

5. శిఖామణి మాల – కిరీటమునకు, 1 మాల – 50" పొడవు.

6. కఠారి సరం – సూర్యకఠారి అనే కత్తికి అలంకరణకై – 1 మాల – 36" పొడవు

7. సాలగ్రామ మాలలు – 2 మాలలు, ఇరువైపులా శంఖ, చక్రముల నుండి అనగా భుజాల నుండి నిలువుగా క్రిందివరకు వేలాడదీస్తారు, 108" పొడవు.

**గర్భాలయంలో ఇతర మూర్తులకు:**

1. భోగ శ్రీనివాసమూర్తి వారికి – 1 మాల – 27" పొడవు.

2. మలయప్పస్వామి, శ్రీదేవి, భూదేవి – 4 మాలలు, స్వామివారికి 2, అమ్మవార్లకు 1 చొప్పున.



3. ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి – 3 మాలలు.

4. కొలువు శ్రీనివాసమూర్తివారికి – 1 మాల, 27" పొడవు.

5. శ్రీ సుదర్శనులవారికి – 1 మాల.

6. సీతా, లక్ష్మణ సమేత శ్రీరాములవారికి – 3 మాలలు.

7. రుక్మిణీ సమేత కృష్ణస్వామివారికి – 2 మాలలు.

ఇంకా శ్రీవారి పరివారమైన అనంత, గరుడ, విష్వక్సేన, ఆంజనేయ, సుగ్రీవ, అంగద – 1 మాల చొప్పున, ద్వారపాలకులకు – 4 మాలలు, గరుడాళ్వారు – 2 మాలలు, శ్రీవరదరాజస్వామి, పోటు తాయారు, పడిపోటు తాయారు, శ్రీ యోగనరసింహస్వామి, శ్రీ విష్వక్సేనులవారు (మూలవరులు) – 1 మాల చొప్పున నిత్యం అలంకరిస్తారు. ఈ మాలలన్నీ పాత వాడుకలో ఉన్న మూర (18"), బార (36") మరియు 1 1/4 మూర అనే కొలతలతో వ్యవహరిస్తారు. మొదటగా శ్రీవారి మూలవిరాట్ పాదములకు పుష్పమాల సమర్పణతో అలంకరణ ప్రారంభమవుతుంది. తర్వాత పద్మపీఠమునకు, వక్షఃస్థల తాయార్లిరువురికీ, భోగశ్రీనివాసమూర్తి కొలువు శ్రీనివాసమూర్తి, కంఠసరం, ఉల్–తావళము (హస్తములలోపలికి వేసేమాల), తావళములు, శిఖామణి, సాలగ్రామమాలలు, ఉత్సవమూర్తికి, ఉగ్రమూర్తికి, సీతారామలక్ష్మణులకు, కృష్ణస్వామి, రుక్మిణీ తాయార్లకు, శ్రీ సుదర్శనులవారికి వరుస క్రమంలో పుష్పమాలలతో అలంకరణ జరుగుతుంది. ఆలయంలో అమలులోఉన్న ఆచారం ప్రకారం, శిఖామణిని అలంకరించేటప్పుడు పరదావేసి, మరలా తీస్తారు. ("చరణాది శిరః పర్యంతం అలంకారం కుర్యాత్॥").

జియ్యర్‌స్వామి బృందం సేవాకాలం పూర్తిచేసిన తర్వాత, జియ్యర్ స్వామి పిడికెడు తులసీ అర్చకుల చేతి కిచ్చి, శ్రీవారి పాదములకు సమర్పిస్తారు. తదుపరి తిరుమలనంబి వంశీయులు మంత్ర పుష్ప కైంకర్యంలో భాగంగా 3 పిడికిళ్ళు తులసిని సమర్పించి ఈ క్రింది మంత్రాలనుచ్చరిస్తారు.

**మంత్రపుష్పం:**

1. నాలుగు వేదములలోని ప్రారంభమంత్రములు.
2. నారాయణోపనిషత్తులోని అష్టాక్షరమంత్రము
3. శ్రీ రామావతార ప్రశంసాశ్లోకము.
4. శ్రీ కృష్ణావతారప్రశంస (మహాభారతయుద్ధ విషయం)
5. శ్రీ కృష్ణుడు తానెవరైనది తండ్రితో తన్నెఱిగించుకున్న వృత్తాంతశ్లోకం
6. వైకుంఠంలోని శ్రీమన్నారాయణుని దివ్యస్వరూపం తెలిపే శ్లోకం
7. శ్రీ మహావిష్ణువునుండియే సకల సృష్టి స్వరూపము వెలువడిన వృత్తాంతము.
8. శ్రీ వేంకటాద్రిపై శ్రీవారి యవతారశ్లోకం
9. శ్రీ నమ్మాళ్వారుల శ్లోకం
10. శ్రీ ఆళవందారు, శ్రీరామానుజుల గ్రంథములనుండి ఒక్కొక్క శ్లోకం.

**హారతి-విశేషాలు**

మంత్రపుష్ప కైంకర్యం పూర్తికాగానే, జియ్యర్‌స్వామి. మైసూరు సంస్థానంవారి 'నక్షత్ర హారతి' అనే 27 వత్తుల నేతి దీపాన్ని వెలిగిస్తారు. మంగళాశాసన శ్లోకముల మధ్య అర్చకస్వామి శ్రీవారి మూలవిరాట్టుకు, మరియు ఇతర దేవతామూర్తులకు, మూడుమార్లు హారతిని త్రిప్పుతారు. తదుపరి వెండి అళహారతిలో పచ్చకర్పూరం వెలిగించి, కర్పూర నీరాజనమును. శ్రీవారికి సమర్పిస్తారు. ఈ హారతిని ఏ విధంగా తిప్పాలో వైఖానస ఆగమంలో చెప్పబడింది. మూర్ధాది పాద పర్యంతం, లలాటాది పాదపర్యన్తమ్, నేత్రాది పాద పర్యంతం మూడుసార్లు, స్వామివారికి హారతి త్రిప్పాలి. అనగా శిరస్సు నుండి పాదముల వరకు (అర్చకస్వామి, శ్రీవారికి కుడి చేతి వైపు (దక్షిణం) నిలబడి, స్వామివారి ఎడమపాదం నుండి హారతి చేయటం ప్రారంభించాలి),



నుదురు నుండి పాదముల వరకు, కండ్ల నుండి పాదముల వరకు మూడుసార్లు హారతి చేయాలి. 8" అంగుళాల జ్వాల ఉత్తమంగానూ, 4" అంగుళములు మధ్యమంగానూ, 2" అంగుళముల జ్వాల అధమంగా చెప్పబడింది. ఈ హారతి మూడుసార్లు త్రిప్పటం వల్ల ఫలితం ఈ విధంగా చెప్పబడింది.

**సర్వలోకహితాయైక మన్యాద్గ్రామ సమృద్ధయే**
**రాజస్థానసమృద్ధ్యర్థం త్రిధా భ్రమణ మాచరేత్**
**తద్దీపదర్శనాన్నృణా మాయుశ్శ్రీ పుత్ర వృద్ధయః ॥**
**(శ్రీ విష్ణ్వర్చన సార సంగ్రహం)**

సర్వలోకముల శుభాన్ని కాంక్షించి మొదటిసారి, శ్రీవారు కొలువైవున్న ఊరు సుభిక్షంగా వుండాలని రెండవసారి, రాజు స్థిరంగా రాజ్యాన్ని పాలించాలని కాంక్షిస్తూ మూడవసారి హారతీయవలెను. అటువంటి హారతిని దర్శించిన వారికి దీర్ఘాయుష్షు, ధనలాభం, పుత్రవృద్ధి తప్పక కలుగుతాయి.

శ్రీవారికి కర్పూర హారతిని సమర్పించిన తర్వాత అర్చకస్వామి. 'ఆలవట్టం' అనే సన్నిధి విసనకర్రను, శ్రీవారు సేదతీరడానికి విసురుతారు. తదుపరి స్వామి వారి పాదసేవ చేసికొని, క్షమాప్రార్థనమంత్రం పఠించి, తెలిసీ, తెలియక జరిగిన తప్పులను మన్నించి, తనచేత చేయబడిన పూజ స్వీకరించి, లోక క్షేమాన్ని కటాక్షించాలని శ్రీవారిని ప్రార్థిస్తారు.

తోమాలసేవ అయిన తర్వాత, సేవలో పాల్గొన్న గృహస్థులను స్వామివారి దర్శనానికి అనుమతించి, వారికి శఠారి సాయిస్తారు. అనంతరం శ్రీవారి ఆలయంలోని 'నక్షత్రదిట్టం' ప్రకారం ఆ రోజున శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణమైనచో, శ్రీదేవి-భూదేవి సమేత శ్రీఉగ్ర శ్రీనివాసమూర్తివారికి, శయనమంటపంలో ఏకాంత తిరుమంజనం, వస్త్ర సమర్పణ, వడపప్పు, పానకం నివేదన, కర్పూరహారతి సమర్పణ జరుగుతుంది. ఇదే రీతిగా పునర్వసు నక్షత్రం రోజున శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరాములవారికి, రోహిణి నక్షత్రమైనచో శ్రీరుక్మిణీ సమేత కృష్ణస్వామివారికి తిరుమంజనాది కైంకర్యములు జరుపబడుతాయి.

**కొలువు**

అనంతరం శ్రీవారికి యాత్రాసనంలో భాగంగా 'కొలువు' సేవ జరుగుతుంది. ఈ కొలువు, స్నపనమంటపంలో, బంగారుఛత్రంతో కూడిన బంగారుసింహాసనంమీద ఆసీనులైన, శ్రీ కొలువు శ్రీనివాసమూర్తివారికి జరుగుతుంది. ప్రతినిత్యం శ్రీవారి బలిబేరం కొలువుతీరే ఈ దర్బారు సూర్యోదయాత్పూర్వం స్నపనమంటపంలో జరుగుతుంది. తిరుమల దివ్యదేశాచారానుసారం, యాత్రాదానాదికములు బయట ముఖమంటపంలో కాని, స్నపన మంటపంలోకాని జరుపబడుతాయి. శ్రీ వైష్ణవ పరిచారకులు, సింహాసనమును స్నపనమంటపంలో వేంచేపు చేస్తారు. మంటపారాధనకు కావలసిన పాత్రలు ఉదకపూరితంగా, ధూప దీపములతో సభ అరవారు సన్నిధి నుండి తెచ్చి, శ్రీవారి యెదుట పీట యందుంచుతారు. మైసూరు మఠంవారి గుమస్తా శ్రీవారికి చామర కైంకర్యం చేస్తారు. అర్చకస్వామి కూర్మాసనం మీద ఆసీనుడై 'యాత్రాసస' ఉపచార సమర్పణకు సంకల్పం చేసికొంటారు. భగవదారాధన మరియు జపాదికములు ఆచరింపవలెనని శ్రీ వైఖానస సంహితలు పేర్కొంటున్నాయి.

**యాత్రాసనం**

యాత్రాసనంలో మొత్తం ఐదు ఉపచారములున్నాయి.

**స్తుతిర్ధ్వజశ్చ ఛత్రం చ చామరం వాహనం తథా**
**పంచోపచారా దేవస్య యాత్రాసనపరిగ్రహే ॥**
**(శ్రీ విష్ణ్వర్చన సారసంగ్రహం)**

స్తుతి (భగవంతుని స్తోత్రము చేయుట), ధ్వజం, ఛత్రం (గొడుగు), చామరం (విసనకర్ర), వాహనం అని ఐదు ఉపచారములు.

అర్చకస్వామి శ్రీవారికి ఆసనం సమర్పించి, తర్వాత మంటపారాధనలో భాగంగా పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం వంటి ఉపచారములు సమర్పించి, అనంతరం ఘంటానాద సహితంగా శ్రీ కొలువు శ్రీనివాసమూర్తి వారికి ధూపం,



దీపం సమర్పిస్తారు. ఈ సమయంలో దేవస్థానం వేదపారాయణదారు. శ్రీవారి స్తోత్రములను పఠిస్తారు. చతుర్వేదములలోని మొదటి శ్లోకములు, నారాయణ ఉపనిషత్, శ్రీ శ్రీనివాస అవతార ప్రశస్తి శ్లోకములు, శ్రీరామావతార ప్రశస్తి, శ్రీ గోవిందరాజస్వామివారి ప్రశస్తి, శ్రీ వరాహస్వామివారి ప్రశస్తి, శ్రీ పద్మావతీ అమ్మవారి ప్రశస్తికి సబంధించిన శ్లోకపఠనం జరుగుతుంది.

అనంతరం అర్చకస్వామి 'మాత్రాదానమ్' అనే వైదికక్రియను నిర్వహిస్తారు. శ్రీవారి సమక్షంలో, ఆలయ యాజమాన్యం ద్వారా, శాస్త్రంలో నిర్దేశించిన పరిమాణంలో బియ్యమును, ఆ రోజు కైంకర్యం చేసే అర్చకస్వామికి దానమివ్వడం జరుగుతుంది.

మాత్రాదానమితి ప్రోక్తం దేవ ప్రీతికరం భవేత్ – ఇత్యర్చనా నవనీతే. మాత్రాదానం చేయటం వలన స్వామివారు ప్రీతిచెంది భక్తులను అనుగ్రహిస్తాడని 'అర్చనా నవనీతం' పేర్కొంటుంది. మాత్రాదానం చేయడానికి ముందు ధూప, దీప సమర్పణ అయిన తర్వాత, శ్రీ కొలువు శ్రీనివాసమూర్తి వారికి నువ్వులు, బెల్లం కలిపిన మిశ్రమాన్ని నివేదన చేస్తారు. నివేదనం కాగానే ఇరవై శేర్ల బియ్యం (సుమారు 16కే.జిలు) శ్రీవారి హస్తస్పర్శనం చేసి దత్తం చేస్తారు. శ్రీవారు చతుర్దశ భువనాలకు చక్రవర్తిగా, తన సమక్షంలో జరుపబడే ఈ దర్బారు (కొలువు)లో వేదవేత్తలైన శ్రీ వైఖానస అర్చకులకు బియ్యం దానమిచ్చి, వారి వద్ద 'నిత్యైశ్వర్యో భవ' అని దీవెనలందుకుంటారు. ('అర్చకో దేవస్యత్వేతి ప్రతిగృహ్య మంత్ర పుష్పమక్షతం దేవస్య మూర్ధ్ని పాదయోశ్చ ప్రక్షిప్య నిత్యైశ్వర్యో భవేత్యాశాస్తే–భగవదర్చాప్రకరణమ్'). పంచాంగశ్రవణంలో భాగంగా 'తిథిర్వారశ్చ నక్షత్రం యోగః కరణమేవ చ, కాలో విష్ణుమయః పక్షమాసర్త్వబ్దాయనాభిధః' అనే ఆగమశాస్త్ర ప్రమాణాన్ననుసరించి దేశకాల వర్తమానాదులను కీర్తించి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు, స్వామివారి ముందు పఠించి, తదుపరి తిరుమల దేవస్థానం వారి ముఖ్యమైన దేవాలయలలో జరిగే ఉత్సవ వివరాలు క్లుప్తంగా పఠిస్తారు. ఏకాంగిస్వామి, పోయ్‌గై ఆళ్వారు సాయించిన 'మొదల్ తిరువందాది'లోని పాశురాన్ని గానం చేస్తారు. తదుపరి

జియ్యంగారి గుమస్తా ముందురోజు హుండి వసూళ్ళు, ఆర్జిత ఆదాయాలను. స్వామివారికి విన్నవిస్తారు. "శ్రీవారి ఆలయఆదాయ జమాచిట్టా - ఉదయం కొప్పెర కానుక, మధ్యాహ్నం కొప్పెర కానుక, చిల్లర కొప్పెర కానుక, ఆర్జితం ఆదాయం, వగపడి ఆదాయం అయిన మొత్తం ..... శ్రీవారి ఖజానాలో జమ చేయడమైనది. చిత్తగించవలెను" అని ఆదాయ వివరాలను వివరంగా శ్రీవారి సమక్షంలో పేర్కొంటారు. ఒక రోజు హుండీ ఆదాయం మొత్తం రెండు విడతలుగా (ఉదయం, మధ్యాహ్నం) లెక్కిస్తారు. 'కొప్పెర' అనగా ఆలయపరిభాషలో 'హుండీ'. చిల్లర కానుకలు విడిగా లెక్కిస్తారు. ఆర్జితం ఆదాయం. వివిధ సేవలకు గృహస్థులు చెల్లించే రుసుము నుండి లెక్కించబడుతుంది. ఇక వగపడి ఆదాయం లడ్డు, వడ, అప్పం, దోశె మొదలైన పణ్యారాల అమ్మకం ద్వారా లభించిన ఆదాయం. కొలువు సేవలో చివరిగా మంగళాశాసన శ్లోకముల మధ్య శ్రీ కొలువు శ్రీనివాసమూర్తి వారికి 'నవనీత-కర్పూర హారతి' సమర్పణ జరిగి, నువ్వుల ప్రసాదం స్థాన బహుమాన పూర్వకంగా వినియోగిస్తారు. శ్రీవారిని తిరిగి సన్నిధిలో యథాస్థానమునకు వేంచేపు చేస్తారు.

ఈ కొలువులో భాగంగా నిర్వహించే మాత్రాదానం గురించి శ్రీ వైఖానస భృగుసంహితలో పేర్కొనబడింది.

**పూజాంతే తులసీతీర్థం మాత్రాదానం చ మధ్యమమ్**
**అర్చకాయ ప్రదాతవ్యమన్యథా నిష్ఫలం భవేత్ ॥**

ప్రతిరోజు జరిపే నిత్యార్చన లో భాగంగా, మధ్యలో ఈ మాత్రాదానం ఆగమోక్తంగా విధిగా ఆచరించాలి. లేనిచో పూజమొత్తం వ్యర్థమగునని అర్థం.

## సహస్రనామార్చన

తిరుమల శ్రీవారి ఆలయసంప్రదాయం ప్రకారం, కొలువు కాగానే సన్నిధిలో శ్రీవారి మూలవిరాట్టుకి సహస్రనామార్చన జరుపుతారు. ఆరాధనకు ఉపయోగించే రెండు బంగారు పాత్రలలో తులసీదళములను, సన్నిధి ఏకాంగి




సిద్ధం చేసి, శ్రీవారి వంటశాల (పోటు) నుండి ధూప పాత్రలో అగ్ని పరిగ్రహణ చేసి సన్నిధికి తీసుకు వస్తారు. అర్చకస్వామి, శ్రీవారికి అభిముఖంగా కూర్మాసనం మీద కూర్చుని, ఘంటానాదం చేసి సహస్రనామార్చన కై సంకల్పం చేస్తారు. "---- శ్రీ శ్రీనివాసస్వామినః ప్రీత్యర్థం, లోకక్షేమార్థం, ప్రాతః కాలార్చనాంగభూతేన, అష్టోత్తర సహస్ర నామ తులసీదళ పూజాని, శ్రీ శ్రీనివాస స్వామి దివ్య చరణారవిందయోః అధ్యకరిష్యే" అని సంకల్పించి శ్రీవారి పాదముల మీద తులసీ నుంచి "హరిః ఓం శ్రీమతే కేశవాయ నమః" అని కేశవాది చతుర్వింశతి (24) నామ పఠనం, అర్చకస్వామి ప్రారంభించగానే, కులశేఖరపడి వెలుపల ఉన్న వేద పారాయణదారు, శ్రీవారి సహస్ర నామావళిని పఠించడం ప్రారంభిస్తారు.

ఈ సహస్రనామ అర్చనలో భాగంగా శ్రీవారికి మొదట కేశవాది 24 నామములతో అర్చన జరుగుతుంది. తదుపరి శ్రీ వేంకటేశ్వర సహస్ర నామావళి లోని 1008 నామములతో అర్చన చేస్తారు. కేశావాది నామపఠనం పూర్తి కాగానే ఏకాంగిస్వామి పరదా వేస్తారు. అర్చకస్వామి ఘంటానాదం చేస్తూ శ్రీవారికి సువాసనలు వెదజల్లే ధూపాన్ని సమర్పిస్తారు. మొదట ధ్రువ పీఠమునకు [శ్రీ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్ పాదముల క్రింద ఉన్న పీఠమునకు], ధ్రువ బేరమునకు, తర్వాత కౌతుక పీఠమునకు (శ్రీ భోగశ్రీనివాసమూర్తి పాదముల క్రింద పీఠమునకు), కౌతుక బేరమునకు, క్రమంగా ఉత్సవ బేరమునకు, స్నపన, బలి బేరములకు ఇదే రీతిగా ధూపాన్ని సమర్పిస్తారు. ఇక్కడ ధ్రువ పీఠమునకు, కౌతుక పీఠమునకు శ్రీవైఖానసాగమంలో విశేషప్రాముఖ్యత ఇవ్వబడింది.

## పుష్పన్యాసం-దేవతలు

ధ్రువ బేరం (మూలవిరాట్) పాదముల క్రింద మూడు ఆవరణములలో పీఠాశ్రిత దేవతలుంటారు. దీర్ఘ చతురస్రాకారంగా, ప్రథమావరణము, ద్వితీయావరణము, తృతీయావరణము అని మొత్తం మూడు ఆవరణములు. ఒక్కొక్క ఆవరణములలో 4 దిక్కులలోనూ, 4 మూలలలోనూ ఎనిమిది మంది దేవతలుంటారని చెప్పబడింది. ఈ క్రింది పటం చూడండి.




ప్రధమావరణలో పాదపీఠం మధ్యలో శ్రీ–విష్ణు–హరిణీ (లక్ష్మీ–వేంకటేశ్వర–పద్మావతీ మూలవిరాట్), తూర్పున శ్రీ–పురుష–హరిణీ, ఆగ్నేయంలో కపిల, దక్షిణంలో ధృతి–సత్య–పౌష్ణీ (ఉత్సవ బేరం), నైఋతి మూలలో యజ్ఞ, పశ్చిమంలో పవిత్రీ–అచ్యుత–క్షోణీ (ఉగ్ర శ్రీనివాసుడు), వాయవ్యంలో నారాయణ, ఉత్తరంలో ప్రమోదాయినీ–అనిరుద్ధ–మహీ, ఈశాన్యంలో పుణ్య అనే విష్ణ్వాది నవమూర్తులుంటారు. వీరంతా బహిర్ముఖులుగా ఉంటారు. అదే క్రమంలో ద్వితీయావరణంలో నలుదిక్కులలోనూ వారాహ, నారసింహ, వామన, త్రివిక్రమ మూర్తులు మరియు నలుమూలలోనూ సుభద్ర, ఈశితాత్మ, సర్వోద్వహాయ, సర్వవిద్యేశ్వరాయ మూర్తులు బహిర్ముఖంగా ఉంటారు. ఇక మూడవ ఆవరణలో దేవేశాభిముఖంగా (దేవుని వైపు చూస్తూ) ఇంద్ర, అగ్ని, యమ, నిఋతి, వరుణ, వాయు, కుబేర, ఈశానాదులు అష్టదిక్కులయందు కొలువై వుంటారు.

ఈ వైదిక క్రియకే 'పుష్పన్యాసం' అని పేరు. పై చెప్పబడిన విధంగా, ఇదే క్రమంలో కౌతుక పీఠము నందు, మొత్తం మూడు ఆవరణముల యందు 24 దేవతలుంటారు. ఈ దేవతలను ప్రత్యేకంగా ఆరాధన చేసేందుకై, ధ్రువ పీఠము క్రింద మరియు కౌతుక పీఠము క్రింద, మూడు మెట్లవలె ఆకృతితో ఆవరణములుంటాయి. ఈ రోజుటికీ శ్రీ భోగ శ్రీనివాసమూర్తి (కౌతుక బేరం) వారి పీఠము (విగ్రహంతో కాక విడిగా వుంటుంది) మూడు మెట్లతో (ఆవరణములతో) మనం దర్శించవచ్చు. ఇటువంటి ఆకృతితో మూలవిరాట్ పాదముల క్రింద కూడా పీఠముందని పెద్దలు చెబుతారు. ఒకానొక కాలంలో పీఠార్చన కొరకు ఉద్దేశింపబడినదే ఈ ఆకృతి. ప్రస్తుతం మూలవిరాట్ పాదముల వద్ద మరియు కౌతుకబేరం పీఠమునందు ధ్రువపీఠ పుష్పన్యాసం, కౌతుక పీఠ పుష్పన్యాసం క్రమంగా జరుపబడుతుంది. ఆ యా దేవతలపేర్లు ప్రణవ పూర్వకంగా పలుకుతూ, వారి స్థానములలో పుష్పాన్ని సమర్పించడమే ఈ పుష్పన్యాసం. అందరూ దేవతల పేర్లు ఉచ్చరిస్తూ స్వామిపాదముల వద్ద కూడా పుష్పాలను సమర్పించవచ్చు. ధ్రువపీఠం, కౌతుక పీఠాన్నాశ్రయించి ఉన్న అన్ని దేవతామూర్తులకు ధూప సమర్పణ చేసి, పరదా తీసినతర్వాత ఇదే క్రమంలో దీప ఉపచారం ఘంటానాద సహితంగా స్వామివారికి సమర్పిస్తారు. తర్వాత అర్చకస్వామి శ్రీ బ్రహ్మాండ పురాణములోని (వసిష్ఠ–నారద సంవాదరూపం) శ్రీ వేంకటేశ్వర సహస్రనామావళిని, 'ఓం శ్రీ వేంకటేశాయ నమః' అని ప్రారంభింపగా, కులశేఖరపడి వెలుపల ఉన్న వేదపారాయణదారు క్రమంగా 1008 నామావళిని పఠిస్తుండగా, అర్చకస్వామి సన్నిధిలో శ్రీవారి పాదములకు తులసీదళాలను అర్పిస్తారు.



"కేశవాది నామభిః పురాణేతి హాస ప్రసిద్ధై స్సహస్రనామభిరష్టోత్తర శతనామభిః పూజనం చ నిత్యార్చనమ్" – భగవదర్చాప్రకరణమ్

అష్టోత్తరశతనామభిః సహస్రనామభిః కేశవాదిచతుర్వింశతినామభిః
మూర్తిమంత్రైర్వా తుళసీదళసమ్మిశ్రైః పుణ్యపుష్పైరభ్యర్చయేత్ – ఇతి భృగుః.

శ్రీవారికి అర్చన పూర్తి కాగానే, ఆలయ సంప్రదాయానుసారం, శ్రీవారి పాదసమర్పణ తులసీదళములతో, వక్షఃస్థలంలో కొలువైవున్న మహాలక్ష్మీ అమ్మవారు, పద్మావతీ అమ్మవార్ల బంగారుప్రతిమలకు లక్ష్మీ చతుర్వింశతి నామావళి (24 నామములు)తో ప్రత్యేకంగా అర్చన చేస్తారు. అత్యంత మహిమాన్వితమైన 24 నామములు వరాహపురాణం నుండి పఠించబడుతాయి. అర్చన సమాప్తి కాగానే నక్షత్ర హారతి ఏకాంగి వెలిగించి ఇస్తాడు. అర్చకులు శ్రీవారికి మూడుమార్లు హారతి యిస్తారు. తదుపరి కర్పూర హారతివ్వబడుతుంది.

ఆలయంఆచారం మేరకు, అర్చనచేసిన అర్చకుని (పేరు, గోత్రములతో), మరియు ఇతర కైంకర్యపరులకు, అర్చననామావళి చదివిన పండితులు మహాదాశీర్వాదం చెప్పుతారు. హారతి పూర్తిచేసి, అర్చకస్వామి శ్రీవారి కర చరణాదులకు పాదసేవ చేసి, ఆలవట్టం సమర్పించి తర్వాత ఏకాంగి వారికి, అర్చననామావళి చదివిన పండితులకు శఠారిని సాయిస్తారు.

**వరాహస్వామికి నివేదన**

తిరుమల క్షేత్ర సంప్రదాయం మేరకు, శ్రీవారికి అర్చన ప్రారంభమవగానే, శ్రీవారి వంటశాలలో తయారు చేయబడిన ప్రసాదములను పోటువారు శిరస్సు మీదుంచుకుని, ఛత్ర చామర వాద్య పురస్సరంగా శ్రీవారిఆలయానికి ఉత్తరం వైపున ఉన్న శ్రీ ఆదివరాహస్వామివారి ఆలయంలో నివేదనకై తీసుకువెళతారు. తిరుమలలో ప్రథమపూజ, ప్రథమనైవేద్యం, ప్రథమదర్శనం శ్రీ ఆదివరాహస్వామికి సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. క్షేత్ర ప్రాకారం ఐతిహ్యం, శ్రీ వరాహస్వామివారు. శ్రీనివాసునికి 100 అడుగుల స్థలం యిచ్చినట్లు, అందుకు బదులుగా ప్రథమ పూజాదికాలు వరాహస్వామికి చేరునట్లు పురాణ కథనమున్నది.

**భోజ్యాసనం**

అర్చన పూర్తి కాగానే స్నపనమంటపంలో లఘుశుద్ధి జరుగుతుంది. సన్నిధి పరిచారకుడు. 'తళిగే' అని గట్టిగా ఉచ్చరించగానే పోటువారు, శ్రీవారి అన్నప్రసాదముల పోటులో మొదటి ఘంటా నివేదనకు సిద్ధంచేసిన అన్న ప్రసాదముల గంగాళములను. స్నపనమంటపంనందు చేరుస్తారు. అంతకు పూర్వం అర్చకస్వామి స్థలశుద్ధికై బంగారు పంచపాత్రలోని మంత్రోదకంతో ప్రోక్షణ చేస్తారు. (గర్భాలయం మరియు స్నపనమండపంనందు)

**మధుపర్కం హవిస్తత్ర పానీయం చాగ్నిపూజనమ్**
**ముఖవాసం తు పంచైతే భోజ్యాసనపరిగ్రహే, ఇతి.**



మధుపర్కం (తీపి పదార్థం), హవిస్సు (అన్న ప్రసాదములు), పానీయం (మహానైవేద్య సమయంలో స్వామివారికి సమర్పించే నీరు), అగ్నిపూజనం (నిత్యాగ్ని హోమం), ముఖవాసం (తాంబూలం) అని భోజ్యాసనంలో ఐదు ఉపచారములున్నాయి. భోజ్యాసనం అంటే 'మహాహవిర్నివేదన' లేక 'మహానైవేద్యం'. శ్రీవారిఆలయంలో శ్రీవారికి నిత్యం జరిపే 'మహానైవేద్యా' నికి 'ఘంట' అనే పేరు ప్రసిద్ధం. ఎందుకంటే శ్రీవారికి నివేదన జరిగే సమయంలో ఆలయంలోని బంగారువాకిలికి కుడివైపున ఉన్న రెండు పెద్ద ఘంటలను మ్రోగిస్తారు. శ్రీవారి నైవేద్య ఘంటానాదం తిరుమల గిరులు మొత్తం వినిపిస్తూ, భక్తులకు పవిత్రమైన పారవశ్యాన్ని కలుగజేస్తాయి. ఈ పెద్ద ఘంటలు మ్రోగినప్పుడు శ్రీవారికి గర్భాలయంలో నివేదన జరుగుతుందని తెలుసుకోవచ్చు. శ్రీవారికి మహానివేదన జరిగే సమయంలో, శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆంతరంగిక సేవకులైన శ్రీవైఖానసఅర్చకస్వాములు, మాత్రమే సన్నిధిలో ఉంటారు. ఇది ఆలయంలో వైఖానసఆగమం అనుసరించి నడుస్తున్న కట్టుబాటు. నైవేద్యం జరిగే సమయంలో రాములవారి మేడ వద్ద ఉన్న బంగారు తలుపులను మూసి వేస్తారు.

**అర్చ్యాంత మర్చనమ్ ప్రోక్తం హవిరంతం చ పూజనమ్**
**హోమాంతం శాంతికం విద్యాత్**
**బల్యంతం పౌష్టికం భవేత్ఇత్యర్చనాయాం చాతుర్విధ్యం స్మర్యతే ॥**

**(భగవదర్చాప్రకరణం)**

నిత్యార్చన ఉపచారములతో పూర్తి అవుతుంది. మహానైవేద్యంతో పూజ పూర్తి అవుతుంది. హోమంతో పూర్తి అయ్యే పూజ శాంతికమ్ (లోక శాంతి) అని మరియు బలిసమర్పణతో అంతమయ్యే పూజ పౌష్టికమ్ (లోక రక్షార్థం) అని ఆగమ శాస్త్రవచనం.

**శ్రీవారి ప్రసాదాలు-విశేషాలు**

శ్రీవారికి నివేదన చేసే ప్రసాదాలను ఎక్కడ సిద్ధం చేయాలో శాస్త్రంలో తెలుపబడివుంది. గర్భాలయ ప్రాకారంలో ఆగ్నేయమూలలోని వంటశాలలోగాని,

అర్చకుని గృహంనందుకాని సిద్ధం చేసిన హవిస్సుని స్వామివారికి నివేదించాలి. శ్రీవారికి నివేదించే ప్రసాదముల గురించి, మొట్టమొదటి శాసనస్థ ప్రమాణం క్రీ.శ.614 వ, సంవత్సరమునకు సంబంధించినది. ఇది విమాన ప్రాకారంలోని ఉత్తరంవైపు గోడమీద చెక్కబడి ఉంది. ఇది శ్రీవారిఆలయచరిత్రకు సంబంధించి మనకు లభ్యమైన మొదటి శాసనం. ఈ శాసనంలో తెలిపిన విధంగా అప్పట్లో (6వ శతాబ్దకాలంలో) 4 నాలీలు ('1' పిడి అనగా మన చేతి పిడికిలి లో పట్టేబియ్యం, 1 నాలి = 16 పిడికిళ్ళు = సమారు 1 కే.జి పైన) బియ్యం వండి, శుద్ధానం (అన్నం) మాత్రం శ్రీవారికి నిత్యం నివేదన జరిపేవారు. ఈ 4 నాలీల వండిన అన్నం, కులశేఖరపడి లోపల శ్రీవారికి అభిముఖంగా ఉంచే నివేదన చేసేవారు. ప్రస్తుతం ఎన్నో రకాల ప్రసాదములు నివేదింపబడుచున్నప్పటికీ, సన్నిధి లోపల శ్రీవారికి అభిముఖంగా 4 నాలీల అన్న ప్రసాదాన్నే, ఆలయ ఆచారం మేరకు యిప్పటికీ నివేదన చేస్తున్నారు. ఈ కైంకర్యం నిర్విఘ్నంగా జరుపడానికీ, ఒక దాత 'పైడిపల్లి' అనే గ్రామాన్ని క్రీ.శ.1234లో శ్రీవారి అర్చకులకు దానమిచ్చి (తిరుచానూరు సమీపంలోని గ్రామం – 'పైడిపల్లి'), ఆ భూమి నుండి వచ్చే ఆదాయంతో, వారి గృహంలోనే (ఆగమశాస్త్ర ప్రమాణం మేరకు) ప్రసాదాన్ని వండి, శ్రీవారి ఆలయంలో నివేదనకు వినియోగించేవారు.

స్వామి వారికి నివేదించే అన్నప్రసాదములు, షడ్విధములుగా (6 రకాలు) అర్చనానవనీతం పేర్కొన్నది. పాయసం, కృసరాన్నం (తృణ ధాన్యములు, నువ్వులు కలిపి వండిన అన్నం), గౌల్యం (బెల్లంతో కలిపి వండిన అన్నం–చక్కెరపొంగలి), ముద్గాన్నం (కట్టె పొంగలి), యవాన్నం (రవ్వతో వండిన ప్రసాదం) మరియు శుద్ధాన్నం వంటి 6 రకముల అన్న ప్రసాదములు చక్కగా, శుచిగా, రుచిగా సిద్ధం చేసి స్వామివారికి నివేదన చేయాలి. ఇంకా వివిధ రకాల అపూపములు (నేతిలో వేయించి చేసిన పణ్యారములు–లడ్డు,వడ,దోశె,జిలేబి, అప్పం, సుఖియం మొ॥వి) ఆయా సమయాలలో నివేదన చేయాలి. ఈ నివేదనకు ఉపయోగించే పాత్రలు, నివేదన సిద్ధం చేయటానికి వాడే పాత్రలు, లోహముతో కానీ (బంగారు,



వెండి, రాగి, ఇత్తడి) లేదా మట్టితో కానీ తయారుచేసిన పాత్రలను వాడాలని వైఖానసాగమం పేర్కొంటుంది. పూర్వం శ్రీవారి ఆలయంలో నైవేద్యాలను సిద్ధం చేయటానికి మట్టి కుండలనే ఎక్కువగా వాడేవారు. అప్పట్లో నివేదన చేసిన తర్వాత ప్రసాదాన్ని 'ఓడుప్రసాదం'గా అందరికీ వినియోగం చేసేవారు. ప్రస్తుతం వెండి, రాగి, ఇత్తడితో తయారుచేసిన గంగాళాలలో శ్రీవారికి ప్రసాదాలు తయారుచేస్తున్నారు.

ఈ ప్రసాదములు తయారు చేయునప్పుడు విడువదగినవి.

ఒకే పాత్రలో ద్రోణం కన్నా ఎక్కువ అన్నం వండరాదు.

మట్టికుండలు నైవేద్యానికి ఉపయోగిస్తే, ఒక మాసం పైబడిన వాటిని వాడకూడదు.

స్వామివారికి సిద్ధంచేసిన ప్రసాదాలను వాసన చూడకూడదు.,

పక్వం కాని ప్రసాదం వర్జనీయం.

వెంట్రుకలు, కీటకాలు పడిన ప్రసాదం నివేదించరాదు.

ప్రసాదములు శ్రీవారికి నివేదించువరకు అన్యుల దృష్టి పడరాదు. చెమట ప్రసాదంలో చిందకూడదు. చల్లబడినది, ఒక పాత్రలో మిగిలిన అన్నాన్ని నివేదించకూడదు. (మరీచి విమానార్చనాకల్పం)

### మహానైవేద్యం–మొదటిఘంట

అన్న ప్రసాదాలను పాత్రలలోకి సిద్ధం చేసే ముందు, ఆవు నెయ్యిని పాత్రలో పోయాలి. నివేదన చేసేముందు బంగారు పంచపాత్రలోని మంత్రోదకంతో ప్రోక్షించి, అన్న ప్రసాదములన్నింటిలోకి, అష్టాక్షరిని (ఓం నమో నారాయణాయ) ఉచ్చరిస్తూ తులసీ దళాలనుంచాలి. వైఖానస అర్చకులు తప్ప నివేదన సమయంలో అన్యులుండరాదు కనుక, ద్వారములు మూసివేయాలి. నివేదన సమయంలో విధిగా మహాఘంటానాదం చేయాలి. మంగళ వాద్యములను

వాయించాలి. శ్రీవారిఆలయంలో ఆచారంమేరకు మొదటి ఘంటకు కులశేఖరపడి లోపలి, సన్నిధియందు, శ్రీవారికి అభిముఖంగా 2 అడుగుల ఎత్తైన వేదికమీద 'మాత్రాన్నం' (అన్నం, గడ్డ పెరుగు, శొంఠి,ఉప్పు, వెన్న తో తయారు చేయబడిన పెరుగన్నం) ఉంచుతారు. సన్నిధిలో శ్రీవారికి ఎడమవైపు లడ్డు, వడ వంటి పణ్యారములనుంచుతారు. కుడి వైపు ద్వారమువద్ద, బలిప్రసాదం (శుద్ధాన్నం) ఉంచుతారు. కులశేఖర పడి బయట, శ్రీవారికి కుడివైపున దధ్యోజనం (పెరుగన్నం), శుద్ధాన్నం (అన్నం), తింత్రిణీఫలరసాన్నం (పులిహోర), కదంబం, సంకీర్ణం (పులుసు అన్నం), ముద్గాన్నం (కట్టె పొంగలి) ఉంచుతారు. శ్రీవారికి ఎడమవైపున గుడాన్నం (చక్కెర పొంగళి), ధధ్యన్నం (పెరుగన్నం-4 గంగాళములు) ఉంచుతారు. ఇది ప్రతిరోజు మొదటిఘంటా నివేదనకు ప్రసాదాలు ఉంచే క్రమం.

అర్చక స్వామి, అర్చనతో ప్రసన్నుడైన శ్రీవారిని మనస్సులో స్మరించుకుని, భోజ్యాసనానికి సంకల్పం చేస్తారు. అష్టాక్షరి తో ప్రసాదాలలో తిరువడి తులసి నుంచి, ప్రణవంతో ప్రసాదాలను పరిషేచించి, శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రంలో చెప్పబడిన 'అన్నసూక్తం' అనే వేదమంత్ర పఠనంతో శ్రీవారికి ప్రసాదాలను నివేదన, భక్తిపూర్వకంగా సమర్పిస్తారు. మొదటగా శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలవిరాట్ తర్వాత వక్షఃస్థల తాయార్లు మహాలక్ష్మీ, పద్మావతీ అమ్మవార్లకు, శ్రీభోగశ్రీనివాసమూర్తివారికి, శ్రీదేవీ-భూదేవీ సమేత శ్రీ మలయప్పస్వామివారికి, శ్రీదేవీ-భూదేవీ సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి వారికి, శ్రీకొలువు శ్రీనివాసమూర్తివారికి ఒక్కొక్క నైవేద్యాన్ని వివరంగా పలికి, చూపిస్తూ నివేదన చేస్తారు. అనంతరం సన్నిధిలో వేంచేసియున్న సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామికి, శ్రీరుక్మిణీ సమేత కృష్ణస్వామివారికీ, సాలగ్రామ, శఠారీలకు, శ్రీసుదర్శనచక్రమునకు, విమానవేంకటేశ్వరస్వామివారికి యథాక్రమం నివేదన జరుగుతుంది. ప్రతి దేవతకు నివేదన అయినతర్వాత బంగారు ఉద్ధరిణెతో మూడుమార్లు పానీయం సమర్పించి, తదుపరి బంగారు



శంఖోదకంతో పరిమళతీర్థం శ్రీవారికి, ఇతర దేవతామూర్తులకు క్రమంగా సమర్పిస్తారు.

## నైవేద్య ఫలం

ఈ విధంగా వైఖానసాగమంలో చెప్పబడినట్లు, భక్తి శ్రద్ధలతో స్వామివారికి నివేదన సమర్పించడం వలన వేయిసంవత్సరాలు విష్ణులోకప్రాప్తి కలుగుతుంది. (తావద్వర్ష సహస్రాణి విష్ణులోకే మహీయతే-అర్చనానవనీతే). నివేదన పూర్తి కాగానే అర్చకస్వామి, శ్రీవారికి కర్పూరహారతి సమర్పిస్తారు. అనంతర శ్రీవారికి ఆలవట్ట కైంకర్యం చేసి, శ్రీవారికి పాదసేవ చేసి క్షమాప్రార్థన మంత్రం పఠిస్తారు. తెలిసీ, తెలియక జరిగిన సర్వాపచారములను దయతో క్షమించి, నాచే చేయబడిన నిత్యార్చన స్వీకరించి, సమస్తమానవాళికి సుఖశాంతులు, భోగభాగ్యాలు ప్రసాదించాలని శ్రీవారికి విన్నవించడమే 'క్షమాప్రార్థన' (అపచారా న్నిమాన్ సర్వాన్ క్షమస్వ పురుషోత్తమ). తదుపరి శ్రీవారి పాదములయందు తులసిని సమర్పిస్తారు.

శ్రీవారికి నివేదన పూర్తికాగానే రాములవారిమేడవద్ద వేసిన తలుపులను తీస్తారు. పోటువారు నివేదన కాబడిన ప్రసాదాలను భక్తాదుల వినియోగానికై వెండి వాకిలి వెలుపల ఉన్న 'ప్రసాదముల పట్టెడ'కు చేరుస్తారు. అర్చకస్వామి, నిత్యార్చనలో ముఖ్యమైన బలిహరణం కైంకర్యానికి సిద్ధమవుతారు. ఒక వెండి పాత్రలో బలిఅన్నం, తీర్థం, శ్రీవారిపాద తులసి వుంచి. అర్చకస్వామి, బలి వేయటానికి బయలు దేరుతారు. అర్చకునితో కూడా పోటువారు, వెదురుబుట్టలో బలి అన్నం తీసుకుని ఘంటానాదం చేస్తూ అనుసరిస్తాడు.

నివేదన పూర్తికాగానే సన్నిధిలో నివేదించిన మాత్ర ప్రసాదము శ్రీ భాష్యకార్లవారి గుడికి చేరుస్తారు. సన్నిధిలోని పతద్గ్రహ పాత్రలోని ఆరాధన తీర్థం, భాష్యకార్లగుడి గుమస్తా తెచ్చిన రెండు వెండిగిన్నెలలో నింపి, అర్చకస్వామి వారికందజేస్తాడు. ఒక వెండిగిన్నె తీర్థం భాష్యకార్లవారి నివేదనకు, మరొక వెండిగిన్నెతీర్థం దోవ భాష్యకార్లవారి నివేదనకు వినియోగిస్తారు.

**బలిహరణం-విశేషాలు**

'బలిహరణం' అనగా శ్రీవారికి నివేదించిన మహాహవిస్సును (శుద్ధాన్నము) ఆలయంలోని ద్వార దేవతలకు, అన్ని ద్వారముల ద్వారపాలకులకు, అష్టదిక్పాలకులకు, పరివార-ఉప ఆలయ దేవతా మూర్తులకు నివేదన సమర్పించటం అని అర్థం. ఇది యాత్రాసనంలో భాగంగా నిర్వహించబడుతుంది. వైఖానసాగమంలో, బలిహరణ కైంకర్యం నిర్వహించేటపుడు శ్రీవారి బలిబేరం, శ్రీ కొలువు శ్రీనివాస మూర్తివారు బలి ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పరివారదేవతలకు నైవేద్యమును అనుగ్రహిస్తూ యాత్రాసన ఉత్సవం నిర్వహించాలని చెప్పబడింది. ఒక వేళ బలిబేరమును ఉత్సవంగా త్రిప్పటం వీలుకాకపోతే, శ్రీవారి పంచాయుధాలలో ఒక్కటైన శ్రీసుదర్శనచక్రమును ఉత్సవంగా తీసుకువెళ్ళి బలిసమర్పణ చేయాలి. అదికూడా వీలుపడని పక్షంలో, అర్చకస్వామి బలిపాత్రలో నివేదిత అన్నము తీసుకుని ఆలయాశ్రిత దేవతలకు నివేదన గావించాలి. తిరుమల దివ్యదేశము ఆచారం ప్రకారం, బలి బేరమును, ఒక్క కొలువు సేవకు మాత్రమే, ఉత్సవంగా తీసుకు వస్తారు. బ్రహ్మోత్సవసమయంలో మాత్రం బలిహరణ సమర్పణకు శ్రీ సుదర్శనచక్రమును పల్లకీలో వేంచేపుచేసి తిరువీధి ఉత్సవంగా, అష్టదిక్పాలురకు బలిసమర్పణ, అర్చకస్వామిచే సమర్పించబడుతుంది. శ్రీవారి సాన్నిధ్యశక్తి, బలిబేరంనుండి ఒక భాగం అర్చకునిలో కూడా ఆవాహన చేయబడినందువలన, తిరుమల శ్రీవారిఆలయంలో, నిత్యార్చనతర్వాత, నిర్వహించే బలిసమర్పణలో వైఖానస అర్చకస్వామి, షరిషద్దేవతలకు శ్రీవారి తరపున నివేదన అందిస్తారు. ప్రతినిత్యం మొదటిఘంటతర్వాత, రెండవ ఘంట మరియు రాత్రి ఘంటతర్వాత, నిత్యార్చనలో భాగంగా, ఆలయాశ్రిత దేవతలకు బలి సమర్పణ విధిగా జరుగుతుంది. ఈ వైదిక క్రియలో భాగంగా, అర్చకులు పోటువారు తెచ్చిన బలిప్రసాదం తీసుకుని, శ్రీవారికి యాత్రాసనం సమర్పించి, నివేదనం చేసి, మణికాది ద్వారపాలకులకు, విమానపాలకదేవతలకు, లోకపాలకులకు, అనపాయినులకు, ఆలయగత బలిని (అన్నాన్ని) కాంక్షించే సమస్త ఇతర



దేవతలకున్నూ, ప్రణవంతో ఆ యా దేవతామూర్తుల నామోచ్చారణతో 'చతురుపచారములు'-అనగా నాలుగు ఉపచారములైన 'తోయం పుష్పం బలి తోయం సమర్పయామి' అని పై పేర్కొనిన దేవతలందరకూ ఘంటానాద సహితంగా బలి అన్నం సమర్పిస్తారు. (తోయం -తీర్థం, బలి-అన్నం).

గర్భాలయ ద్వారమునందు- మణిక, సంధ్యలకు,

ముఖమంటప ద్వార దక్షిణ-ఉత్తర దిక్కులందు-తాపస, సిద్ధులకు,

అంతరాళమందు - న్యక్షునికి, ఇంద్రునికి,

ప్రథమ ప్రాకార ద్వార దక్షిణ ఉత్తరములందు - కిష్కింధుడు, తీర్థులకు,

సోపాన ధ్వజదండ మధ్యలో - శ్రీభూత, గరుడులకు,

ధ్వజస్తంభ- మహాబలిపీఠం మధ్యలో ఉన్న ఐదు చిన్న బలిపీఠములలో- చక్ర, శంఖ, ధ్వజ, యూథాధిప, అక్షహంత్రులకు,

ఆగ్నేయమూలలో ఉన్న రెండు బలిపీఠములు - హవిరక్షక, అగ్నులకు,

శ్రీ వరదరాజస్వామివారికి, శ్రీ పోటుతాయారువారికి నివేదన, దివ్యదేశ పరివారం అనంత, గరుడ, విష్వక్సేన, ఆంజనేయ, సుగ్రీవ, అంగదులవారికి నివేదన,

దక్షిణదిక్కులో రెండు బలిపీఠములకు - వివస్వత, యములకు,

నైఋతిదిక్కున రెండు బలిపీఠములకు - బలిరక్షక, నిర్ఋతిలకు,

పశ్చిమదిక్కులో - మిత్ర, వరుణులకు,

వాయవ్యదిక్కులో - పుష్పరక్షక, వాయువులకు,

ఉత్తరదిక్కులో - క్షత్తునికి, కుబేరునికి,

శ్రీ విష్వక్సేనులవారికి, శ్రీ యోగనరసింహస్వామివారికి నివేదన,

ఈశాన్యదిక్కులో - భాస్కర, ఈశ్వరులకు,

తర్వాత అర్చక స్వామి వెండివాకిలి దాటి, పడిపోటులోని పోటుతాయార్ల వారికి మరియు యమునోత్తరైలోని శ్రీవేణుగోపాలస్వామి వారికి నివేదన చేసి, ధ్వజస్తంభమునకు ఈశాన్య దిక్కులో ఉన్న 'క్షేత్రపాలకశిల' అనే బలిపీఠమునకు బలి అన్నం సమర్పిస్తారు. తిరుమల క్షేత్రానికి రుద్రుడు క్షేత్రపాలకుడు.

ద్వితీయ ప్రాకార ద్వార దక్షిణ ఉత్తరములందు – నాగరాజ, గణేశులకు, బలి సమర్పించి, ఆలయానికి అభిముఖంగా ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామి వారికి నివేదన సమర్పించి, తిరిగి ఆలయంలోని ధ్వజస్తంభంవద్ద అవిఘ్న, ఆమోద, ప్రమోద, ప్రముఖ, దుర్ముఖులకు, విఘ్నకర్తకు బలి సమర్పించి, బలిపాత్రలో మిగిలిన అన్నం, తీర్థం (శేషమును), మహాబలిపీఠము పైభాగంనందు భూత, యక్ష, పిశాచ, రాక్షస, నాగ గణములకు సమర్పించటంతో బలియాత్ర సమాప్తి అవుతుంది.

**శాత్తుమొఱ**

'శాత్తుమొఱ' అనగా శ్రీవారిని కీర్తించుట, స్తుతించుట అని అర్థం. సన్నిధిలో 'శాత్తుమొఱై' చేయుటకు జియ్యర్ స్వామి, ఏకాంగి, అధ్యాపకులు హాజరై జియ్యర్‌స్వామి తులసిని అర్చకులకు, అందించగా, శ్రీవారి పాదములకు తులసి సమర్పిస్తూ ఉండగా, జియ్యర్‌స్వామి తదితర శ్రీ వైష్ణవ బృందం, 'శిత్తం సిరుకాలే' అనే ద్రావిడప్రబంధగానం చేస్తారు. ఈ శాత్తుమొఱై ప్రతిరోజు నిత్యార్చనలో భాగంగా బలిసమర్పణ, శ్రీ భాష్యకారులవారికి నివేదన జరిగిన వెంటనే నిర్వహిస్తారు. ఈ సేవకు శ్రీవారి దర్శనార్థమై తిరుమల దివ్యదేశమునకు విచ్చేసిన శ్రీ వైష్ణవ స్వాములను జియ్యర్ స్వామివారితో పాటు మహాద్వారం గుండా అనుమతిస్తారు.

'శాత్తుమొఱై' అంటే దివ్య ప్రబంధంలోని కొన్ని పాశురాలను, స్వామివారి మహిమలను కీర్తించునవి మరియు ఆచార్యుల ప్రశంస చేయు పాశురముల సమాహారం. శ్రీ వైష్ణవ క్షేత్రములలో స్వామివారి ఆరాధన పూర్తి అయిన వెంటనే



ఈ శాత్తుమొఱై పాశురాలను పఠిస్తారు. మొదటగా 'శాత్తుమొఱై' అనే పదము శ్రీవారి ఆలయ శాసనములలో క్రీ.శ. 1475 వసం॥లో తిరుపతిలోని ఉడయవరు శాత్తుమొఱ సందర్భంగా వేయించిన శాసనంలో ఉపయోగించబడినది. ఈ శాత్తుమొఱ క్రమము తిరుమల ఆలయంలో నిర్వహించినట్లు 18 వ శతాబ్దం వరకు శాసనములలో ఎక్కడా ప్రస్తావనలేదు. (శ్రీమాన్ T.K.T వీరరాఘవాచార్య వారి 'హిస్టరీ ఆఫ్ తిరుపతి' పుస్తకం నుండి).

శాత్తుమొఱలో గానం చేయబడే పాశురాలలో 'పాత్రం' తో మొదలు కాబడేవి మరియు 'వాళి తిరునామం'తో ముగియబడేవి చదువుతారు. శ్రీవైష్ణవులలో ఉపనయనం సమాశ్రయణం చేసుకున్నవారెవరైనా ఈ సేవలో పాల్గొనవచ్చు. ఈ సేవలో పాల్గొనే శ్రీ వైష్ణవులు విధిగా ద్వాదశ ఊర్ధ్వ పుండ్రములు (12 నామములు) ధరించి, చక్కటి శ్రీవైష్ణవ లక్షణముతో గృహస్థులు 'పంచకచ్ఛం' అనగా పింజె పోసి గోచీగా కట్టుకొనే ధోవతితోను, బ్రహ్మచారులు అడ్డపంచ, ఉత్తరీయం ధరించి హాజరు కావలయును.

'శాత్తుమొఱై', తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతిరోజు పఠించే పాశురాలు.

1. 29 వ పాశురం శ్రీ ఆండాళ్ తిరుప్పావై నుండి – 'శిట్రం శిరుకాలే..'
2. 30 వ పాశురం శ్రీ ఆండాళ్ తిరుప్పావై నుండి – 'వంగక్కడల్ ...'
3. శ్రీ పెరియాళ్వారు సాయించిన 'తిరుప్పల్లాండు' నుండి మొదటి రెండు పాశురములు – 'పల్లాండు పల్లాండు...'
4. శ్రీరామానుజుల వారి ప్రశంస చేయు శ్లోకములు – 'సర్వదేశ....'
5. శ్రీ మణవాళమహాముని తనియన్ – 'నమశ్శ్రీ శైలనాథాయ ...'
6. శ్రీ మణవాళమహాముని యొక్క – 'వాళి తిరునామం...'

శుక్రవారంనాడు పఠించే శాత్తుమొఱ పాశురాలు కొద్దిగా మార్పు కలిగి ఉంటాయి. శుక్రవారంనాడు రెండవ ఘంట తర్వాత శాత్తుమొఱ నిర్వహిస్తారు.

శాత్తుమొఱ అయిన తర్వాత శ్రీవారికి హారతి చేసి, అర్చకస్వామి ఆలవట్ట కైంకర్యం, పాదసేవ చేసికొని క్షమాప్రార్థన చేస్తారు. ఈ శాత్తుమొఱలో పాల్గొన్న గోష్ఠికి శ్రీవైఖానస అర్చకులు క్రింది క్రమంలో తీర్థం, శఠారి, చందనం, మాత్ర ప్రసాద వినియోగం చేస్తారు.

మొదటగా శ్రీ పెద్ద జియ్యంగార్ స్వామికి, క్రమంగా చిన్నజియ్యర్ స్వామి, ఏకాంగి స్వామి, తర్వాత ఆచార్య పురుషులకు వరుస క్రమంలో తోళప్పాచార్య, పురిశై, భావనాచారి, ప్రతివాది భయంకరం, వీరవల్లి, కిడాంబి ధర్మపురి మరియు పరవస్తు వార్లకు ప్రసాద వినియోగం జరుగుతుంది. ఆలయ మర్యాదల మేరకు తీర్థం కులశేఖరపడి వెలుపల, శఠారి, చందనం, మాత్ర ప్రసాదం కులశేఖరపడి లోపల వినియోగం చేస్తారు. తర్వాత జియ్యర్‌స్వామివారు భాష్యకార్లవారి సన్నిధికి వేంచేసి, అక్కడ మరల శాత్తుమొఱ గానం జరిగి గోష్ఠికి తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుంది.

ఆలయంలో బలిహరణం కైంకర్యం జరిపేకాలం గురించి అర్చనసార సంగ్రహంలో చెప్పబడిఉంది.

**ఉత్తమం తు త్రిసంధ్యాయాం మధ్యమం స్యాద్విసంధ్యకమ్**
**అధమం త్వేకసంధ్యాయాం బలికాలవిధిః స్మృత, ఇతి.**

మూడు సంధి కాలములందు (ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంత్రం) బలిహరణ కైంకర్యం చేయడం ఉత్తమపక్షం, రెండుమార్లు మధ్యమం, ఒక్కమారు అధమంగా చెప్పబడింది. తిరుమల ఆలయంలో మూడుసంధులలో ఉత్తమపక్షంగా ఈ కైంకర్యం నిర్వహించబడుతున్నది.

## శ్రీవారిపాదతీర్థ మహిమ

అనంతరం సన్నిధిలో శ్రీవారికి 'సర్కార్ హారతి' జరుపబడుతుంది. సర్కార్ అనగా ఆలయ అధికారులైన ఉద్యోగులు అని అర్థం. ఆ రోజు విధినిర్వహణలోఉన్న ఉన్నతాధికారగణం ఈ హారతిలో శ్రీవారిని దర్శిస్తారు.



వారందరికీ తీర్థం, శఠారి, ప్రసాద వినియోగం జరుగుతుంది. సన్నిధిలో శ్రీవారి దివ్యమంగళ రూప సందర్శనకై భక్తాదులను అనుమతిస్తారు. భక్తులు శ్రీవారిని దర్శించిన తర్వాత వారికి శ్రీవారి ఆంతరంగిక ప్రసాదములైన తీర్థం, శఠారి యివ్వబడుతాయి.

"సాలగ్రామ శిలాహారి పాపహారి విశేషతః, ఆజన్మకృత పాపానాం ప్రాయశ్చిత్తం దినే దినే, అకాలమృత్యుహరణం సర్వవ్యాధి నివారణమ్, సర్వపాపౌఘ శమనం శ్రీ విష్ణుపాదోదకం శుభమ్" అనే మంత్రముతో శ్రీవారి తీర్థాన్ని భక్తులు స్వీకరించాలి. శ్రీవారితీర్థం స్వీకరించటంవలన అనేక దివ్య మహిమాన్వితమైన శుభఫలితాలు కలుగుతాయి. విష్ణుపాదోదకం స్వీకరించటంవల్ల అవిద్య నశిస్తుంది. అజ్ఞానం పోతుంది. జన్మజన్మల కర్మలు నివృత్తి అవుతాయి. జ్ఞానవైరాగ్యాలు సిద్ధిస్తాయి. ఒకచుక్క తీర్థాన్ని గ్రహించడంవల్ల మహాపాతకాలు నశిస్తాయి. విష్ణుపాదోదకం తలమీద ప్రోక్షించుకోవటంవలన భూమ్మీద ఉన్న పుణ్యతీర్థాలన్నింటిలో స్నానం చేసిన ఫలితం కలుగుతుంది. ఇంతటి దివ్యమహిమకల శ్రీవారితీర్థాన్ని తిరుమల ఆలయంలో శ్రీవారిదర్శనం తర్వాత భక్తులందురూ పవిత్రంగా స్వీకరిస్తారు.

## పాదుకాధారణ (శఠారి, శఠగోపం) మహిమ

తీర్థసేవనం తరువాత భక్తులకు శఠారి ఇవ్వబడుతుంది. ఈ శఠారి మీద శ్రీవారి పాదుకలుంటాయి. ఇది తలమీద ధరిస్తే శ్రీవారిదివ్యచరణాలను. మనలను అనుగ్రహించినట్లే అని వైఖానసాగమం పేర్కొంటుంది. ఇటువంటి అద్భుతమైన శ్రీవారి పాదుకలు శిరస్సుమీద ధరించటంవలన వైకుంఠప్రాప్తి కలుగుతుంది. త్రేతాయుగంలో రామావతారంలో స్వామివారి దివ్యచరణ స్పర్శ తగిలి రాయిరూపంలో ఉన్న అహల్యకు శాపవిమోచనమవుతుంది. భక్తులకు కూడా ఈశఠారి స్పర్శ తగిలితే, అన్ని పాపములనుండి విముక్తి కలుగుతుంది. శ్రీపాదస్పర్శ వలన భుక్తి, ముక్తి–రెండూ ప్రాప్తిస్తాయి, సర్వసౌభాగ్యాలు సిద్ధిస్తాయి, అంతేకాక తమ తమ కోరికలు సిద్ధించి, పుత్ర పౌత్రాదులతో వర్ధిల్లుతూ స్వామివారి దివ్యకటాక్షమునకు పాత్రులవుతారు.

**అహల్యాశాపనిర్మోక్తి పాదుకే శేషరూపిణి ।**
**శిరసా ధారయామి త్వాం పాపనాశయ పాదుకే ॥**

అనే మంత్రముతో శఠారిని స్వీకరించాలి. శఠారి యిచ్చేటప్పుడు ఆచార్యులు (అర్చకులు, శ్రీవైఖానసులు, శ్రీ వైష్ణవులు), రాజు మరియు యతీంద్రులు (సన్యాసులు) వంటివారికి అయిదు ఉత్తమఅంగాలైన శిరస్సు, రెండు భుజములు, హృదయం, శిరస్సునకు తాకించి ఇవ్వాలని శాస్త్రవచనం. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ఈ శఠారినే శ్రీ నమ్మాళ్వారుల అంశగా భావిస్తారు. నమ్మాళ్వార్లకు 'శ్రీ శఠకోపముని' అని మరో పేరు.

**శ్రీవారి ప్రసాదభక్షణ ఫలం**

తీర్థం, శఠారి స్వీకరించి భక్తులు విమానప్రాకారంలోని ఉప ఆలయ దేవతా సందర్శన, విమానవేంకటేశ్వరస్వామిదర్శనం, హుండీ ద్వారా మొక్కులు చెల్లించి వెండివాకిలి బయట ఉన్న ప్రసాదముల పట్టెడ వద్దకు వచ్చి శ్రీవారికి నివేదించిన అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

**అగ్నిష్టోమసహస్రైస్తు వాజపేయశతైరపి**
**యత్ఫలం లభతే భక్త్యా విష్ణోర్నైవేద్యభక్షణాత్ ॥**

**(భృగు–నిరుక్తాధికారం)**

శ్రీవారిప్రసాదం తినటం వలన, 1000 సార్లు అగ్నిష్టోమయాగం చేసినఫలితం, 100 సార్లు వాజపేయహోమం చేసినఫలితం భక్తునికి, శ్రీవారిచే అనుగ్రహించబడుతుంది.

**మాధ్యాహ్నిక ఆరాధన**

సర్వదర్శనం కొన్నిగంటలపాటు కొనసాగినతర్వాత శ్రీవారికి మాధ్యాహ్నిక ఆరాధనకొరకు దర్శనం నిలిపివేస్తారు. ఈ మాధ్యాహ్నిక ఆరాధనలో శ్రీవారికి లఘువుగా ఉపచార సమర్పణ చేస్తారు. సన్నిధిలో పరిచారకులు బంగారు ఆరాధన పాత్రలను శుద్ధి చేసి, బంగారుబావి నుండి శ్రీవారి మాధ్యాహ్నిక



ఆరాధనకు తెచ్చిన తీర్థంతో పంచపాత్రలను నింపుతారు. వైఖానసఅర్చక స్వామి మాధ్యాహ్నిక ఆరాధనకై సంకల్పం చేసి, మంత్రాసనం, అలంకారాసనం లఘువుగా, ఏకాంతంగా సమర్పించి, ఆరాధన పూర్తి చేయగానే, ఏకాంగివారు ధూపహారతి తెస్తారు. పరదా వేసి ఘంటానాద సహితం శ్రీవారికి ధూప, దీపాదులు సమర్పించి, అర్చకులు రెండవ (మాధ్యాహ్నిక) అర్చనకై సంకల్పం చేసుకుంటారు. కూర్మాసనంమీద (స్వామివారికి అభిముఖంగా పాదాలవద్ద), ఆసీనుడై అర్చకస్వామి బంగారుపాత్రలోని తులసీ దళములను శ్రీవారి పాదపద్మములకు అర్పిస్తూ బిగ్గరగా 'హరి! ఓం శ్రీమతే కేశవాయనమః' అని అర్చన ప్రారంభిస్తారు. ఆ వెంటనే కులశేఖరపడి వెలుపల నిలబడి ఉన్న వేదపారాయణదారు, అందుకుని కేశవాది చతుర్వింశతి నామావళిని పఠిస్తారు. శ్రీవారి ఆలయఆచారం మేరకు, శ్రీవరాహ పురాణాంతర్గత శ్రీ వేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిని మాధ్యాహ్నిక అర్చనలో పఠిస్తారు. అర్చకులు 'ఓం నమః శ్రీవేంకటేశాయ నమః' అని ప్రారంభించి, ప్రతి నామముకు శ్రీవారి పాదాలవద్ద తులసిని సమర్పిస్తూ అర్చన చేస్తారు. శ్రీవారికి 108 నామములతో రెండవ అర్చన కాగానే, వక్షఃస్థల తాయార్లకు యథావిధిగా, శ్రీవారిపాదాల చెంతనున్న తులసితో, శ్రీవరాహ పురాణాంతర్గత శ్రీలక్ష్మీ చతుర్వింశతి నామావళితో అర్చన చేస్తారు. తదుపరి శ్రీవారికి కర్పూర హారతి సమర్పించి, అర్చకులు ఆలవట్టం సమర్పించి, పాదసేవ చేసి క్షమాప్రార్థన చేస్తారు.

**రెండవ ఘంట– ప్రసాదములు**

అనంతరం అర్చకులు, గర్భాలయంలోను, అంతరాళంలోను స్థల శుద్ధికై, బంగారుపాత్రలోని మంత్రోదకంతో ప్రోక్షించిన తర్వాత, రెండవ ఘంటా నివేదనకు, తళిగలు పిలుస్తారు. శ్రీవారికి రెండవ ఘంట నివేదనలో భాగంగా సన్నిధిలో శ్రీవారికి అభిముఖంగా సంధిగా శుద్ధాన్నం ఉంచుతారు. బలిప్రసాదం గర్భాలయ దక్షిణ ద్వారం వైపు ఉంచి, కులశేఖరపడి వెలుపల దక్షిణం వైపు సీరా (శర్కర మిశ్రిత యవాన్నం), పులిహోర (తింత్రిణీఫలరసాన్నం), కట్టె పొంగళి (ముద్గాన్నం), ఉత్తరం వైపు చక్కెరపొంగలి (గుడాన్నం), దధ్యోదనం

ఉంచుతారు. అర్చకస్వామి మొదటి ఘంట నివేదన చేసిన క్రమంలోనే యథావిధిగా 'అన్నసూక్త' పఠనం తో శ్రీవారి పంచమూర్తులకు, ఇతరదేవతా మూర్తులకు మహానైవేద్యం సమర్పించి, మధ్యలో శ్రీవారికి దాహోపశమనం కై పానీయాన్ని సమర్పిస్తారు. ఈ సమయంలో శ్రీవారి నైవేద్య ఘంటానాదం కొరకు బంగారువాకిలి వద్ద ఉన్న మహాగంటలను మోగిస్తారు. నివేదన పూర్తయిన తర్వాత అర్చకులు శ్రీవారికి కర్పూరహారతి, ఆలవట్టం సమర్పించి, పాదసేవ, క్షమాప్రార్థన చేస్తారు. శ్రీవారి పాదపద్మములకు తులసిని సమర్పించి 'సర్వే జనా స్సుఖినో భవంతు! సమస్త సన్మంగళాని భవంతు!' అని ప్రార్థిస్తారు. రెండవ ఘంట సమయంలో రాములవారి మేడవద్ద మూసివేసిన బంగారు తలుపులు తీయగానే, అర్చకులు యథాక్రమంగా బలిహరణ కైంకర్యం పూర్తి చేస్తారు. శ్రీవారి ఉత్సవ మూర్తులైన శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ మలయప్పస్వామివారు. బంగారువాకిలి వద్ద తిరుచ్చిలో వేంచేపు చేయబడి విమానప్రదక్షిణగా సంపంగి ప్రాకారంలోని కళ్యాణ మంటపానికి వేంచేస్తారు. సన్నిధిలో తిరిగి సర్వదర్శనం ప్రారంభమై సాయంత్రంవరకు కొనసాగుతుంది.

## నిత్యకళ్యాణోత్సవం

సంపంగి ప్రాకారంలోని కళ్యాణమంటపంలో శ్రీమలయప్పస్వామివారు తూర్పుముఖంగా ఒక బంగారు సింహాసనంమీద వేంచేపు చేయబడతారు. వారికి దక్షిణంగా శ్రీదేవి – భూదేవి అమ్మవార్లు మరొక బంగారు సింహాసనం మీద వేంచేపు చేయబడి, ఉత్సవ మూర్తులకు చక్కటి పుష్పమాలలతో అలంకరణ చేసి నిత్యకళ్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేసి వుంచుతారు. కామ్యార్థం శ్రీవారికి కళ్యాణోత్సవం చేయించటానికి మొక్కుకున్న గృహస్థులను కళ్యాణ మంటపానికి అనుమతించి వారి గోత్రనామాదులతో సంకల్పం చెప్పించి, స్వామివారికి అభిముఖంగా కూర్చోబెడతారు. మధ్యాహ్నం 12 గం॥లకు అభిజిల్లగ్నంలో శ్రీవారికి నిత్యకళ్యాణోత్సవం ప్రారంభమవుతుంది.



శ్రీవారిఅర్చకుల ఇంటినుండి కళ్యాణోత్సవ కైంకర్య వైఖానస అర్చకులు పసుపు ధోవతి ధరించి, బృహస్పతిగా వ్యవహరించే మరో అర్చకునితో సహా 'హోచి' సహాయంతో మంటపప్రవేశం చేసి శ్రీవారి పాదసేవ చేసుకుంటారు.

సభాప్రార్థనతో కల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. తదుపరి క్రమంగా విష్వక్సేనఆరాధన, పుణ్యాహవాచనం, సద్యోఅంకురార్పణ, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ వంటి వైదిక క్రియలను నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి మధుపర్క నివేదనం, పాదప్రక్షాళన, కూర్చ ప్రధానం జరిపి, స్వామి– అమ్మవార్ల మధ్య మంత్ర పూర్వకంగా తెరపడతారు. తదుపరి శ్రీవారికి, అమ్మవార్లకు నూతన వస్త్రసమర్పణ జరుగుతుంది. మహాసంకల్పం, శ్రీవారి, అమ్మవార్ల గోత్రపఠనం శ్రావ్యంగా చేస్తారు. తర్వాత మాంగళ్యారాధన జరిపి, శ్రీవారి చేతికి తాకించిన మంగళసూత్రములను అమ్మవార్లకు ధరింపజేసి, కర్పూర నీరాజన సమర్పణ చేస్తారు. అర్చకులు హోమగుండంవద్ద ప్రధానహోమం, లాజ హోమం, పూర్ణాహుతి, రక్షాతిలకధారణ కైంకర్యాలను పూర్తి చేస్తారు. ఆ వెంటనే 'వారణమాయిరం' కైంకర్యం జరిపి, శ్రీవారికి–అమ్మవార్లకు వేడుకగా పుష్పమాలలు మార్చుకునే ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అమ్మవార్లను స్వామివారి వద్దకువేంచేపు చేసి, 'అక్షతారోపణం' అనే (తలంబ్రాలు పోయడం) వైదికక్రియను నిర్వహించి, కర్పూరహారతి ఇస్తారు. పిదప శ్రీవారికి మహానివేదన, కర్పూరహారతి సమర్పణతో నిత్యకళ్యాణోత్సవం అంగరంగవైభవంగా సమాప్తి అవుతుంది.

## కళ్యాణోత్సవఫలం

ఏవం యః కురుతే భక్త్యా తస్య కాయకృతం పాపం తత్ క్షణాదేవ నశ్యతి, దశపూర్వాన్ దశాపరాన్ ఆత్మానం చ ఏకవింశతికం విష్ణోః పరమం పదం నయేత్। స్త్రీణాం సువాసినీ జన్మసాఫల్యతా చ ॥

(శ్రీవైఖానస మరీచి విమానార్చనాకల్పం)

ఎవరైతే స్వామివారిని దేవేరులతో సహా కళ్యాణోత్సవం జరుగుచుండగా సేవిస్తారో వారు చేసిన పాపములు ఆ క్షణమునే తొలగుటయేకాక తన ముందు పదితరములు తన తరువాత పదితరములు వారు కూడా పాపముల నుండి, నరకముల నుండి విముక్తులై విష్ణువు యొక్క పరమపదం చేరుతారు. అంతేగాక స్త్రీలందరూ నిత్యం సువాసినులుగా (మాంగల్యభాగ్యంతో) వర్ధిల్లుతారు.

## డోలోత్సవం (ఊంజల్‌సేవ)

నిత్యకళ్యాణం అయిన తర్వాత శ్రీవారిని బంగారు తిరుచ్చిలో వేంచేపు చేసి, ధ్వజస్తంభమునకు ఎడమవైపున్న 'అద్దాల మండపం' (అయినా మహల్) అనే మండపమునకు తీసుకువెళతారు. అక్కడ శ్రీవారి ఉత్సవమూర్తులను లోపల ఉన్న అద్దాల మండపంలోని ఊయలమీద వేంచేపు చేస్తారు. భక్తులను స్వామివారికి అభిముఖంగా కూర్చుండబెట్టి, వేదపఠనం వేదాశీర్వాదం జరుపుతారు. తదుపరి శ్రీవారికి (పంచకజ్జాయం) నివేదన, హారతి జరుగుతుంది.

## డోలోత్సవఫలం

**డోలాయమానం గోవిందం మంచస్థం శయనం హరిః ।**
**రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే ॥**

ఊయలయందున్న శ్రీదేవి-భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించిన వారికి పునర్జన్మ ఉండదు. ఈ లోకమందు తిరిగి జన్మింపక దేవలోకంలో నివాసాన్ని పొందుతారు.

## ఆర్జితబ్రహ్మోత్సవం

అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులను బంగారు తిరుచ్చిమీద ఆలయం వెలుపల వున్న వైభవోత్సవమండపానికి తీసుకువెళతారు. అక్కడ శ్రీవారికి ఆర్జిత బ్రహ్మోత్సవంలో భాగంగా, ముఖ్యమైన వాహనాలైన గరుడ వాహనం, 



హనుమంత వాహనం, పెద్దశేష వాహనంలో వేంచేపు చేసి హారతిస్తారు. తర్వాత భక్తులకు శఠారి అనుగ్రహిస్తారు.

## ఫలం

ఈ బ్రహ్మోత్సవసేవలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి అనుగ్రహం వలన బుద్ధిబలం, యశస్సు, ధైర్యం, ఆరోగ్యం, కీర్తి, ధనలాభం, సత్సంతానప్రాప్తి కలుగుతుంది.

## ఆర్జిత వసంతోత్సవం

తదుపరి శ్రీవారి ఉత్సవ మూర్తులను స్నానపీఠం మీదకు వేంచేపు చేసి, స్నాన వస్త్రాలను (తెల్లటి) ధరింపచేస్తారు. భక్తులను అనుమతించిన తర్వాత ఘంటానాదంతో వసంతోత్సవ. కైంకర్యాన్ని ప్రారంభించి, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, వరుణదేవతారాధన, ద్రవ్య దేవతారాధన,శ్రీ వైఖానస అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. పంచామృత ద్రవ్యాలైన ఆవుపాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనాదులతో ఆ యా దేవతలను ఆవాహన చేసి అర్చిస్తారు.

అనంతరం అర్చకులు శ్రీవారి మూర్తులకు తీర్థం, పాలు, తీర్థం, పెరుగు .... అనే క్రమంలో నయనానందకరంగా పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. చివరగా కుంభంలోని మంత్రోదకంతో సహస్రధారాస్నపన చేసిన, పవిత్రతీర్థజలాన్ని భక్తుల శిరస్సు మీద చల్లుతారు. తదుపరి శ్రీవారికి వస్త్ర, ఆభరణ, పుష్పమాలా సమర్పణ మరియు మహానివేదన జరిపి, కర్పూర హారతి సమర్పణతో వసంతోత్సవం పూర్తి అవుతుంది.

## ఫలం

ఏతేనోత్సవేన సర్వప్రజావృద్ధిః విజయః కీర్తిశ్చ వర్ధతే, ఇష్టకామానవాప్నోతి విష్ణులోకే మహీయతే సర్వవ్యాధిపీడానివారణసిద్ధిమాప్నోతీతి విజ్ఞాయతే ॥

(-మరీచి విమానార్చనాకల్పం)

ఈ సేవలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి కరుణవలన సంతానవృద్ధి, అన్ని కార్యములలో విజయం, కీర్తి, కోరిన కోరికలు తీరుట, సర్వవ్యాధిపీడ నివారణ జరిగి దేహ అంతమునందు విష్ణుసాయుజ్యం పొందుతారు.

## సహస్రదీపాలంకరణ సేవ

సర్వాలంకారభూషితులైన ఉభయదేవేరీ సమేత శ్రీమలయప్పస్వామివారు సాయంత్రం కొలువుమంటపంలో సహస్రదీపాల కాంతులమధ్య ఊంజల్‌సేవ జరుపుకుంటారు. శ్రీవారికి మొదటగా 'పంచకజ్జాయం' నివేదన చేసి, తర్వాత వేదపారాయణ పఠనం, అన్నమాచార్య, పురందరదాసు కీర్తనల ఆలాపన, నాదస్వర సంగీతం మొ॥న కార్యక్రమములు నిర్వహించబడి, శ్రీవారికి నక్షత్రహారతి, కర్పూరనీరాజన సమర్పణ చేస్తారు. అనంతరం శ్రీవారు ఉభయనాంచారి సమేతంగా నాలుగు తిరుమాడా వీధులలో నిత్యోత్సవానికి వేంచేస్తారు. ఆలయానికి 8 దిక్కులలోనూ కర్పూరనీరాజనాన్ని సమర్పిస్తారు. తూర్పు మాడావీధిలో పుష్కరిణి వద్ద 'పుష్కరిణి హారతి' సమర్పణ జరుగుతుంది. తదుపరి కుంభహారతి, కర్పూరహారతి సమర్పణతో శ్రీవారు ఆలయ ప్రవేశం చేస్తారు.

## నిత్యోత్సవఫలం

**నిత్యోత్సవేన మహోత్సవ ఫలం లభేత్, భగవాన్ ప్రీతో భవేత్ ।**
**రాజ్ఞో రాష్ట్రస్య బలవృద్ధిర్భవతి, భ్రమణకాలే యే సేవన్తే,**
**తే పదే పదే యజ్ఞఫలం లభేరన్నితి విజ్ఞాయతే ॥**

నిత్యోత్సవం జరపడం వలన, శ్రీవారికి మహోత్సవములు నిర్వహించిన ఫలం కలుగుతుంది. ఆ దేశరాజు, దేశప్రజలు వృద్ధిమార్గంలో పయనించుతారు. ఉత్సవ సమయంలో శ్రీవారిని సేవించిన వారికి (ఉత్సవర్లను), మూలవిరాట్టుని సేవించిన ఫలితం కలుగుతుంది, అంతేగాక పదే, పదే గొప్ప యజ్ఞములు నిర్వహించిన ఫలితం కలుగుతుంది.



## సాయంకాల అర్చనం (రాత్రి తోమాలసేవ)

శ్రీవారి ఉత్సవమూర్తులు బంగారువాకిలిలో వేంచేపు చేయబడి, సీరా తళిగను నివేదించి, కర్పూర నీరాజనం సమర్పిస్తారు. ఉత్సవర్లను తిరిగి సన్నిధిలో యధాస్థానమునకు వేంచేపు చేసి శ్రీవారికి కర్పూర హారతి సమర్పిస్తారు. తదుపరి రాత్రి కైంకర్యం ప్రారంభమవుతుంది. శ్రీవారి అర్చకుల ఇంటి నుండి, వైఖానస అర్చకస్వామి, మడిగా తలస్నానం చేసి, ధౌత వస్త్రాలు ధరించి, ద్వాదశ ఊర్ధ్వపుండ్రధారియై, సన్నిధిగొల్ల చేతి దివిటీతో ముందురాగా, ఆలయ ప్రవేశం చేసి శ్రీవారికి పాదసేవ చేసికొంటారు. కైంకర్యపరుల హారతిచ్చిన తర్వాత, మూలవర్లకు ఇతరదేవతామూర్తులకు ఉదయం తోమాలసేవలో అలంకరించిన పుష్పమాలలు సడలింపు చేయబడుతుంది. పిదప సన్నిధిలో పరిచారకులచే స్థలశుద్ధి, పాత్రశుద్ధి జరుగుతుంది. అనంతరం జియ్యర్‌స్వాములవారు యమునోత్తురైలోని పుష్పములు వెదురు బుట్టలో వుంచి, శిరస్సు మీదుంచుకుని ధ్వజస్తంభ ప్రదక్షిణగా రాత్రి తోమాలసేవకు పుష్పం యెత్తి సన్నిధి చేరుతారు. వైఖానస అర్చకులు ఘంటానాదం చేసి, జియ్యర్‌స్వామికి ఆలవట్టం యిచ్చి, వారిచేతినుండి తులసి స్వీకరించి, ప్రాణాయామం, సంకల్పం క్రియలు చేస్తారు. యథోక్త క్రమంలో పంచపాత్ర ఆవాహనాదులు చేసి, బంగారుబావి తీర్థంతో పాత్రలు నింపి శ్రీవారిఆరాధనకు సిద్ధం చేస్తారు. తదుపరి మూలవర్లకు ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, శంఖోదకం వంటి ఉపచారములు సమర్పిస్తారు. ఉదయం, మధ్యాహ్నం ఆరాధనలో చేసినక్రమంలో ఇతర దేవతామూర్తులకు ఉపచార సమర్పణ చేస్తారు. తర్వాత మూలవర్లు సహా దేవతామూర్తులందరినీ పుష్పమాలలతో నేత్రపర్వంగా అలంకరిస్తారు. జియ్యర్‌స్వామి నుండి తులసిని శ్రీవారిపాదములవద్ద సమర్పణ చేసినతర్వాత, అర్చకులు తోళప్పాచారివారి వద్దనుండి తులసిని స్వీకరించి వారు మంత్రపుష్పం చదువుతుండగా శ్రీవారికి తులసిని పాదాలకు సమర్పిస్తారు. ఉదయం తోమాలసేవలో వలె జియ్యర్‌స్వాములు 'సాయిత్తిరుళా...' అని పాత్రం చెప్పగానే, కులశేఖరపడి వెలుపలఉన్న అధ్యాపకులు. 'నిత్యానుసంధానం' అనే దివ్యప్రబంధసేవాకాలంలో

పాశురాలను గానం చేస్తారు. నాలాయిర దివ్య ప్రబంధంలోని పెరియాళ్వార్లు సాయించిన పూచ్చుడళ్, కాప్పిడళ్, శెన్నయోంఙ్గు (10 పాశురాలు చొప్పున), శ్రీ ఆండాళ్ గానం చేసిన విన్నీల మేళప్పు (10 పాశురాలు),

నమ్మాళ్వారు – ఓళివిళ్ కాలం, ఉలగముండ పేరువాయా, కణ్గళుమ్ పగలుమ్, ఆళిఏళ.

తిరుమంగైయాళ్వారు – తాయేతంద్రై, వడమారుడిద్రై, ఏళైఏతలన్

తిరుప్పాణాళ్వారు – అమలనాది పిరాన్

మధురకవియాళ్వారు – కన్నినుమ్ శిరుతాంబు.

మొదలైన పాశురాలను శ్రావ్యంగా గానం చేస్తారు. అనంతరం శ్రీవారికి నక్షత్ర హారతి, కర్పూర నీరాజన సమర్పణ జరుగుతుంది. అర్చకస్వామి శ్రీవారికి ఆలవట్టం సమర్పించి, క్షమాప్రార్థన, పాదసేవ చేసినతర్వాత జియ్యర్ స్వాములకు, గోష్ఠికి శఠారి సాయిస్తారు.

## రాత్రి అర్చన

అర్చకస్వామి ఘంటానాదం చేసి, కూర్మాసనంమీద ఆసీనుడై రాత్రి అర్చనకు సంకల్పం చేసుకుని, బంగారుపాత్రలోని తులసిని 'హరిః ఓం శ్రీమతే కేశవాయ నమః' అని అర్చన ప్రారంభించగానే, వేదపారాయణదారు. కేశవాది చతుర్వింశతి నామములు పఠిస్తుండగా అర్చకస్వామి తుళసీదళాలను శ్రీవారిపాదములకు సమర్పణ చేస్తారు. తర్వాత ఘంటానాద సహితంగా శ్రీవారి పంచమూర్తులకు ధూప, దీపసమర్పణ చేస్తారు. శ్రీవరాహ పురాణాంతర్గత శ్రీ వేంకటేశ అష్టోత్తర శతనామావళి పఠనంతో, తులసీదళాలతో శ్రీవారికి 108 నామాలతో రాత్రిఅర్చన జరుగుతుంది. వెంటనే వక్షఃస్థల తాయార్లకు 'శ్రీలక్ష్మీ చతుర్వింశతి నామావళి'తో, శ్రీవారిపాదతులసితో, అర్చన జరుగుతుంది. అనంతరం కర్పూరనీరాజన సమర్పణ జరిగి, అర్చకులు ఆలవట్టం, పాదసేవ చేసుకుని, ఏకాంగి, అర్చనవాద్యార్‌కు శఠారి సాయిస్తారు.



## రాత్రి గంట – ప్రసాదాలు

బంగారువాకిలి వద్ద పరిచారకుడు 'తళిగా'అని పిలువగానే, అర్చకులు గర్భాలయంలోను, శయన మంటపంలోనూ మంత్రోదకంతో ప్రోక్షణ చేస్తారు. పోటువారు సన్నిధిలోపల వేదిక మీద మరీచ్యన్నం (మొళహోర), బలి అన్నం, రెండు వెదురు బుట్టలలో త్రాం ద్రవం (తోమాల దోశె), లడ్డు, వడ ఉంచుతారు. కులశేఖరపడి వెలుపల దక్షిణం వైపు తింత్రిణీఫల రసాన్నం (పులిహోర–శ్రీవారికి నివేదించిన తర్వాత బేడిఆంజనేయస్వామివారికి నివేదించబడుతుంది), కదంబం ఉత్తరం వైపు గుడాన్నం (చక్కెర పొంగళి) ఉంచుతారు. రాములవారి మేడవద్ద తలుపులు వేయబడి, మహాఘంటానాదం ప్రారంభమవుతుంది. అర్చకస్వామి రాత్రి భోజ్యాసనమునకు సంకల్పం చేసికొని, యధారీతిగా ప్రసాదములను మంత్రోదకంతో ప్రోక్షించి, తులసీ దళములుంచి, అన్నసూక్త పఠనంతో శ్రీవారికి నివేదన చేస్తారు. మధ్యమధ్యలో పానీయసమర్పణ జరుపుతారు. నివేదన అయిన తర్వాత శ్రీవారికి కర్పూర నీరాజన సమర్పణ చేసి, ఆలవట్టం సమర్పించి, పాదసేవ, క్షమాప్రార్థన చేస్తారు. తదుపరి ద్వారములు తెరువబడి ప్రసాదాలను, పట్టెడవద్దకు చేరుస్తారు. సన్నిధిలో పోటువారు. 'తిరువీశం ఘంట' నివేదన కొరకు చక్కెరపొంగళి, శుద్ధాన్నం సన్నిధిలోని వేదికపై నుంచుతారు. అనంతరం అర్చకస్వామి 'నిశిరాత్రి నివేదనం' అనబడే నైవేద్యాన్ని శ్రీవారికి నివేదన చేస్తారు. ఈ సమయంలో పెద్దగంటలకు బదులుగా, స్నపన మంటపంలోని చిన్న గంటను మ్రోగిస్తారు. నివేదన పూర్తికాగానే శ్రీవారికి కర్పూరనీరాజన సమర్పణ, ఆలవట్టం, పాదసేవ, క్షమాప్రార్థన జరుగుతాయి. ద్వారములు తెరువబడి, తిరువీశం నైవేద్యం భాష్యకార్ల సన్నిధికి నివేదనకై చేరుస్తారు. అర్చకులు ఉదయం చేసినట్లుగానే బలిపాత్రలోని హవిస్సును ఆలయాశ్రిత దేవతలకు సమర్పిస్తారు.

తర్వాత కర్పూరహారతి, ఆలవట్టం, పాదసేవ, క్షమాప్రార్థన శ్రీవారికి సమర్పించి, జియ్యర్‌స్వామివారికి, ఇతర ఆచార్యపురుషులకు తీర్థం, శఠారి, ప్రసాదం వినియోగం జరుపుతారు. శ్రీవారికి 'సర్కార్ హారతి' చేసి, భక్తులను సర్వదర్శనానికి, అనుమతిస్తారు. ఈ సమయంలో 'ఏకాంతసేవ' (పర్యంకాసనం)

కైంకర్యం నిర్వర్తించేందుకు మరొక అర్చకస్వామి, శ్రీవారి అర్చకుల ఇంటినుండి ఆలయానికి వచ్చి, పాదసేవ, కైంకర్యపరుల హారతి చేస్తారు. సర్వదర్శనం సమాప్తి అయిన తర్వాత శ్రీవారికి చివరిసేవగా 'పవళింపు సేవ'ను జరుపుతారు.

**పర్యంకాసనము (ఏకాంతసేవ)**

సన్నిధిలో శ్రీవారిమూలవర్లకు, ఇతర దేవతామూర్తులకు రాత్రి తోమాలసేవలో, అలంకరించిన పుష్పమాలలు సళ్ళింపు చేస్తారు. సన్నిధిలో పరిచారకులు పాత్రశుద్ధి, స్థలశుద్ధి చేస్తారు. శ్రీవారికి 'సర్కార్ హారతి' జరిపి అధికార సిబ్బందికి తీర్థం, శఠారి వినియోగం అయిన వెంటనే సభ అరవారు. శ్రీవారి పవళింపు సేవకు వినియోగించే బంగారు నవారు మంచము, పరుపు, దిండ్లు సహా, శయన మంటపంలో గొలుసులకు వేలాడదీస్తారు. శయన మంటపంలో ముగ్గువేసి, దీపాలను వెలిగించి ఉంచుతారు.

**మృగనాభి శ్చ తాంబూలం గంధః పుష్పం తథైవ చ।**
**ప్రదక్షిణనమస్కారౌ పర్యంకాసనసంగ్రహే ॥**

పర్యంకాసనంలో మొత్తం ఐదు ఉపచారములు చెప్పబడినవి. మృగనాభిశ్చ తాంబూలం (కస్తూరి సహిత సువాసన భరితమైన తాంబూలం), గంధము, పుష్పము, ప్రదక్షిణ, నమస్కారములు అని 5 ఉపచారములు. భగవదారాధనలో చివరి అంశమైన 'ఏకాంతసేవ' (పవళింపుసేవ) నే ఆగమపరిభాషలో 'పర్యంకాసనం' లేక 'శయనాసనం' అని అంటారు. ఈ సేవలో, శ్రీవారి ప్రతిరూపమైనభోగమూర్తిని రాత్రి నిద్రకుపక్రమింపజేసి, ఆలయద్వారములు మూసివేయటం జరుగుతుంది. ఈ సేవను, కౌతుకబేరం శ్రీ భోగశ్రీనివాసమూర్తి వారికి జరుపుతారు. వైఖానసాగమంలో చెప్పబడిన విధంగా శయన బేరముగా, శ్రీవారి పంచమూర్తులలోని కౌతుకబేరం, లేదా బలిబేరం లేదా యితర బేరములలో ఏదైన ఒక మూర్తికి గాని, లేక శ్రీకృష్ణునిమూర్తిని శయనం చేయించవచ్చు.

**కౌతుకం బలిబేరం వా అన్యలౌకికమేవ వా ।**
**అథవా కృష్ణరూపం వా, శయనాయ ప్రకల్పతే ॥**



అందువల్ల, ధనుర్మాసం (మార్గశిర మాసం)లోని 30 రోజులు, శ్రీ భోగ శ్రీనివాసమూర్తివారికి బదులుగా సన్నిధిలో వేంచేసియున్న వెండి కృష్ణస్వామి మూర్తికి ఏకాంతసేవ జరుపుతారు.

సన్నిధిలో శుద్ధి అయిన తరువాత పోటువారు వేడిగా కాచిన ఆవుపాలు సన్నిధికి తెస్తారు. సభ అరవారు పంచకజ్జాయం (జీడిపప్పు, బాదంపప్పు, ఎండుద్రాక్ష, కలకండ మొ॥వి), మధురఫలాలు (అనేక రకాలైన పండ్లు ముక్కలుగా తరిగి), తాంబూలం, చందనం సిద్ధం చేసి సన్నిధికి తెస్తారు. అర్చకస్వామి పంచపాత్రలలో, బంగారు బిందెలోని తీర్థం నింపి ఉంచుతారు. ఆలయఐతిహ్యం ప్రకారం రాత్రి తలుపులు వేసిన తర్వాత బ్రహ్మాది దేవతలు శ్రీవారికి ఏకాంతంగా ఆరాధన చేస్తారని ప్రతీతి. వారి ఆరాధనకోసం అభిమంత్రించిన మంత్రోదకం బంగారుబిందె నుండి పంచపాత్రలలోనింపి సిద్ధం చేస్తారు. శ్రీవారికి గడ్డం బొట్టు పచ్చకర్పూరంతో అలంకరిస్తారు. శ్రీవారి బంగారు పాద కవచములు తీసి, స్వామివారి పాదములమీద రెండు చందనపు ముద్దలు సమర్పిస్తారు. వక్షఃస్థలలక్ష్మీఅమ్మవారికి ఒక చందనపు ముద్ద వుంచుతారు. మరొక చందనపు ముద్ద బ్రహ్మాది దేవతలు చేసే ఆరాధనకోసం ఉంచుతారు. తరిగొండవారు 'ముత్యాలహారతి' తట్టలో ముత్యాల చేత శ్రీవారి రూపము ఏర్పరిచి, అందులో హారతికర్పూరం ఒక గిన్నెలో ఉంచి, మడుపు (తమలపాకులు, వక్కలు) తో సహా సిద్ధం చేస్తారు.

ఏకాంతసేవకై సిద్ధం చేసిన నైవేద్యాలను అర్చకస్వామి శ్రీవారి పంచబేరములకు నివేదన చేస్తారు. తదుపరి సన్నిధిలో వైఖానస అర్చకులు మాత్రం ఉండగా, రాములవారి మేడ తలుపులు వేయబడి, అర్చకులు మంచం మీద మంత్రోదకంతో ప్రోక్షించి, ఉదయం ఆరాధన సమయంలో మూలవర్లు నుండి ఇతర బేరములకు ఆవాహన చేసిన శక్తిని, తిరిగి మూలవర్లులోకి అవరోపణ చేసి, శ్రీవారిశయనబేరం, శ్రీభోగశ్రీనివాసమూర్తివారిని, మంచంలో దక్షిణంవైపు శిరస్సు భాగముండునట్లు శయనింపజేస్తారు. శయన సూక్తం పఠించి, ప్రదక్షిణ, నమస్కార, క్షమా ప్రార్థన చేస్తారు. ఈ సమయంలో

బంగారువాకిలి వద్ద 'తిరుచూర్ణాలు' అనే వాద్యం ప్రయోగించబడుతుంది. తలుపులు తెరిచిన వెంటనే, తాళ్ళపాక అన్నమాచార్యవంశీయులు లాలిపాటలు పాడుతుండగా సన్నిధిలో శ్రీవారి పంచమూర్తులకు తరిగొండవారి 'ముత్యాలహారతి'ని అనే కర్పూరనీరాజన సమర్పణ జరుగుతుంది. తర్వాత శయనమంటపంలో బంగారునవారుమంచంపై శయనించిన భోగ శ్రీనివాసమూర్తివారికి కర్పూరహారతి యిస్తారు. అర్చకులు శ్రీవారికి ఆరగింపుచేసిన పాలను ఒక వెండి గిన్నెలో తీసుకుని వచ్చి, ఏకాంగి మొ॥గు వారికి క్రమంగా పాలు యిస్తారు. సన్నిధిగొల్ల ముత్యాలహారతిని ఆలయఅధికారులకు చూపించగా, అర్చకులు అందులోని తాంబూలం మడుపు ఆలయఅధికారులకు అందజేసి, తర్వాత ఆలయఅధికారులకు పాలు, పండ్లు, పంచకజ్జాయం మొదలైన ప్రసాదాలు వినియోగం చేస్తారు. అందరూ శ్రీవారిప్రసాదం స్వీకరించి వెలుపలికి వచ్చిన తర్వాత రాములవారిమేడ వద్ద తలుపులు దగ్గరగా వేస్తారు. వైఖానస అర్చకులు, ఏకాంగి, సన్నిధిగొల్ల వీరు మాత్రం లోపల వుంటారు. ఏకాంగి శయన మంటపంలో దీపాలను శాంతింపజేస్తారు. అర్చకులు సన్నిధిలో శోధన చూసుకుని, అన్ని వస్తువులు సరిగ్గా వున్నాయా అని సరిచూసుకుంటారు. దీనికే ఆలయపరిభాషలో 'సాబూతు' చూసుకోవటం అని పేరు. తదుపరి అర్చకులు శ్రీవారికి పాదసేవచేసుకుని, క్షమాప్రార్థన సమర్పించి, ఆలయ తాళాలు 'కుంచెకోల'ను భుజం మీద వుంచుకుని, ఉండగా, ఏకాంగి సన్నిధిలోని రెండు అఖండాలను శాంతింపజేస్తారు. పరదావేసి అర్చకులు మరొకసారి సాబూతు చూసుకుని, అందరూ రాములవారిమేడ దాటి బయటికి వచ్చిన తర్వాత, రాములవారి మేడ తలుపులు మూసివేస్తారు. తర్వాత స్నపన మంటపంలో శోధన చూసుకుని, బంగారు వాకిలి వెలుపలకు వచ్చి, సన్నిధిగొల్ల బంగారు వాకిలికి 3 తాళాలు వేస్తాడు. ఒకటి అర్చకుల వారిది, రెండవది జియ్యర్ స్వామి వారిది, మూడవది దేవస్థానం వారిది. అనంతరం సర్కారువారు అన్ని తాళంకప్పలకు, మొహర్లు వేసి (సీలు వేసి) రెండు తాళం చెవులను (జియ్యర్, దేవస్థానంవారివి) మరియు



'లచ్చన' బీగాల గుత్తిని ఒక చెక్కపెట్టెలో భద్రపరిచి తాళంవేసి, సీలు వేస్తారు. అర్చకులు కుంచెకోలతో సహా బయలుదేరి, వెండివాకిలి దాటి ధ్వజస్తంభ మంటపంవద్దకు వచ్చి, అక్కడ ఈశాన్యమూలలో ఉన్న 'క్షేత్రపాలక బలి పీఠమునకు' 3 మార్లు కుంచెకోలను తాకించి, 'క్షేత్రపాలకా పారాహుషార్' అని హెచ్చరించి, ఇంటికి కుంచెకోలతో సహా వెళతారు.

తిరుమల శ్రీవారి ఆలయానికి, క్షేత్రపాలకుడైన రుద్రుడు, రాత్రి సమయంలో క్షేత్రానికి కావలిగా వుంటాడని క్షేత్ర ఐతిహ్యం. తదుపరి మిగతా సిబ్బంది. అందరూ బయటికి వచ్చి మహాద్వారంవద్ద ఉన్న పెద్ద తలుపులను మూయటంతో ఆ రోజు ఆలయంలోని కార్యక్రమాలు సమాప్తి అవుతాయి. ఇది ప్రతినిత్యం అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగే నిత్యార్చనాకైంకర్యాల విశేషాలు.

### అర్చనాఫలం – విశ్వమానవ సౌభ్రాత్రము

శ్రీ వైఖానసాగమం కాని మరియే ఇతర ఆగమాలు కాని ప్రధానంగా విశ్వమానవ పరస్పర సహకారమే ప్రధాన సిద్ధాంతమన్న సూత్రముపై ఆధారపడి, తమ శాస్త్రములను రూపొందించి లోకానికి అందజేయబడింది. ఈ సహకారం కేవలం భౌతిక పరమైన వాటికి పరిమితం గాకుండా, ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కూడా అని గమనించాల్సిన అవసరం ఉంది. ఆముష్మిక (మోక్ష) ప్రాప్తికై తపస్సు, సత్ప్రవర్తనల ద్వారా ప్రయత్నించి, మోక్షసాధన పొందిన పుణ్యజీవులను మనం పూజించటంవల్ల, ఇతర దుష్ట శక్తులను మననుండి తొలగించుకుని వాటి దుష్ప్రభావములు మనమీద ప్రసరింపజేయకుండా చేసుకోవడమే, ఈ దేవాలయార్చనలోని ముఖ్యమైన విశేషం. మానసిక శాంతి, సంతృప్తి, సంతోషము మొదలైన భావనలు, భగవంతుని గురించి తెలుసుకోవటంలోనూ. అష్టాంగ యోగసాధనలోనూ, తదేక లక్ష్యసిద్ధి సాధించడానికి తప్పకుండా ఉపయోగపడుతుంది. ఇలాంటి మంచి సాధనలు, చివరకు మన లక్ష్యమైన మోక్షము (లేదా ఏ ఇతరములు)నకు చేరుస్తుంది.

ప్రతి నిత్యం పూజ, బలి సమర్పణము అనే రెండు క్రియలు దేవాలయాలలో జరగడం వలన, దేవతలందరూ సంతృప్తి చెంది, లోకంలో న్యాయము, ధర్మము వృద్ధి అవునట్లు అనుగ్రహిస్తారు. భగవాన్ విఖనసమహర్షి అర్చనాఫలం గురించి వివరిస్తూ, ఇంటిలో గానీ, దేవాలయమునందుగానీ, భక్తితో భగవంతుడైన నారాయణునికి అర్చనచేయుటవలన, పరమపదనివాసస్థానమైన శ్రీవైకుంఠప్రాప్తి, తప్పక కలుగుతుంది అని తెలియజేసియున్నారు.

ప్రాతఃకాలపూజ, నిత్య జప హోమాదులను క్రమము తప్పక చేయువారి లోపదోష నివృత్తి కొరకు, మధ్యాహ్నపూజ రాజ, రాష్ట్ర గ్రామాభివృద్ధి కొరకు, సాయంకాలం పూజ సస్యవృద్ధి కొరకును చెప్పబడింది. అర్ధరాత్రి పూజ అన్ని చతుష్పాత్తు జంతువుల (నాలుగు పాదములు కలిగిన జంతువులు) అభివృద్ధికి అని వైఖానసాగమం పేర్కొన్నది. ఇటువంటి పూజలవలన మన భుక్తి ప్రయత్నం తీరడమే కాక సర్వజీవ సంతృప్తి, సంతోషములు గూడా దీనివల్లనే ప్రాప్తిస్తాయి.

**అర్థం తృప్యతి నైవేద్యా త్రిపాదం హోమపూజనాత్।**
**పూర్ణం బలిప్రదానాచ్చ వినియోగా త్పుతృప్యతి॥**

భగవన్నివేదనం వలన స్వామి సగము తృప్తి పొందుతాడు, మూడవ భాగము హోమారాధనవల్ల, బలిప్రధానమువల్ల తృప్తి పొందినప్పటికీ, భక్తులకు తన ప్రసాదం వినియోగం చేయటంవల్ల భగవంతుడు అత్యంత సంతృప్తి చెందుతాడని శ్రీ వైఖానస సంహితలందు అత్రిమహర్షి తెలియజేసియున్నారు.

ఇటువంటి మహత్తరమైన, వేదవిహిత ఋషి ప్రోక్తం వైఖానసాగమం ప్రకారం ఆరాధన జరిగే తిరుమల దివ్యక్షేత్రంలో శ్రీ శ్రీనివాసస్వామి దర్శనం చేత మాత్రమే అనేక శుభఫలితాలు కలుగుతాయి.

**వైఖానసేన శాస్త్రేణ అర్చనం క్రియతే యది**
**లోకే సర్వత్ర శాంతి స్యాత్ రాజారాష్ట్ర ప్రవర్ధనమ్ ॥**
**(భృగు క్రియాధికారం)**



**వైఖానసం వైదికం స్యాత్ వైదికైరర్చితం ద్విజైః**
**ఐహికాముష్మికఫలప్రదం లోకే సర్వత్ర కీర్తితమ్ ॥**

వైఖానసాగమము అనుసరించి ఎక్కడైతే నిత్యార్చన జరుగుతుందో, అక్కడ సర్వశాంతులు కలుగుతాయి. ఆ దేశమంతా సుభిక్షంగా ఉంటుంది. ఈ వైఖానసార్చన వేదమంత్రములతో కూడి వేదవిహితమై ఉన్నందున ఇహలోకమున సర్వసుఖాలు, భోగభాగ్యాలతో బాటు పరలోకమున మోక్షమును కలిగించగల మహత్తరమైన ఫలితాలనిచ్చునదిగా లోకమునందు కీర్తించబడుచున్నది.

**॥సర్వం శ్రీ శ్రీనివాసార్పణమస్తు॥**

# అనుబంధం

## దేవాలయంలో భక్తుని ప్రవర్తన నియమావళి

శ్రీవైఖానస భృగుసంహిత, ప్రకీర్ణాధికారః (20,36 అధ్యాయాలు). గ్రంథాలలో వైష్ణవాలయాలలో భక్తులు నడచుకోవలసిన నియమాలు వివరంగా తెలియజేయబడినవి. ప్రధానంగా– ఆలయానికి వచ్చిన భక్తుని ప్రవర్తన, ఆలయంలో పాటించవలసిన అనేకములైన విధులు, నిషేధములు భృగుమహర్షులవారు వివరంగా తెలియజేసియున్నారు. ఇది పురుషపరంగా ఉన్నప్పటికీ, ఇవన్నీ స్త్రీ–పురుషులిరువురికి సమంగా వర్తిస్తాయి. ఆ నియమాలను విధిగా ఆచరిస్తే, శ్రీవారి పరిపూర్ణకృపకు పాత్రులవుతారనే విషయంలో ఎటువంటి సందేహం లేదు.

**1.** ఆలయంలోపల యానం (వాహనం – చక్రాలతో, యంత్రాలతో నడిచేది) మీద కాని, పాదరక్షలతోకాని ప్రవేశింపరాదు, తిరుగరాదు.

**2.** మెల్లగా ప్రదక్షిణచేసిన తర్వాత ఆలయంలోనికి ప్రవేశించాలి.

**3.** విమానం (గర్భగుడి గోపురం) సాక్షాత్తూ శ్రీ మహావిష్ణు స్వరూపం కావున దాని శిఖరాదులనీడలను పాదాలతో త్రొక్కరాదు.

**4.** ఆలయాన్ని ప్రదక్షిణగా చుట్టిరావడానికి ముందే, దైవానికి ప్రసన్నమైన మనస్సుతో నమస్కారం చేయాలి.

**5.** ప్రదక్షిణ చేసే సమయంలో తప్ప, ఇంకెప్పుడూ దేవాలయం ధ్వజస్తంభం నీడనుకాని, విమానం నీడనుకాని, మహాద్వారరాజగోపుర ఛాయనుకాని, ప్రాకారం నీడనుకాని దాటకూడదు.

**6.** యజ్ఞోపవీతము (జందెము) ఉన్నవారు నడుముకి చుట్టుకుని కాని, చెవికి తగిలించుకుని కాని, అపసవ్యంగా వేసుకుని లేదా దండవలె ధరించిగాని ఆలయప్రవేశం చేయరాదు. గోచీ లేకుండా ధోవతిని కట్టుకోరాదు. నగ్నంగా గానీ, కౌపీనం మాత్రమే ధరించికాని ఆలయంలోనికి ప్రవేశించరాదు.



**7.** మనోహరాకారుడైన విష్ణువును దర్శించుకోవడానికి ఆలయంలో ప్రవేశించేముందు ఉపవీతమును సవ్యంగా ధరించి, సదాశుచియై మంచి ఉత్తరీయం ధరించి ఆ దేవదేవుని దర్శించాలి. తలపాగా, టోపిధరించి కాని, చేతిలో ఆయుధం పట్టుకుని కాని హరిని దర్శించుకోరాదు. వస్త్రంతోకాని (ఉత్తరీయం), శాలువాతో కాని శరీరం కప్పుకోవాలి.

**8.** రిక్తహస్తుడుగా కాని (చేతిలో భగవంతుడికి సమర్పించటానికి ఏదీ లేకుండా), తిలకం ధరించకుండా కానీ, ఉత్తరీయం లేకుండా కానీ, తాంబూలం నములుతూ కాని, తినుబండారాలు తింటూకానీ, పానీయసేవనం చేస్తూకానీ దేవాలయం లోనికి ప్రవేశింపరాదు. అట్లా ప్రవేశిస్తే పాపం చుట్టుకుంటుంది.

**9.** దేవాలయంలో శ్రీవారి ప్రసాదం తిని, మిగిలిన దానిని అక్కడనే విడిచిపెట్టి వెళ్ళిపోయినా, లేదా ప్రసాదం తినకుండా పారవేసినా, వద్దన్నా అలాంటి మూర్ఖులు, విపత్తుల పాలవుతారు.

**10.** వీలయినంత వరకు వ్యాధులతో ఉన్నవారు ఆలయ ప్రవేశం చేయరాదు.

**11.** చంచలమైన మనస్సుతో హరిని దర్శించకూడదు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని ఆ దేవదేవునికి పరిపూర్ణ శరణాగతితో దర్శించాలి.

**12.** దేవాలయంలో కాళ్ళు బార్లా చాపి కూర్చున్నా, నిద్రపోయినా అతడు నరకం పాలు అవుతాడు.

**13.** దేవాలయంలో ప్రవేశించి భక్తితో రోదించకూడదు. రోదిస్తూ దేవుని స్తుతించకూడదు. అలాచేస్తే అతని మనస్సు మలినమైనదని చెప్పవచ్చు. పరమపద మోక్షసాధనకు సులభమైన మార్గాన్ని చూపే హరి ఉన్న ఆలయంలో మలినమైన మనస్సుతో హరిని సేవించే వ్యక్తికి, విష్ణువు యొక్క పరమపద విశిష్టత తెలియదన్నమాటే! ఇది వైకుంఠానికి వచ్చినా తన ఇంటిని (భూలోకంలో ఉన్న) విడిచి పెట్టివచ్చానే అని భావించిన దానితో సమానం!

**14.** రాగద్వేషాలకు అతీతమైన మనస్సు, హింసాదిరహితమైన శరీరం, సత్యమును పలికి ధర్మాచరణ చేసే మనస్తత్త్వం. ఈ మూడు కేశవారాధనలో ప్రధాన అంశాలు.

**15.** ఏ ప్రాణికైనా దుఃఖం కలిగించే ఎలాంటి హింసనూ ఆలయంలో చేయరాదు.

**16.** విష్ణువుఆలయంలో ప్రవేశించి వ్యర్థ సంభాషణలు చేసే వ్యక్తి, ఎదుట సిద్ధంగా ఉన్న నవనిధులను విడిచి పెట్టి, గవ్వలకోసం భిక్షమెత్తేవాడితో సమానం. అమృతాన్ని విడిచిపెట్టి, అన్నం కోసం భిక్షం అడిగేవానితో సమానం. ఆలయంలో కొన్ని క్షణాలపాటైనా పరమాత్మను గురించి ధ్యానం చేయకపోవటం హానికరం. అది మహాప్రమాదం, భ్రాంతికరం. (అనవసరంగా మాట్లాడడానికి అనేక ప్రదేశాలు, అనేక సమయాలు విశేషంగా ఉండనే ఉన్నవి.) అందుచేత, తిరుమలక్షేత్రంలో, శ్రీవారి ఆలయంలో ప్రవేశించే మహద్భాగ్యం పొందిన వ్యక్తి, ఇతర ఆలోచనలు విడిచి పెట్టి, అమూల్యమైన ఆ సమయంలో హరిని మాత్రమే చింతిస్తూ, హరినామస్మరణ చేయాలి.

**17.** ఆలయంలో దేవుని ముందర నిలబడి అబద్ధాలు చెప్పరాదు. భగవంతుడు సత్యస్వరూపుడు. ఆయన ఎదుట సత్యమును దాచకూడదు.

**18.** దేవాలయంలో వ్యర్థమైన, సంబంధంలేని, విపరీతమైన శాస్త్రచర్చలు చేయకూడదు. అట్లా క్షణంపాటు గడిపినా, అది దేవుని అవమానించినట్లే. శ్రీవారిసన్నిధిలో లౌకిక పుస్తకాలు చదువుకోవటం, వ్రాయడం చేయరాదు. అట్లా చేసే వ్యక్తి అక్షరద్రోహి, దేవుని ధిక్కరించినవాడు అవుతాడు.

**19.** దేవాలయంలో అనర్థ ప్రసంగాలు చేసే వ్యక్తి, ఐదు జన్మల వరకు తిత్తిరి పక్షిగా జన్మిస్తాడు.

**20.** దేవాలయంలో, హరి సన్నిధి యందు, ఎన్నడూ వివాదములు పెట్టుకోరాదు. వివాదములకు అది స్థానం కాదు. ఎట్టి పరిస్థితులలోను హరి సమక్షంలో వివాదాల జోలికి వెళ్ళకూడదు.



**21.** దేవాలయంలో అహంకారంతో తనను తానే పొగడుకునే వ్యక్తి, దేవుడిని, పెద్దలను లెక్కచేయకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడే వ్యక్తి, గర్వించినవాడై, తనకు సంక్రమించే మహత్తరమైన దోషాన్ని గుర్తించలేడు.

**22.** తాను ఎంతటి స్థితిలో వున్నప్పటికీ, దేవాలయంలో తనకంటే పెద్దవారిని "నీవు" అని ఏకవచనంతో సంబోధించరాదు. ఆలయంలో దేవుని ఎదుట, ఇతరులను దూషించటం లేదా పొగడటం ఎట్టి పరిస్థితులలోను చేయరాదు. శ్రీవారిఆశీస్సులు, అనుగ్రహంకోరే వ్యక్తి, ఆలయంలో ఇతరులను పొగడటం, పూజించటం చేయకూడదు.

**23.** ఆలయంలో ఉన్నప్పుడు ఇతరులకు ప్రణామం చేయరాదు. అక్కడ నారాయణుడే సర్వేశ్వరుడు.

**24.** దేవాలయంలో దేవునికి వీపు భాగం చూపిస్తూ కూర్చోరాదు. భక్తుడు అన్ని వేళల్లో దేవునికి అభిముఖుడై ఉండాలి. భగవదాశీస్సులు కోరే వ్యక్తి దేవునికి వీపు చూపరాదు, ఒక ప్రక్కగా తిరిగి మాత్రమే ఆలయం నుంచి నిష్క్రమించాలి.

**25.** అధికార గర్వంతో ఎవడు, అకాలంలో ఆలయంప్రవేశించి, భగవంతుని సేవించాలని కోరుతాడో అతడు దుర్గతిని పొందుతాడు. నిర్దేశించిన కాలములనందే, వివేకవంతుడైన వ్యక్తి భగవంతుని సేవించాలి. చివరి అర్చన జరిగిన తర్వాత ఆలయ ద్వారాలు మూసివేయబడుతవి. మరల ప్రత్యూష కాలంలో ద్వారాలు తెరువబడుతాయి. ఈ మధ్య కాలంలో (అకాలంలో) హరిని సేవించరాదు. భక్తులు స్వామివారి సేవలలో పాల్గొనేటప్పుడు కూడా అకాలములు చాలా ఉంటాయి. ఆ సమయాలలో తెరవెనుక స్వామికి కొన్ని సేవలు జరుగుతుంటాయి. అలాంటి సమయంలో తెర తీసి చూడాలని ఆసక్తి కనపరచడం, చూడటం చాల తప్పు. కావున భక్తులు అలాంటి అకాలదర్శనాలు చేసుకోరాదు.

**26.** లౌకిక విషయములందు అమిత ఆసక్తిపరుడై, విష్ణ్వారాధన చేయనివాని జన్మ, వాని కర్మలు ఈ కర్మభూమిలో విఫలములు కావటం తప్పదు. గురువు

నందు మానుషభావం, దైవమునందు శిలాభావం, మంత్రములందు జీవికాభావం, యజ్ఞములందు హింసాభావం, అర్చకులపట్ల, అర్చనలపట్ల నీరసభావం కలవ్యక్తి సర్వధా నిందించతగినవాడు. వానికి ఏవీ సిద్ధించవు వాని జీవితం వ్యర్థము.

**27.** దేవాలయంలో విష్ణువుపట్ల జరిగే క్రింది 22 అపచారాలను. భక్తుడు సదా వర్జించాలి:

**1.** భగవదాలయంలో యానం మీదకాని, పాదుకలతోకాని సంచరించడం.

**2.** దేవోత్సవములలో పాల్గొనకపోవటం; దేవుని ఎదుట ప్రణామం చెయ్యకపోవటం.

**3.** ఒక చేతితో ప్రణామం చేయటం; ప్రణామానికి పూర్వమే ప్రదక్షిణ చేయటం.

**4.** అశుచిగా, చంచల మనస్సుతో భగవంతునికి నమస్కారం చేయటం.

**5.** దేవుని ఎదుట పాదములు చూపించటం (కాళ్ళు చాపటం), పడక మీద కూర్చుండటం.

**6.** దేవునిముందు శయనించటం.

**7.** దేవునిముందు భోజనం చేయటం.

**8.** వ్యర్థ సంభాషణలు చేయటం.

**9.** దేవుని ముందు బిగ్గరగా మాట్లాడటం, వృథా కాలయాపన చేయటం, ఏడవటం, తగవులాడటం.

**10.** ఇతరులను శిక్షించటం, బహుమానాలు ఇవ్వటం చేయరాదు.

**11.** స్త్రీలతో సరసమాడటం, అశ్లీల కథనాలు మాట్లాడటం.

**12.** అపాన వాయువు విడవటం.

**13.** దుప్పటి కప్పుకుని రావటం.



**14.** పరనింద, పరస్తుతి.

**15.** భక్తుని వద్ద ధనం ఉన్నప్పటికీ నామ మాత్రంగా స్వామివారికి మ్రొక్కుబడులు చెల్లించటం.

**16.** నైవేద్యం చేయని వస్తువును భుజించటం.

**17.** ఆ యా కాలములందు లభించే ఫలములను భగవంతునకు సమర్పించక పోవటం.

**18.** నైవేద్యం పెట్టినదానిలో మిగిలినవాటిని మన ఇంటి అవసరములకు వాడుకోవటం.

**19.** భగవంతునికి వీపు చూపుతూ కూర్చొనటం.

**20.** ఆలయంలో ఇతరులకు నమస్కరించటం, గురువులను మన్నించకపోవటం.

**21.** స్వీయ స్తోత్రం, చేయటం.

**22.** దేవతానిందచేయటం

పై తెలియపరచిన అన్ని అపచారలములను దేవాలయంలో, భక్తుడు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ పొరపాటుగా అపచారములు జరిగినప్పుడు. 'క్షమించుము' అని విష్ణువు పాదముల వద్ద పరిపూర్ణ శరణాగతి చేస్తూ భగవంతుని ప్రార్థించాలి. అట్లా చేస్తే నిష్కృతి జరిగి, ఉపద్రవం తప్పుతుంది. భగవంతుని పరిపూర్ణ కటాక్షమునకు పాత్రులవుతారు.

## ఉపయుక్త గ్రంథాలు


**1.** శ్రీలక్ష్మీ విశిష్టాద్వైత భాష్యమ్ – శ్రీ శ్రీనివాసదీక్షితులు

**2.** శ్రీమద్భగవదర్చా ప్రకరణమ్ – శ్రీ మన్నృసింహవాజపేయయాజి

**3.** శ్రీవిష్ణ్వర్చనా సారసంగ్రహః – శ్రీ గోపన భట్టాచార్యులు

**4.** శ్రీవిష్ణ్వర్చనా నవనీతమ్ – శ్రీ కేశవాచార్యులు

**5.** వైఖానసాగమము (TTD) – ఆచార్య S.K.రామచంద్రరావు.

**6.** తిరుపతి చరిత్రము (TTD) – దీవి రంగనాథాచార్యులు

**7.** సవాల్ జవాబ్ కైంకర్యపట్టీ – తి.తి.దేవస్థానం

**8.** శ్రీ వేంకటాచల మాహాత్మ్యమ్ 1817 – వేదవ్యాస ప్రణీతం

**9.** భగవదారాధనచంద్రికా – శ్రీ నారాయణం రామానుజాచార్యులు

**10.** హిల్‌ష్రైన్ ఆఫ్ వేంగడం (ఆంగ్లం) – ఆచార్య S.K.రామచంద్రరావు.

**11.** ప్రకీర్ణాధికారః (TTD) – భృగు మహర్షి

**12.** ఆనంద సంహితా (TTD) – మరీచి మహర్షి

**13.** విమానార్చనా కల్పమ్ (TTD) – మరీచి మహర్షి

**14.** జ్ఞాన కాండ (TTD) – కాశ్యప మహర్షి

**15.** శ్రీ TT అముల్ నామా 1971 – తి.తి.దేవస్థానం

**16.** సమూర్త్యర్చనాధి కరణః (TTD) – అత్రి మహర్షి

**17.** క్రియాధికారః (TTD) – భృగు మహర్షి

**18.** వాసాధికారః (TTD) – భృగు మహర్షి

**19.** నిత్యానుసంధానమ్ (TTD) – శ్రీ T.A. కృష్ణమాచార్యులు